జాతీయ స్ఫూర్తి
పక్షపత్రిక
2021, ఫిబ్రవరి 1-15
వెల : రూ.15/-

ప్రతి ఐదేళ్ళకీ జరగాల్సిన పంచాయితీ ఎన్నికలకు గ్రహణం ఎందుకు పట్టింది ?

ఆర్థిక స్వస్థతను నిర్ణయించేది ఆ రెండు సంఖ్యలే !

ప్రపంచం మనలను గమనిస్తోంది

మానవత్వం మరిచిపోతున్న గణతంత్రమా మనది

చరిత్రలో అతిపెద్ద దుర్దినం జనవరి 30

ప్రపంచంలో అరుదైన రైతుల ప్రదర్శన

CAAకు రైతు ఉద్యమమే మార్గదర్శి !

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి; సమాఖ్య స్ఫూర్తిని కాపాడాలి

సంపాదకునిగా ఏంగెల్స్

గ్రాంసీ ఆలోచనలు - ఆవశ్యకత

ఎలియనేషన్

9

జాతీయ **స్ఫూర్తి** పక్షపత్రిక

వ్యవస్థాపక సంపాదకులు, ప్రచురణకర్త
నిడదవోలు వెంకటేశ్వరరావు

2021 ఫిబ్రవరి 1-15 సంపుటి : 29 సంచిక : 9

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు
సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్

వెల : 15/- రూపాయలు

## ఈ సంచికలో...

3 ప్రతి ఐదేళ్ళకీ జరగాల్సిన పంచాయితీ ఎన్నికలకు గ్రహణం ఎందుకు పట్టింది? - డి వి వి ఎస్ వర్మ

5 ఆర్థిక స్వస్థతను నిర్ణయించేది ఆ రెండు సంఖ్యలే ! - జయతీ ఘోష్

6 ప్రపంచం మనలను గమనిస్తోంది

8 మానవత్వం మరిచిపోతున్న గణతంత్రమా మనది - మాడభూషి శ్రీధర్

11 చరిత్రలో అతిపెద్ద దుర్దినం జనవరి 30 - ఇఫ్టూ ప్రసాద్

13 ప్రపంచంలో అరుదైన రైతుల ప్రదర్శన - డాక్టర్ కొల్లా రాజమోహన్

15 CAAకు రైతు ఉద్యమమే మార్గదర్శి ! - అజయ్ గుడవర్తి

17 రాజ్యాంగాన్ని పరిరక్షించాలి; సమాఖ్య స్ఫూర్తిని కాపాడాలి - డా. పి. నారాయణ రావు

19 వాళ్లు అభూతకల్పనల్ని చరిత్ర అంటారు ప్రొ. రొమిలా థాపర్

21 సంపాదకునిగా ఏంగెల్స్ - కొండూరి వీరయ్య

26 గ్రాంసీ ఆలోచనలు - ఆవశ్యకత - బండారు రమేష్

28 ఎలియనేషన్ - వి.విజయకుమార్

**సంపాదకీయం**

# క్యాష్‌లెస్ బడ్జెట్

పేపర్‌లెస్ బడ్జెట్ అంటూ ఊరించిన బడ్జెట్ అంతిమంగా క్యాష్‌లెస్ బడ్జెట్‌గా పుట్టుకొచ్చింది. బడ్జెట్ అంటే అంకెల గారడీ అన్న నానుడి రోజురోజుకీ బలపడుతున్నది, స్థిరపడుతున్నది. ప్రస్తుతం 2021-22 సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఈ దారిలో మరో ముందడుగు మాత్రమే.

2021-22 బడ్జెట్ 34,88,236 కోట్లు. చూడడానికి ఎంతో ఘనంగా కనిపిస్తుంది. తరిచి చూస్తే అంతా డొల్లే. గత సంవత్సరం 2020-21కి సవరించిన బడ్జెట్ 34,50,305 కోట్లు. అంటే ఈ బడ్జెట్‌లో పెరిగింది కేవలం 32,961 కోట్లు మాత్రమే. ఇదే అందరికీ పంచడానికి, అభివృద్ధిని పెంచడానికి మిగిలింది. అంకెలగారడీ చెయ్యడానికి 15 లక్షల కోట్లు లోటు చూపించారు. దీనికి తోడు ప్రభుత్వరంగ ఆస్తుల అమ్మకాల లక్ష్యాన్ని 1.75 లక్షల కోట్లుగా ప్రకటించారు. ఇలా లోటు పేరుతో అప్పులను, ఆస్తుల అమ్మకాల సొమ్మునీ అన్ని రంగాలకూ పంచే పనిని ఈ బడ్జెట్ చేసింది.

పైగా గతంలో చేసిన అప్పుల భారం వడ్డీ చెల్లింపుల రూపంలో వెన్నాడుతూనే వుంది. ఏటా కేవలం అప్పులు, వడ్డీల చెల్లింపుల కోసం బడ్జెట్‌లో దాదాపు 24 శాతం అంటే సుమారు 8 లక్షల కోట్లుగా చూపించారు. ఇవన్నీ బడ్జెట్‌లోని అంకెల గారడీ బండారాన్ని బట్టబయలు చేస్తున్నాయి.

ముచ్చటగా మూడు నాలుగు అంశాలను ప్రస్తావించుకుందాం.

కోవిడ్ నేపథ్యంలో కూడా కార్పొరేట్ రంగం సంపదను పెంచుకున్నదని అన్ని సర్వేలు ప్రకటిస్తున్నాయి. కాని వారు ప్రభుత్వానికి చెల్లించే పన్నుల వాటా మాత్రం తగ్గిపోతున్నది. 2019 బడ్జెట్‌లో 7 లక్షల కోట్లు అంచనా వేసే ఈ బడ్జెట్‌లో కార్పొరేట్ రంగం నుండి $5^{1/2}$ లక్షల కోట్లు వస్తుందని అంచనా వేసింది. ఈ బడ్జెట్లు ఎవరి ప్రయోజనాలకు అన్న దానిని ఈ అంకెలు స్పష్టం చేస్తున్నాయి.

మరో అంకెల గారడీ పన్నుల స్థానంలో సెస్‌లు, సర్‌ఛార్జీలు విధించడం, ఇది కేవలం పెట్రోలు, డీజిల్ మీదే కాదు, విద్య, ఆరోగ్యం, కోవిడ్, వ్యవసాయం పేరుతో కేంద్రం దాదాపు 3,70,000 కోట్లు పొందుతున్నది. పన్నులు పెంచితే రాబడిలో వాటా రాష్ట్రాలకు కూడా పంచాలి. సెస్సులు, సర్‌ఛార్జీలు పెంచితే అది పూర్తిగా కేంద్రానికే దక్కుతుంది. దీనితో రాష్ట్రాలకు పంచాల్సిన వాటా $1^{1/2}$ లక్షల కోట్లు కోత పెట్టారు.

ఇంకొకటి ఆరోగ్య రంగానికి కేటాయింపులు 3 రెట్లు పెంచి 2.23 లక్షల కోట్లు చేశామన్నది మరో అంకెల గారడీ. ఇందులో 35000 కోట్లు కోవిడ్ వ్యాక్సిన్‌కి కేటాయించాలి. స్థానిక ప్రభుత్వానికి 15వ ఆర్థిక సంఘం కేటాయించిన తాగునీటి నిధులు 60,000 కోట్లు, శానిటేషన్‌కి 36000 కోట్లు, ఆరోగ్యానికి 13000 కోట్లు కలిపి చూపించారు. వీటిని గతంలో ఈ పద్దు కింద ఏ బడ్జెట్‌లోనూ చూపించలేదు. పోతే మిగిలింది సాధారణ బడ్జెట్ కేటాయింపు మాత్రమే. ఇలాగే వ్యవసాయ రంగంలో అంకెల గారడీ చేశారు. అంకెల గారడీ బడ్జెట్ ఒకసారి చేస్తే నమ్ముతారు. ఎల్లకాలం చేస్తే చూసి ఊరుకుంటారా ? ❑

# ప్రతి ఐదేళ్ళకీ జరగాల్సిన పంచాయితీ ఎన్నికలకు గ్రహణం ఎందుకు పట్టింది ?

**డి వి వి ఎస్ వర్మ**
జాతీయ స్ఫూర్తి సంపాదకులు



ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. దీనికి ముందు అనేక నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికీ, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కి, కోర్టులకీ మధ్య నెలల తరబడి దోబూచులాట సాగింది. పత్రికలకీ, టీవీలకీ కావలసినంత మేత దొరికింది. ఎవరిది ఒప్పు, ఎవరిది తప్పు అన్న వాదోపవాదాలు, చర్చోపచర్చలు సాగాయి. సుప్రీంకోర్టు తీర్పుతో రాజ్యాంగస్ఫూర్తి నిలబడిందంటూ ముక్తాయింపులు జరిగాయి. మొత్తం ఈ చర్చ అంతా ఎన్నికలు జరపడం, వాయిదా వెయ్యడం అన్న దాని చుట్టూనే తిరిగింది. రాజ్యాంగం ప్రకారం పంచాయతీల పదవీ కాలం ఐదేళ్లు. పదవీకాలం ముగిసేలోగా విధిగా ఎన్నికలు జరగాలి. అలా ఎందుకు జరగడం లేదు అన్న అంశం పూర్తిగా విస్మరించబడింది. ఇలా అనేక రాష్ట్రాలలో పంచాయితీ ఎన్నికలు వాయిదాల మీద వాయిదాలు పడుతున్నాయి. ఇందులో అందరి పాత్రా ప్రత్యక్షంగా, పరోక్షంగా వున్నా దానిపై చర్చ మాత్రం జరగడం లేదు.



ఆంధ్రప్రదేశ్‌నే తీసుకుందాం. 73వ రాజ్యాంగ సవరణ జరిగిన తర్వాత 1995లో తొలి ఎన్నికలు జరిగాయి. తర్వాత 2000 సంవత్సరంలో జరగాల్సిన ఎన్నికలు 2001లో రెండవ ఎన్నికలు, 2006లో మూడోసారి ఎన్నికలు, 2013లో నాలుగో సారి ఎన్నికలు జరిగాయి. 2013 తర్వాత ఇప్పుడు 2021లో అంటే దాదాపు 8 సంవత్సరాల తర్వాత ఎన్నికలు జరుగు తున్నాయి. ప్రతి 5 ఏళ్లకీ ఎన్నికలు జరిగితే ఇప్పుడు 6వ దఫా ఎన్నికలు జరిగేవి. అంటే మొత్తంమీద 5, 6 సంవత్సరాలపాటు ప్రజాప్రతినిధులు లేకుండానే పంచాయితీలు ప్రత్యేక అధికారుల పాలనలో వున్నాయి. ఇలా పదవీకాలం ముగిసేలోగా ఎన్నికలు జరపకపోవడం రాజ్యాంగబద్ధమేనా అన్నది మొదటి అంశం.

రాజ్యాంగం లోక్‌సభకు, అసెంబ్లీలకు 5 ఏళ్ల పదవీకాలాన్ని నిర్దేశించింది. అంతకుమించి అవకాశం లేదని పేర్కొంది. అందువల్ల గడువులోగా విధిగా ఎన్నికలు జరగాలని పేర్కొంది. దానికి అనుగుణంగానే ఎలాంటి మినహాయింపులు వాయిదాలు లేకుండా లోక్‌సభ, శాసనసభల పదవీకాలం ముగిసేలోగానే ఎన్నికలు విధిగా జరిగిపోతున్నాయి.

73వ రాజ్యాంగసవరణ పంచాయితీలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించింది. లోక్‌సభ, శాసనసభల పదవీకాలాన్ని నిర్దేశించినట్లు పంచాయితీల పదవీకాలాన్ని కూడా అదే భాషలో ప్రకటించింది. పంచాయితీలకు 5 ఏళ్ల పదవీకాలం ముగిసే లోగానే ఎన్నికలు జరగాలని పేర్కొంది.

లోక్‌సభ, అసెంబ్లీలకు ఎమర్జెన్సీ అమలులో వున్నప్పుడు పార్లమెంటు ఆమోదంతో 6 నెలలు వాటి పదవీకాలాన్ని పొడిగించే వీలు రాజ్యాంగం కల్పించింది. పంచాయితీల పదవీకాలాన్ని పొడిగించడానికి రాజ్యాంగం ఎలాంటి వెసులుబాటును ఇవ్వలేదు. అంటే 5 ఏళ్లకు పదవీకాలం ముగిసేలోగా ఎన్నికలు జరిగి తీరాలి. రాజ్యాంగం ఇంత స్పష్టంగా నిర్దేశించినా పంచాయితీ ఎన్నికలు వాయిదా పడుతూనే వున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు, అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా పంచాయితీ ఎన్నికల వాయిదాల పర్వం రాజ్యాంగ విరుద్ధంగా ఎందుకు సాగుతున్నది? ఈ అంశాన్ని మనం పరిశీలించాలి.

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు వాటి పదవీకాలం ముగిసేలోగా ఎన్నికలు జరపడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లూ నిర్దిష్టంగా వున్నాయి. ఎన్నికలు సజావుగా, సకాలంలో నిర్వహించడానికి దేశానికంతటికీ వర్తించే భారత ఎన్నికల కమీషన్ వుంది. ఎన్నికల నిర్వహణలో మరో ముఖ్య అంశం ఓటర్ల జాబితాలను స్థిరపర్చడం, సవరించడం, ఇదంతా ఎన్నికల కమీషన్ పరిధిలో సాగిపోతుంది. అదే తుది జాబితాను నియోజకవర్గాల వారీగా ఖరారు చేస్తుంది. మరొక ముఖ్యమైన అంశం. నియోజకవర్గాల పునర్విభజన, రిజర్వేషన్లు ఖరారు చెయ్యడానికి అక్కడ ప్రత్యేక యంత్రాంగం వుంది. దీని కోసం పార్లమెంటు ఒక ప్రత్యేక చట్టం ద్వారా "డీ లిమిటేషన్ కమిటీని" ఏర్పాటు చేస్తుంది. అది ఒక ముసాయిదాను తయారు చేసి అందరి సూచనలు సలహాలు తీసుకుని అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల పరిధిని ప్రకటిస్తుంది. ఈ కమిటీ ఒకసారి నియోజకవర్గాల పునర్విభజన, రిజర్వేషన్ల నిర్ణయం తీసుకుంటే అది 20, 25 సంవత్సరాల పాటు ఎలాంటి మార్పులు లేకుండా అమలులో వుంటుంది. దానిని మార్చే హక్కు కోర్టులకీ, ప్రభుత్వాలకీ వుండదు. మనదేశంలో 2002 డీ లిమిటేషన్ చట్టం ప్రకారం ఈప్రక్రియ పూర్తిచేసి 2026 వరకు అమలులో వుండే విధంగా ప్రకటించింది.

అంటే భారత ఎన్నికల కమిషన్‌కు తనదైన ఓటర్ల జాబితా, డీ లిమిటేషన్ కమిటీ ఆమోదించిన నియోజకవర్గాలు, రిజర్వేషన్లు అందుబాటులో వుంటాయి. అందువల్ల భారత ఎన్నికల కమిషన్‌కు ఎన్నికలు నిర్వహించడానికి ఎలాంటి అడ్డంకులు వుండవు. వీటిలో ప్రభుత్వాలు జోక్యం చేసుకునే వీలు లేదు. పైగా వీటికి భిన్నంగా కోర్టులు తీర్పు చెప్పడానికి వీలు లేదు. అందువల్ల లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు వాటి పదవీకాలం ముగిసేలోగా విధిగా జరిగిపోతున్నాయి.

పంచాయితీ ఎన్నికలు కూడా రాజ్యాంగం ప్రకారం వాటి పదవీకాలం ముగిసేలోగా విధిగా ఎన్నికలు జరపాలి. కాని అలా క్రమం తప్పకుండా ఎన్నికలు జరపడానికి నిర్దిష్టమైన ఏర్పాటు జరగలేదు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వాలు, రాష్ట్ర ఎన్నికల కమీషన్లు, కోర్టులు రకరకాల అభ్యంతరాలతో పంచాయితీ ఎన్నికలను రాజ్యాంగవిరుద్ధంగా వాయిదాలు వేసే పరిస్థితి తెస్తున్నారు.

పంచాయితీ ఎన్నికలు నిర్వహించడానికి రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా ప్రత్యేకంగా ఏర్పాటైన రాష్ట్ర ఎన్నికల కమీషన్లు వున్నాయి అని శాసనసభలకు భారత ఎన్నికల కమిషన్ రూపొందించిన ఓటర్ల జాబితాలనే స్థానిక ఎన్నికలకు కూడా వినియోగించుకుంటున్నాయి. ఇంతవరకూ సజావుగానే కనిపిస్తుంది. కాని ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన ఇతర అంశాలు ఈ రాష్ట్ర ఎన్నికల కమిషన్ పరిధిలో లేవు.

పంచాయితీల వార్డుల పునర్విభజన, యం.పి.టి.సి, జడ్.పి.టి.సి ప్రాదేశిక నియోజకవర్గాల పునర్విభజన అంశాలు రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలో వుంచుకున్నాయి. అందువల్ల అలాంటి పునర్విభజన రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిచేసి తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు యిస్తేనే రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించగలుగుతుంది.

అలాగే వార్డుల, ప్రాదేశిక నియోజకవర్గాల రిజర్వేషన్లు ఖరారు చేసే పని, వాటి రొటేషన్‌ను నిర్ధారించే పని రాష్ట్ర ప్రభుత్వాలు తమ దగ్గర పెట్టుకున్నాయి. అందువల్ల రిజర్వేషన్లను రాష్ట్రప్రభుత్వం ఖరారు చేసి తుది జాబితాను ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన తర్వాతే ఎన్నికలు జరపడం సాధ్యం అవుతుంది. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలను పంచాయితీలు, వార్డులు, ఇతర ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా వేరు చేసిన జాబితాను రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించి ఇచ్చిన తర్వాతే పంచాయితీలకు ఎన్నికలు జరపడం సాధ్యం అవుతుంది.

మరొక అంశం. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో బి.సి రిజర్వేషన్లు లేవు. యస్.సి., యస్.టి ల రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన రాజ్యాంగం ప్రకారం డీ లిమిటేషన్ కమిటీ నిర్ణయిస్తుంది. బి.సి ల రిజర్వేషన్లు అక్కడ లేనందువల్ల ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావడంలేదు.

చాలా రాష్ట్రాలలో బి.సి.లకు పంచాయితీరాజ్ వ్యవస్థలలో రిజర్వేషన్లు కల్పించారు. దీనికి జనాభా ప్రాతిపదిక కాకపోయినా చాలా రాష్ట్రాలలో బి.సి.లకు నిర్ణయించిన కోటాలు సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం రిజర్వేషన్ల పరిధిని దాటి వున్నాయి. అందువల్ల రిజర్వేషన్ల కోటాను ఆ మేరకు కుదించడానికి రాజకీయంగా రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం కాకపోవడంతో అక్కడ కోర్టు వివాదాలకు అవకాశం ఏర్పడుతున్నది. దానికి తోడు జనాభా లెక్కలలో బి.సి.ల గణన లేకపోవడంతో అది రిజర్వేషన్లకు ప్రాతిపదిక కాకపోయినా కోర్టు వివాదాలకు దారీ తీస్తున్నది. మొత్తంమీద రాజ్యాంగబద్ధంగా పంచాయితీ ఎన్నికలు క్రమం తప్పకుండా జరగడానికి ఇవన్నీ ప్రత్యక్షంగా, పరోక్షంగా అవరోధాలుగా మారి ఎన్నికల వాయిదాకు దారి తీస్తున్నాయి.

గత పాతికేళ్లుగా దేశం అంతటా పంచాయితీ ఎన్నికలు వాయిదాలు పడుతూ వస్తున్నా దీనిని చక్కదిద్దాల్సిన కేంద్ర ప్రభుత్వం తనకు పట్టనట్టు వ్యవహరిస్తున్నది. పదవీకాలం ముగిసే లోగా విధిగా పంచాయితీ ఎన్నికలు జరపడానికి అవసరమైన రాజ్యాంగబద్ధ చర్యలను తీసుకోడానికి బదులు, ఎన్నికలు జరపకపోతే నిధుల బదలాయింపు వుండదని ఆ మొత్తాలను తన ఖాతాలో వేసుకోవాలని చూస్తున్నది.

ఈ నేపథ్యంలో పంచాయితీ ఎన్నికలు సకాలంలో జరగడానికి కొన్ని నిర్దిష్టమైన చర్యలను తీసుకోవాలి.

1. పంచాయితీలు, స్థానిక ప్రభుత్వాల ఎన్నికలకు సంబంధించి వార్డులు, ప్రాదేశిక నియోజకవర్గాల పునర్విభజన; ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జరిగేలాగ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ పరిధిలో ఒక డీ లిమిటేషన్ కమిటీ ఏర్పాటు చెయ్యాలి.

2. ఈ పునర్విభజన ఆధారంగా ఓటర్ల జాబితాలను రూపొందించే అధికారం రాష్ట్ర ఎన్నికల కమీషనుకు అప్పగించాలి.

3 జనాభా ప్రాతిపదికగా ఎస్‌టి, ఎస్‌సి రిజర్వేషన్లను ఖరారు చెయ్యడం, ఇతర రిజర్వేషన్లను సుప్రీం కోర్టు నిర్ణయాల పరిధిలో ఖరారు చేసే అధికారాన్ని ఎన్నికల కమిషన్ పరిధిలోకి తేవాలి.

రాష్ట్రాల ప్రభుత్వాల పరిధి నుండి వీటిని తొలగించడానికి, ఎన్నికల వాయిదాలపై కోర్టుల ప్రమేయాన్ని నివారించడానికి తగిన విధంగా రాజ్యాంగ సవరణలు చెయ్యాలి .

ఇది దేశప్రజలందరి సమస్య. ప్రజలు నివసించే చోట ప్రజాస్వామ్యాన్ని స్థిరపరిచే సమస్య. రైతుల పేరుతో, కార్మికుల పేరుతో వారి జీవన హక్కులను హరించే నల్ల చట్టాలను ఆఘమేఘాల మీద తెచ్చే ఆరాటం ,స్థానికంగా ప్రజాస్వామ్యాన్ని ప్రజలకు అందించడంలో చూపక పోవడమే దాని రాజకీయంగా భావించాలి ❑

# ఆర్థిక స్వస్థతను నిర్ణయించేది ఆ రెండు సంఖ్యలే !



- జయతీ ఘోష్

అనువాదం : బోడపట్ల రవీందర్

వాస్తవానికి రెండు సంఖ్యలు మాత్రమే రానున్న బడ్జెట్ తీరును సూచిస్తాయి. 2020-21లో ప్రభుత్వం ఎంత ఖర్చు చేయాలని, ఎంత ఖర్చు చేసింది, 2021-22 లో ఎంత ఖర్చు చేయాలని అనుకుంటుంది?

ఈ రెండు సంఖ్యలే, ఆర్థిక మంత్రి పునరుద్ధరణ చర్యలను సూచించినా గానీ, సమీప భవిష్యత్తులో స్థూల ఆర్థిక వ్యవస్థ స్వస్థత సమకూరే అవకాశాలను నిర్ణయిస్తాయి.

ఇదిలా ఉంటే, కోవిడ్-19 పట్ల భారత ప్రభుత్వం యొక్క ప్రతిస్పందన (ఆర్థిక నిబంధనల ప్రకారం), ప్రపంచంలోనే అత్యంత తక్కువస్థాయిలో ఉంటూ వస్తుంది. ప్రభుత్వం ఎటువంటి హెచ్చరికలు, చర్చలు లేకుండానే జాతీయ లాక్‌డౌన్‌ను విధించడమే కాకుండా, ఒకానొక సమయంలో, అవసరం లేకుండానే (కేసుల సంఖ్య, వ్యాధి వ్యాప్తి బాగా తీవ్రం అయ్యే సమయంలో) "అన్ లాక్" ప్రక్రియ చేపట్టి, ప్రజలను తీవ్రమైన ఇబ్బందులకు గురి చేసింది.

ప్రభుత్వం వందల మిలియన్ల ప్రజలను ఈ ఒక్క చర్యతో వారిని జీవనోపాధికి దూరం చేసి, ఆ తరువాత వారికి ఏ విధమైన నష్టపరిహారాన్ని గానీ, సామాజిక భద్రత గానీ సమకూర్చలేదు. 95 శాతం అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులున్న ఒక దేశంలో ఇది నమ్మశక్యం కానిది మరియు క్షమించరాని చర్య. వీరిలో సుమారు 50 శాతం మంది స్వయం ఉపాధి కార్మికులు. వారం రోజుల పాటు ఆదాయం నష్టపోయిన వీరు (అప్పటికే జీవనోపాధికి అంచున ఉన్నారు) మిలియన్ల సంఖ్యలో ఆకలితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


భారీ సంఖ్యలో ప్రజలలో ఆకలి బాగా పెరిగిన సమయంలో, ప్రభుత్వం ఆహార ధాన్యాల మిగులు సేకరణను కూడా పెంచి, ఎఫ్‌సీఐ వద్ద నిల్వ ఉంచింది. అవసరానికి నిల్వ ఉంచే ఆహార ధాన్యాలు (బఫర్ స్టాక్) రెట్టింపు ఉన్నప్పటికీ రేషన్ కార్డులు ఉన్న వారికి నెలకు ఉచితంగా ఇచ్చే ఐదు కేజీల ఆహార ధాన్యాలను కూడా నవంబర్ 2020 నుండి ఇవ్వకుండా నిలిపి వేశారు. రేషన్ విధానానికి అవతల ఉన్న 100 మిలియన్లకు పైగా యోగ్యత ఉన్న ప్రజలకు, (వారి తప్పిదాలు లేకుండానే) ఏ విధమైన నష్టపరిహారాన్ని సమకూర్చలేదు. వందల మిలియన్ల ప్రజలకు ప్రాథమిక ఆహార వస్తువులను తిరస్కరించడం ఒక మానవ విషాదం. పిల్ల తల్లులకు, శిశువులకు, చిన్న పిల్లల పోషకాహార లోపం వల్ల భవిష్యత్తులో భయంకరమైన పరిణామాలు చోటు చేసుకుంటాయి.

స్థూల ఆర్థిక నిబంధనలలో, ప్రభుత్వ ఖర్చు లోపించడం వల్ల ఘోరమైన ఫలితాలు సంభవించాయి. 2020, ఏప్రిల్ - నవంబర్ మధ్య కాలంలో, కేంద్ర ప్రభుత్వం ఖర్చు వాస్తవానికి క్షీణించింది (ఒకసారి ద్రవ్యోల్బణంను లెక్కలోకి తీసుకున్నపుడు): గడిచిన సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే కేవలం 4.7 శాతం మాత్రమే పెరిగింది, ఇదే కాలంలో ద్రవ్యోల్బణం 6 శాతానికి పైగా ఉంది. ఇది ప్రతికూల ద్రవ్య విధానానికి చేరుతుంది.

కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెట్టేందుకు తిరస్కరించడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వాలను కూడా ఖర్చు చేయనీయకుండా తిరస్కరించింది. ఎవరితో ఎటువంటి సంప్రదింపులు జరుపకుండా, రాష్ట్రాలకు ముందుగా సమాచారం ఇవ్వకుండానే జాతీయ లాక్‌డౌన్‌ను ప్రకటించడానికి జాతీయ విపత్తుల నిర్వహణ చట్టాన్ని ఉపయోగించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం, తన చర్యల ఫలితంగా ఏర్పడిన పరిణామాలకు గానీ, కరోనా మహమ్మారిని అదుపు చేసే చర్యలు గానీ, ఆర్థికపరమైన బాధ్యతలను గానీ తీసుకోకుండా తప్పించుకుంది. అంతే కాకుండా, కేంద్రం ఆరోగ్య సంరక్షణ కోసం అయ్యే అదనపు ఖర్చులను గానీ, పెరిగిన ఆర్థిక సంక్షోభ నివారణా నిర్వహణను రాష్ట్రాలకు వదిలేసింది. జూలై లో ప్రకటించిన రెండో "ఉద్దీపన" ప్యాకేజీలో, రాష్ట్రాలు తిరిగి చెల్లించే విధంగా పెద్ద మొత్తంలో ఋణాలు తీసుకోడానికి అనుమతి ఇచ్చింది.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వాల్సిన జీఎస్టీ నష్ట పరిహారాల బకాయిలు కూడా ఇచ్చేందుకు తిరస్కరించింది. అంతే కాకుండా, తాను రాష్ట్రాలకు ఇవ్వాల్సిన బకాయిలను మాత్రం అప్పులు చేసి చెల్లించి, ఆ అప్పులను తీర్చే ఒక కఠినమైన పద్ధతిని రాష్ట్రాలపై రుద్దింది. ఆ పద్ధతి ప్రకారం కేంద్రం ఆర్బీఐ నుండి ఋణం తీసుకొని, రాష్ట్రాలకు ఋణం ఇస్తుంది, రాష్ట్రాలు తిరిగి వాటిని వడ్డీ లేకుండా చెల్లించాలట. ఈ హాస్యాస్పదమైన,

☞ మిగతా 10వ పేజీలో



# ప్రపంచం మనలను గమనిస్తోంది

## రైతుల ఆందోళనపై రాష్ట్రపతికి భారత నావికాదళ మాజీ ప్రధానాధికారి అడ్మిరల్ ఎల్.రాందాస్ బహిరంగ లేఖ

గౌరవనీయ రాష్ట్రపతి, సుప్రీం కమాండర్, మాన్యులు కోవింద్ గారూ,

గణతంత్ర దినోత్సవం నాడు సంభవించిన సంఘటనలు నాలో కలిగించిన తీవ్ర ఆందోళనను తెలియజేయడానికి నా సుప్రీం కమాండర్ అయిన మీకు ఈ బహిరంగ లేఖ రాస్తున్నాను. రైతుల నిరసనోద్యమం ఒక కీలక ఘట్టానికి చేరిందని, తక్షణమే దానికొక పరిణత పరిష్కారాన్ని కనుగొనాలని కోరుతూ ప్రధాన మంత్రి, రైతు సంఘాల నాయకులకు కొద్దిరోజుల క్రితం వీడియో ద్వారా, లిఖితపూర్వకంగాను విజ్ఞప్తి చేశాను. గణతంత్రదినోత్సవం నాడు దేశ రాజధానిలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహిస్తామని రైతులు చేసిన ప్రకటనకు ప్రతిస్పందనగా నేను ఆ విజ్ఞప్తి చేశాను. ట్రాక్టర్ల ర్యాలీ ప్రశాంతంగా జరగాలని, గణతంత్రదిన వేడుకలకు అది అంతరాయం కలిగించకూడదని నేను కోరాను.

తమ ప్రయోజనాలు, జీవనాధారాలను ప్రతికూలంగా ప్రభావితం చేసే నిర్దిష్ట చట్టాలను ఆమోదించే ముందు తమను సంప్రదించాలని మాత్రమే రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం వారిని సంప్రదించలేదు. కొత్తగా అమలులోకి వచ్చిన వ్యవసాయ చట్టాలు కార్పొరేట్ సంస్థలకే లబ్ధి చేకూర్చుతాయని, రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తాయని రైతులు, వ్యవసాయరంగ నిపుణులు కూడ అభిప్రాయపడుతున్నారు. ఈ చట్టాలను రద్దు చేసి, విస్తృత స్థాయిలో చర్చలు, సంప్రదింపులు జరిపిన తరువాత మాత్రమే కొత్త సంస్కరణలు/ చట్టాలను ప్రవేశపెట్టాలని రైతులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.

రైతుల భయాలు సహేతుకమైనా కాకపోయినా వారి డిమాండ్ల విషయంలో సున్నిత వైఖరితో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి), మండీవ్యవస్థ, ప్రైవేట్ వ్యాపారసంస్థల నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లు మొదలైన అంశాలపై రైతుసంఘాలు, రాష్ట్ర ప్రభుత్వాలతో విపులంగా చర్చించాలి. న్యాయబద్ధమైన తమ అభ్యర్థన పట్ల ప్రభుత్వం సానుకూలంగా లేకపోవడం వల్లే రైతులు తమ వైఖరిని, అవసరాలను దేశ ప్రజలకు తెలియజేసేందుకు గణతంత్ర దినోత్సవం సరైన సందర్భమని భావించారు.

ప్రధానమంత్రికి నేను రాసిన లేఖలో మూడు విజ్ఞప్తులు చేశాను: (1) మూడు కొత్త వ్యవసాయ చట్టాలను రద్దుచేయాలి. (2) ఆ చట్టాలను రద్దు చేసిన తరువాత రైతులు తమ నిరసన ప్రదర్శనలను నిలిపివేయాలి. (3) రైతులు తలపెట్టిన ట్రాక్టర్ ర్యాలీకి అనుమతి ఇవ్వాలి. తద్వారా వారు గణతంత్ర దినోత్సవం వేడుకలను జరుపుకోగలుగుతారనీ, దేశరక్షణకు ప్రాణాలను అర్పించిన, తమ కుటుంబసభ్యులైన జవానులు, వైమానికులు, నావికులకు నివాళులర్పించగలుగుతారనీ పేర్కొన్నాను. అంతకు ముందు పంపిన ఒక సందేశంలో కూడా ప్రతి రైతు కుటుంబం లోనూ ఒక సైనికుడు ఉన్నాడని, సైనిక విధుల నుంచి వైదొలగిన అనంతరం అతడు తిరిగి తన పల్లెకే చేరుకొని, సేద్యం చేసుకుంటాడని పేర్కొన్నాను. రైతు కుటుంబాలకు సంబంధించిన ఈ విశిష్ట వాస్తవాన్ని ఎట్టి పరిస్థితులలోనూ విస్మరించకూడదు. కనుక, వారికి వ్యతిరేకంగా వ్యవహరించడమంటే సైనికుల పట్ల వ్యతిరేక వైఖరి చూపడమే అవుతుంది. దీని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. జాతీయ భద్రతపై అవి ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయనే వాస్తవం ఉపేక్షించరానిది.

దేశ రాజధాని శివారు ప్రాంతాలలో ఆందోళన చేస్తున్న రైతులలో అత్యధికులు పంజాబ్, హర్యానాలకు చెందినవారు. ఆ తరువాత ఉత్తరాది రాష్ట్రాలకు చెందినవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారనేది నిజం. కొత్త వ్యవసాయ చట్టాలు దేశవ్యాప్తంగా రైతులోకాన్ని తీవ్ర అసంతృప్తికి గురి చేశాయన్నది ఎవరూ కాదనలేని వాస్తవం. ఆందోళన చేస్తున్న రైతుల్లో 90 శాతం మంది కాలినడకన, ట్రాక్టర్ల పరేడ్‌లో పాల్గొన్నారు. క్రమశిక్షణతో, శాంతియుతంగా జరిగిన ఈ ర్యాలీకి సంబంధించిన వార్తలు జనవరి 26,27 తేదీల్లో ప్రధానస్రవంతి మీడియాలో వెలువడక పోవడం ఎంతైనా విచారకరం.

దీప్‌సింగ్ సిద్ధూ అనే ఒక యువకుడి నాయకత్వంలో ఒక చిన్నబృందం ఎర్రకోట బురుజుపై ఒక పతాకాన్ని ఎగురవేసిన సంఘటనను మాత్రమే టీవీ ఛానెల్స్ పదేపదే చూపాయి. ప్రింట్ మీడియా ఆ ఆక్రమణ సంఘటన గురించి మాత్రమే ప్రధానంగా

రాసింది. అంతేగాక త్రివర్ణ పతాకాన్ని కూల్చివేసి, మతపరమైన జెండాను ఎగురవేశారనే తప్పుడు వార్తలు కూడా ముమ్మరంగా ప్రాచుర్యంలోకి వచ్చాయి.

ఎర్రకోటకు సదా, మరీ ముఖ్యంగా ఆగస్టు 15, జనవరి 26 తేదీల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉంటాయన్న విషయం నాకు బాగా తెలుసు. నావికాదళ అధికారిగా ఎర్రకోట వద్ద జరిగిన అనేక కార్యక్రమాలలో నేను పాల్గొన్నాను. కనుక అనుమతి లేని వ్యక్తులు లేదా బృందాలు కోట బురుజుల కిందిభాగం వద్దకు వెళ్ళడం అసాధ్యమన్న విషయం నాకు బాగా తెలుసు. అక్కడకు వెళ్ళాలంటే పలు గేట్లు, ఇతర అవరోధాలను దాటి వెళ్ళవలసి ఉంటుంది. ఆ గేట్లు సాధారణంగా మూసివేసి ఉంటాయి. మరి జనవరి 26న ఆ చారిత్రక కోట రక్షణ కోసం చేసిన భద్రతా ఏర్పాట్లు ఎటువంటివి? సాధారణంగా ఒక బెటాలియన్ సైన్యం సదా కోటలో ఉంటుంది. మరి ఆక్రమణ సంఘటన సంభవించినప్పుడు ఆ బెటాలియన్ కోటలో ఎందుకు లేదు? ఇది పూర్తిగా భద్రతాపరమైన లోపమే. ఇంత తీవ్ర నిర్లక్ష్యం ఎందుకు జరిగిందో తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపించాల్సిన అవసరం ఉంది.

గణతంత్ర దినోత్సవంనాడు హింసను రెచ్చగొట్టడం ద్వారా, స్వయంగా హింసకు పాల్పడడం ద్వారా రైతులు, ఆందోళనకారులు జాతిని, జాతీయపతాకను అవమానపరిచారని మీడియా, ప్రభుత్వంలోని కొన్నివర్గాలతో పాటు రాజకీయ నాయకులు బహిరంగంగా ఆరోపణలు చేశారు. ఎర్రకోట బురుజు వద్ద వాస్తవంగా ఏం జరిగిందో మీడియా నిష్పాక్షికంగా వార్తలు వెలువరించకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఆందోళనకారులపై ఆరోపణలు చేసిన వారు అతిశయోక్తులతో మాట్లాడి రైతులు ఏదో అపచారానికి పాల్పడ్డారన్న భావన ప్రజల్లో కలిగేందుకు కారణమయ్యారు. ఆ తరువాత దేశద్రోహంతో సహా పలు ఆరోపణలతో రైతులు, రైతునాయకులు, ప్రముఖ జర్నలిస్టులు, ఇతర ప్రముఖులపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేశారన్న వార్తలు మరింత విచారాన్ని కలిగించాయి.

భద్రతాసిబ్బంది, ఒక చిన్న తిరుగుబాటు రైతులబృందం, అత్యున్నత స్థాయి రాజకీయ నాయకులతో సంబంధాలు ఉన్న వ్యక్తులు కుమ్మక్కయిన ఫలితంగా ఆ ఆక్రమణ సంఘటన జరిగిందన్న వార్తలు కూడా బాగా ప్రచారంలోకి వచ్చాయి. కోటలోకి ప్రవేశించేందుకు వీలుగా రైతులను రెచ్చగొట్టేందుకే ఆ వ్యక్తులను కొంతమంది తమ ఏజెంట్లుగా నియోగించుకున్నారని కూడా ఆ వార్తలు వెల్లడించాయి. పైస్థాయి వ్యక్తులు ప్రోద్బలం వల్లే వారు ఉద్దేశపూర్వకంగా అలా వ్యవహరించడం జరిగింది. తత్ఫలితంగానే క్రమశిక్షణాయుతంగా, శాంతియుతంగా జరుగుతున్న లక్షలాది రైతుల పరేడ్‌లో అవాంఛనీయమైన సంఘటనలు సంభవించాయి. ఈ దురదృష్టకరమైన సంఘటనలు, భద్రతా ఏర్పాట్లలో లోపాలపైన తక్షణమే ఒక ఉన్నతస్థాయి కమిషన్‌తో నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపించాల్సిన అవసరముంది. ఎర్రకోట సంఘటనతో రైతులోకం కోల్పోయిన ప్రతిష్ఠను పునరుద్ధరించేందుకు ఈ దర్యాప్తు తప్పనిసరి.

ప్రస్తుతం సజీవులుగా ఉన్న త్రివిధ దళాల మాజీ ప్రధానాధికారులలో నేను అందరికంటే పెద్దవాణ్ణి. ప్రప్రథమ గణతంత్ర దినోత్సవాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. ఆ తరువాత నేను ఎన్నో గణతంత్రదిన వేడుకలకు హాజరయ్యాను. పదవీ విరమణ చేశాక గత 27 సంవత్సరాలుగా మహారాష్ట్రలోని ఒక గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నాను. ఇప్పుడు నా వయస్సు 87 సంవత్సరాలు. రాజధానికి ప్రయాణం చేయగల స్థితిలో లేను. క్రియాశీల ప్రజాజీవితంలో పాల్గొనలేను. ఒక సీనియర్ పౌరుడిగా, సుదీర్ఘానుభవం గల సైనికాధికారిగా ఇటువంటి లేఖల ద్వారా నా ఆందోళనను మీకు, మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేసేందుకు ప్రయత్నిస్తున్నాను.

ఈ అంశాలను మీ దృష్టికి, నా సహచర దేశ పౌరులదృష్టికి తీసుకువెళ్ళడం నా విద్యుక్తధర్మంగా భావిస్తున్నాను. నా లాంటి వారు మౌనంగా ఉండిపోతే, సత్యాన్ని మాట్లాడనందుకు భావి తరాలు క్షమించవు. గణతంత్రరాజ్యంగా ఆవిర్భవించినప్పుడు భారత రాజ్యాంగంలో ఈ దేశ పౌరులకు ఇచ్చిన హామీలు నెరవేర డానికి అవరోధమవుతున్న వాటిని ప్రశ్నించనందుకు రేపటి తరాల వారు క్షమించరు. రాష్ట్రపతి గారూ, ఈ లేఖలో ప్రస్తావించిన అంశాలపై తక్షణమే సముచిత చర్యలు తీసుకోవాలని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. కొత్త సాగు చట్టాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలో ఇప్పటికే 170 మందికి పైగా రైతులు తమ ప్రాణాలు కోల్పోయారు. వారు నిజంగా ఆసేతు హిమాచలం సమస్తప్రజలను మేలు కొలిపారు. మన గణతంత్ర రాజ్య సార్వభౌమాధిపతిగా మన రైతులు, జవానులు, ప్రజల మధ్య నెలకొన్న ఘోర పరిస్థితిని అడ్డుకోగల విశిష్ట స్థానంలో మీరు ఉన్నారు. ప్రభుత్వానికి వివేకవంతమైన మార్గదర్శకత్వాన్ని ఇవ్వడం ద్వారా న్యాయాన్ని పునరుద్ధరించి శాంతిని నెలకొల్పాలి. ఇది ఈ దేశ ప్రజలకు, విశాల ప్రపంచానికి గొప్ప సేవ అవుతుంది. వింటున్న, చూస్తున్న వాటి నుంచి యావత్ప్రపంచమూ మనలను గమనిస్తోంది. ❑

*ఆంధ్రజ్యోతి సౌజన్యంతో...*



రైతుల ఆందోళన : ప్రభుత్వ, కోర్టుల ప్రతిస్పందన

# మానవత్వం మరిచిపోతున్న గణతంత్రమా మనది

మాడభూషి శ్రీధర్
బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్
కేంద్ర సమాచార మాజీ కమిషనర్

ప్రభువులుగానీ, న్యాయమూర్తులు గానీ, రాజకీయ నాయకులు గానీ మానవత్వం అనే ఒక్క విషయం పూర్తిగా మరిచి పోయారా? పదాల్లో చెప్పని మంచితనం మానవత్వం, పాలకులు మనుషులవలె వ్యవహరించడం గురించి రాజ్యాంగం తన పీఠిక ఆదేశిక సూత్రాల ద్వారా ఆశిస్తున్నది. మానవత్వమే సహజ న్యాయం. సహజన్యాయం, రాజ్యాంగ న్యాయం కన్న గొప్పది.  కరోనా కాలంలో తమ ఊళ్లకు కాలినడకన బయలుదేరిన వలస కార్మికులను కొన్ని హైకోర్టులు ఆదుకునే ప్రయత్నం చేసినప్పటికీ సుప్రీంకోర్టు కొన్ని నెలల పాటు పట్టించుకోకపోవడం మానవతకు వ్యతిరేకమని న్యాయవేత్తలు విమర్శించారు. వంద మంది ఒక వినతిపత్రం కూడ ఇచ్చారు. ఆ తరువాత సుప్రీంకోర్టు ప్రభుత్వానికి అవసరమైన ఆదేశాలు ఎన్నోజారీ చేసి మానవతా విలువలను రక్షించే ప్రయత్నం చేసింది.

## చలిలో నీటిఫిరంగులా?

రోం తగల బడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించాడన్న పాత సామెత ఈనాటి అమానుషానికి సరిపోతుందో లేదో? ఢిల్లీ చలి అనుభవించిన వారే ఈ రైతుల కష్టాలు అర్థం చేసుకోగలుగు తారు. డిసెంబర్ జనవరి నెలల్లో ఇంట్లో తలుపులు మూసుకుని ఉన్నా చలి భరించడం కష్టం. హీటర్లు ఉండాల్సిందే. ఒకటి రెండు డిగ్రీల చలిలో నవంబర్ నుంచి ఇప్పటి వరకు గత యాభై రోజులుగా రైతులు బహిరంగంగా చల్లగాలులను ఎదుర్కొంటు న్నారు. పాలకులు అధికారులు రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు వేడియంత్రాలు వాడుకుంటూ అన్నీ మూసేసిన ఇళ్లలోఉంటూ కూడా వజవజ వణికుతున్నారు. మిగతా రాష్ట్రాలలో ప్రజలకు కూడా ఈ విషయం అర్థం కాదు. అయినా రైతులు వేలాదిగా రోడ్లమీదకొచ్చి అక్కడే రాత్రింబగళ్లు శాంతియుతంగా ఆందోళన చేస్తున్నారు. రైతువ్యతిరేక చట్టాలను విమర్శిస్తూ ఉంటే వారి మీద నీటి ఫిరంగులను వాడుతూ విపరీత జలధారలను విసిరే వారు వారు మనుషులేనా? మిగతా రాజ్యాంగ విషయాలు తరువాత. "మేం రైతుల సమస్యలు వింటాం మీరు వారి మీద నీటిఫిరంగులు వాడకండి" అని ఒక్కరెవరైనా చెప్పారా? మన అన్నదాతలను ఈ విధంగా చంపుకోవడం హైందవ ధర్మమా? లేక మనం అనుసరించే సంస్కృతీ సంప్రదాయమా? రైతు చట్టాలను అన్యాయంగా సమర్థించే మేధావులు కూడా ఈ మాత్రం మానవత్వ చూపకపోవడం దారుణం. ఆ నీటిఫిరంగి వెనుక ఉన్నవాడు ఒక కట్టు బానిస. జీతం కోసం పనిచేసే ఒక యంత్రం. ఫిరంగి ఎంతో అతనూ అంతే. వారి వెనుక ఉన్న వారు, ఉన్నతాధికారులు, వారిని ఆదేశించే రాజకీయ రాజ్యాంగ పదవుల్లో ఉన్న పెద్దలు మనం అంతా మనుషులమేనా, మానవత్వం అంటే మనకు తెలుసా? ఈ మూడు చట్టాలు రద్దుచేస్తే ఈ జాతికి, దేశానికి, ఈ ప్రభుత్వానికి ఈ అధికార పార్టీకి వచ్చే నష్టమేమిటి? కార్పొరేట్ వ్యవసాయ వ్యాపారం నిలిచిపోయి దేశం నష్ట పోతుందా? రైతులకు స్వేచ్ఛ ఇస్తున్నామని కదా మీ వాదం, పోనీ ఆ స్వేచ్ఛ లేకపోయినా ఫరవాలేదని రైతులే అంటున్నారు కదా.

## రాష్ట్ర చట్టాలు నిర్వీర్యం చేసే కేంద్ర చట్టాలు

ఇన్నాళ్లూ చిన్న సన్నకారు రైతులు పండించిన ధాన్యాలను కనీస మద్దతు ధరకు అమ్మడానికి సహాయం చేస్తున్న చట్టాలు, వ్యవసాయమార్కెట్ కమిటీలను ఒక రాష్ట్రం నుంచి ధాన్యాలను తరలించి కృత్రిమ కరువు సృష్టించి చీకటి బజారు వ్యవహారాలతో వినియోగదారులకు అధిక ధరలకు అమ్మి లాభాలు చేసుకునే అవినీతి వ్యాపారాన్ని అరికట్టే చట్టాలు చెల్లకుండా కేంద్రం చట్టాలు చేసింది. దేశానికి ధాన్య రాజధాని వంటి రాష్ట్రాలు పంజాబ్ హరియాణాలలో రైతులకు చాలా రక్షణలు ఉండేవి. అవన్నీ ఇప్పుడు ఉండవు. ఆ రాష్ట్రాల చట్టాలు చెల్లవు. ఇప్పటి నుంచి ఏ సరుకులైనా ఏ ధాన్యాలనైనా ఎక్కడికైనా తరలించే స్వేచ్ఛ ఉంది, చీకటి బజారు కూడా ఇప్పుడు స్వేచ్ఛలో భాగం. వినియోగ దారులకు ఏ ధరకైన సరే కొనుక్కునే లేదా అసలు కొనకుండా ఉండే స్వేచ్ఛను ఈ చట్టాలు ప్రసాదిస్తున్నాయి.

## పార్లమెంటరీ ప్రజాస్వామ్యం

కరోనా కాలంలో అర్జంటుగా పార్లమెంటును సమావేశ పరిచి, అస్తవ్యస్త పరిస్థితులలో గందరగోళాల మధ్య ఈ ఆర్డినెన్సులను చట్టాలుగా మార్చివేసారు.

వాటికి ఎన్ని వోట్లు పడ్డాయో లెక్కించకుండా మెజారిటీ మద్దతు ఉందని నిరంకుశంగా నోటిమాటలతో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ బిల్లులు ఆమోదం పొందాయని ప్రకటించారు.  అదొక అద్భుతం. మనదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పరిస్తితి ఇది.

తరువాత ఒక్క కలంపోటు తో బిల్లులను ఆమోదించి వాటిని చట్టాలుగా రాష్ట్రపతి మార్చారు. కనీసం పార్లమెంటుకు ఈ చట్టాలు చేసే అధికారం ఉందా లేదా అని ఒక్క క్షణం కూడా ఎవరూ ఆలోచించలేదు. న్యాయవాది, రాజ్యాంగం తెలిసిన వ్యక్తులూ కీలకమైన పదవుల్లో ఉండి కూడా అడగలేదు. కరోనా పీడిస్తున్న 2020 జూన్ నెలలో ఆర్డినెన్సులు జారీ చేసేటప్పుడు కూడా ఇంత తొందర ఎందుకు, మీరు రాజ్యాంగం ప్రకారం ఈ వ్యవసాయ రంగంపైన చట్టాలు చేసే అధికారం లేదు కాదా, ఎందుకు చేస్తున్నారు అని అడగడానికి ప్రయత్నించారో లేదో తెలియదు. కనీసం బిల్లులు తన ఆమోదానికి వచ్చిన దశలో నైనా ఈ బిల్లుల మీద వ్యతిరేకత ఎందుకు వస్తున్నది, ఇందులో లోపాలేమయినా ఉన్నాయ అని ఆలోచించకపోవడం 70 సంవత్సరాల రిపబ్లిక్ భారతంలో విచారకరమైన సన్నివేశం. రాజ్యాంగాన్ని రక్షిస్తానని ప్రతిజ్ఞ చేసిన రాష్ట్రపతి ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోవలసి ఉంటుంది. బక్కచిక్కిన రైతులను కాపాడవలసిన ప్రభుత్వాలే ఇటువంటి చట్టాలు తెస్తే, రాజ్యాంగం, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు కాక ఇంకెవరు రక్షిస్తారు?

## ఇంకా వ్యవసాయ మార్కెట్ లు ఉన్నాయా

అంతకుముందే ఆర్డినెన్సులను కేంద్రం జారీ చేసిన నాటి నుంచి ఆ రైతు వ్యతిరేక చట్టాల అమలు మొదలైంది. అనేకానేక మార్కెట్ కమిటీల్లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. అవి చట్టాలుగా మారిన వెంటనే, నోటిఫై చేసి అత్యంత వేగంగా అమలు కొనసాగించారు. వెంటనే వర్తకులు వ్యవసాయ ఉత్పత్తులను కొనడానికి వ్యవసాయ మార్కెట్‌కు వెళ్లకుండా స్వేచ్ఛగా కొనుక్కుంటున్నారు, ఎన్నో మార్కెట్‌లలో వర్తకులు మూడుశాతం శిస్తు కట్టడం మానేశారు. మార్కెట్ కమిటీల ఉద్యోగులు నిరుద్యోగులైపోయారు. వ్యవసాయదారులకు సాయం చేసే వ్యవసాయ మార్కెట్లు ఉంటాయని, వాటిని రద్దు చేయలేదని ప్రభువులు ప్రకటిస్తున్నారు. ఇవి వాస్తవాలా? స్పష్టంగా వాటిని రద్దు చేయలేదు కాని వర్తకులు రైతు మధ్య ఒప్పందానికి వ్యవసాయ మార్కెట్ కమిటీలకోసం రాష్ట్రాలు చేసిన చట్టాలకు మధ్య వైరుధ్యం ఉంటే చట్టాలు పనికి రావనీ ఒప్పందం మాత్రమే పనిచేస్తుందని ఈ చట్టాల్లో స్పష్టంగా ప్రకటించి వాటిని నిర్వీర్యం చేసారు.

## రైతులకే తెలుసు

ఈ రాజ్యాంగం గురించి రాష్ట్రపతికి, మన కేంద్ర న్యాయశాఖ మంత్రికి, వారికి అండగా నిలిచే రాజ్యాంగ నిపుణులకు తెలిసినంతగా రైతులకు తెలియదు. కాని బకరాల వంటి బక్కచిక్కిన రైతులను వర్తక తోడేళ్లతో ఒప్పందాలు చేసుకునే స్వేచ్ఛ ఇచ్చారని వారికి అర్థం అయింది. అన్నదాతలను వ్యవసాయ మార్కెట్‌లోంచి తీసేసి కార్పొరేట్ మార్కెట్‌లో వదిలేస్తున్నారని తెలిసింది. ఇంతవరకు రాష్ట్రాలు ఇచ్చిన మద్దతు ఏర్పాట్లు ఇప్పుడు లభించవని, రాష్ట్రాలు చేసిన మద్దతు చట్టాలు చెల్లవని, రాష్ట్రాలు చేయదలచుకున్నా సాయం చేయలేకపోవచ్చని రైతులకు అర్థం అయింది. ఆర్థిక నిపుణులకు కార్పొరేట్ల ద్వారానే ప్రగతి వస్తుందని నమ్మే కొందరు మేధావులకు, కొన్ని రాజకీయ పార్టీలకు అర్థం కాలేదు. ఇక ముందు కూడ అర్థం కాకపోవచ్చు. అర్థమైన రైతులు ప్రాణాలను ఫణం పెట్టి చలిలో పోరాడుతున్నారు. నీళ్ల ఫిరంగులను ఎదుర్కొంటున్నారు.

ఇక మిగిలింది సుప్రీంకోర్టు. సుప్రీంకోర్టు కూడా రైతులను రక్షించకపోతే ఎవరు రక్షిస్తారు? రైతులకు రోడ్లమీదికి వచ్చి నిరసన వ్యక్తం చేసే హక్కు పేరుతో ఇతర రాకపోకలను నిరోధించే అధికారం లేదని రాజ్యాంగం తెలిసిన కొందరు న్యాయవాదులు ప్రజాప్రయోజన వాజ్యం వేసారు. వారిని రోడ్ల మీద నుంచి ఖాళీ చేయించాలని కేంద్రానికి ఆదేశాలు జారీచేయాలని ఆ న్యాయ నిపుణులు, విద్యార్థులు, వారి వెనుక ఉన్న కొన్ని శక్తులుపిల్ లో కోరారు. రైతుల మీద నీటి ఫిరంగులు ప్రయోగించవద్దని పిల్ వేసే వారెవరూ లేరు. అధికార పార్టీల్లో కూర్చుని పదవులు అనుభవిస్తున్న రాజ్యాంగ నిపుణులు కనీసం వారిమీద నీటి ఫిరంగులు ప్రయోగించకండి అని చెప్పడానికి కూడా భయపడుతున్నారు.

## వరవరరావు వృద్ధాప్యం గుర్తుందా?

ఇటీవల మహారాష్ట్ర హైకోర్టు, మన తెలుగుకవి వరవరరావు బెయిల్ పిటిషన్ విచారణ దశలో, ఎన్ ఐ ఎ' ను ఉద్దేశించి, “మీ కేసులు సరే వరవరరావుగారి వయసు గుర్తు పెట్టుకోండి మనమంతా మనుషులం కదా” అన్నారు. మనం మనుషులమని న్యాయమూర్తి గుర్తు చేసారు. మానవత్వంలేని చట్టాల మధ్య ఇటువంటి మానవత్వపు మెరుపులు అప్పుడప్పుడు కనిపిస్తే మనం ఇంకా మనుషుల మధ్యే ఉన్నామనిపిస్తుంది. ఎన్ఐఎకు మానవత్వం ఉందో లేదో ఎవరు చెప్పాలి.

“ఆందోళన చేసే రైతులలో వయోవృద్ధులు పిల్లలు మహిళలు ఇంటికి వెళ్లాలి. ప్రధాన న్యాయమూర్తి వారు ఇళ్లకు వెళ్లాలని కోరుకుంటున్నారని వారికి చెప్పండి. మీకు మామీద నమ్మకం ఉన్నా లేకపోయినా మేం సుప్రీంకోర్టు హోదాలో మా బాధ్యత మేము నిర్వహిస్తాం' అని ప్రధాన న్యాయమూర్తి జనవరి 11 న

అన్నారు. ఈ మానవతా పూర్వకమైన మాటలు జడ్జిలు తప్పని సరిగా మాట్లాడాలని రాజ్యాంగంలో ఉండదు. న్యాయమూర్తులు మానవులై మానవతతో మెలగాలని నియమాలు రాసుకోలేదు ఎందుకంటే న్యాయమూర్తులు మానవులే కనుక మనుషులకుండే మానవత్వం ఉంటుందని రాజ్యాంగ రచయితలు ఊహించారు, ఆశించారు.

కేంద్ర ప్రభుత్వం రైతుల ఆందోళన గురించి వ్యవహరించిన తీరు పట్ల ప్రధాన న్యాయమూర్తి శరద్ ఎ బాబ్డే నిరాశ ప్రకటించారు. నిజంగా అది ప్రజల నిరాశకు ప్రతిబింబం. చర్చలు విఫలం కావడం, కొన్ని రాష్ట్రాలు తిరుగుబాటు చేయడం, కొందరు రైతులు ఆత్మాహుతి చేసుకోవడం, ఆందోళనలో వృద్ధ రైతులు మహిళలు పిల్లలు ఉండడం వారు ఎముకలుకొరికే చలిలో కరోనావ్యాధి వ్యాపించిన నేపథ్యంలో మన గణతంత్రదినోత్సవానికి ముందు రోజుల్లో బాధపడడం కలవరపెడు తున్నాయని ప్రధాన న్యాయమూర్తి ఆవేదన వ్యక్తం చేసినపుడు చట్టాల ఇనుప చక్రాలలో కూడా ఎక్కడో మానవత్వం చిగురించిందనిపించింది. యాభైరోజులకు పైగా అన్నదాతలు పొలాలు హలాలూ వదిలి, ఇంటిల్లిపాదితో కలిసి వచ్చి రోడ్ల వండుకుని తింటూ సమ్మె చేస్తుంటే పట్టించుకోరు కాని ఈ చట్టాలు వెనక్కితీసుకోవడంలో పంతాలూ పట్టింపులు ఎక్కువ. దాదాపు 30 మందికి పైగా చనిపోయారు. కొందరు ఆత్మహత్య చేసుకున్నారు. మానవత్వం మరిచిపోయి వారిలో ఖలిస్తానీయులున్నారని మాట్లాడడం ఏ కిరాతక న్యాయం? మనకు మానవత్వం ఉందా, మనం మనుషులమేనా? ❑

## ఆర్థిక స్వస్థతను నిర్ణయించేది ఆ రెండు సంఖ్యలే !

**(5వ పేజీ తరువాయి)**

అన్యాయమైన ఏర్పాటు కూడా, ఒక సంవత్సరంలో కేంద్రం ఇవ్వాల్సిన బకాయిలలో సగం కన్నా తక్కువ మాత్రమే సమకూర్చుతుంది.

ఆర్థిక వ్యవస్థ క్షీణత మరియు కరోనా మహమ్మారి వ్యాప్తి కాలంలో కేంద్ర ప్రభుత్వ ఖర్చులో ఈ అసాధారణమైన కుదింపు, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వాల్సిన నష్టపరిహారాల చెల్లింపులను ఏ లక్ష్యంతో కేంద్రం తిరస్కరిస్తుంది? ద్రవ్య లోటు పెరుగుతుందన్న కేంద్ర ప్రభుత్వం యొక్క అర్థం లేని భయం ఫలితంగానే ఇది జరుగుతుంది.

ప్రజల బాధలు తీవ్రం కావడం, అవి దీర్ఘ కాలం కొనసాగడంతో పాటు ఆర్థిక సంకోచ ధోరణులకు ఇలాంటి ద్రవ్య కుదింపు తోడు అవుతుంది. ఈ ఆర్థిక సంకోచ కార్యకలాపం, పన్నుల ద్వారా వచ్చే ఆదాయాలు కూడా తగ్గడానికి దారి తీస్తుంది. కాబట్టి అంచనాలకు మించిన ద్రవ్యలోటు పెరుగుదల కొనసాగుతుండడం కూడా ఆశ్చర్యం ఏమీ కాదు.

ఇలా ఉన్నప్పటికీ, మాంద్యం కాలంలో అదనపు ఆదాయాల కోసం ఇంధనం పైన అధిక మొత్తంలో పన్నుల విధింపును కొన సాగించడం కేంద్ర ప్రభుత్వం యొక్క మరొక ఆశ్చర్యకరమైన చర్య. భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇంత భారీగా పెరగడం చరిత్రలో ఎన్నడూ లేదు. ఈ పెరుగుదల నిరుత్సాహ పరిచే ధోరణికి తోడై మందకోడి ద్రవ్యోల్బణానికి, ద్రవ్యోల్బణం పెరుగుదలకు (నిజ ఆర్థిక వ్యవస్థ క్షీణించినప్పటికీ (లేదా) నిల్చి పోయినప్పటికీ, వేతన ఆదాయాలు పడిపోయినప్పటికీ) దారి తీస్తుంది.

ఇలాంటి నేరాల తరువాత, క్షమాపణ లేంటీ? ఒక స్థిరత్వం లేని, అన్యాయమైన, ప్రతికూల విధానాలను తలక్రిందులు చేయడమే వీటికి పరిష్కార మార్గం. ప్రభుత్వ ఖర్చులో గమనించ దగిన పెరుగుదలతో ఆరోగ్యం, పౌష్టికాహారం, సామాజిక సేవా రంగాలైన విద్య, ఆర్థిక రంగాలైన వ్యవసాయం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ విస్తరణ, పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీని ప్రవేశపెట్టడం ద్వారా భారీ సత్ఫలితాలు పొందొచ్చు.

పేలవమైన ప్రణాళికలు, దూకుడుగా అమలు చేసిన లాక్ డౌన్‌ల ఫలితంగా విచ్ఛిన్నం అయిన సరఫరా గొలుసుల నుండి ఉద్భవించిన సరఫరా ప్రతిష్ఠంభనను అధిగమించేందుకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సిన అవసరం ఉంటుంది.

పెంచబోయే ఖర్చుకు అవసరమైన ఆర్థిక వనరులను, సంపన్న వర్గాల పైన సంఘీభావ పన్నులను విధించడం ద్వారా, మన దేశం నుండి లాభాలను బయటకు మళ్ళించే బహుళజాతి కంపెనీలను అడ్డుకునేందుకు సంస్కరణల పన్నులను విధించడం ద్వారా సమకూర్చవచ్చు.

కానీ ఇవన్నీ ప్రస్తుతం రెండవ ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. అతి ముఖ్యమైన అంశం ప్రజలు చేసే ఖర్చును పెంచడం: అందుకే నేను మళ్ళీ చెపుతున్నాను, ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్ సమర్పించినపుడు చూసేది ఆ రెండు సంఖ్యలనే. ❑

('ద వైర్' సౌజన్యంతో)

# చరిత్రలో అతిపెద్ద దుర్దినం జనవరి 30 ఈ దుర్దినం దుష్టత్వం పై పోరాడే దీక్షాదినం కూడా!



**ఇఫ్టూ ప్రసాద్**

ప్రియమైన మిత్రులారా!

ప్రపంచ చరిత్రలో కాలాన్ని కాటువేసిన దుర్దినం జనవరి 30. అదే నాజీ హిట్లర్ జర్మనీ ఛాన్సలర్‌గా గద్దెనెక్కిన రోజు! ఫాసిజం ప్రతిపక్ష స్థానం నుండి అధికార స్థానానికి చేరుకున్న రోజు! అదే 1933 జనవరి 30.

భారతదేశ చరిత్రలో దుర్దినం జనవరి 30. అదే ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజ్యాంగ రచనా ప్రక్రియ పట్ల ద్వేషంతో గాంధీని మనువాద సంస్థ ఆర్.ఎస్.ఎస్. హత్య చేసిన రోజు! మనదేశ చరిత్రలో మొట్టమొదటి వ్యవస్థీకృత టెర్రరిస్టు దాడి దినం. అదే 1948 జనవరి 30.

ఒక దుర్దినంగా జనవరి 30 ప్రపంచ చరిత్రను రక్తస్రావానికి గురి చేసింది. మరో దుర్దినంగా అది భారతదేశ చరిత్రను కూడా గాయపరిచింది. భారత దేశ చరిత్రని గాయపరిచే ప్రతీఘాత ఫాసిస్టు అచారిత్రిక శక్తులకి ఆదర్శం హిట్లర్. హిట్లర్ ప్రమాణ స్వీకారం చేసిన రోజుని స్ఫూర్తి దినంగా చేపట్టి ఆరోజు అది గాంధీని హత్య చేసింది.

భారతదేశ చరిత్రలో కేవలం నాలుగు రోజుల వ్యవధిలో రెండు తేదీలకు రాజకీయ ప్రాముఖ్యత ఉంది. ఒకటి జనవరి 26. మరొకటి జనవరి 30. ఒకటి రిపబ్లిక్ డే! మరొకటి గాంధీని ఫాసిస్టు హంతక శక్తులు పొట్టన పెట్టుకున్న రోజు! జనవరి 26పై దాడి దినమే జనవరి 30. అంటే రాజ్యాంగం ఉనికిలోకి రాక ముందే రిపబ్లిక్ రాజ్యాంగ రచనా ప్రక్రియ పై దాడి చేసే లక్ష్యంలో భాగమే గాంధీ హత్య! గాంధీ హత్యాదినాన రిపబ్లిక్ స్ఫూర్తితో రైతాంగ ఉద్యమ కార్యాచరణ కమిటీ ఇచ్చిన సద్భావన దివస్ పిలుపు నేడు దేశవ్యాప్తంగా అమలు జరగ బోతోంది.

పైన పేర్కొన్న జనవరి 26కీ, 30కీ మధ్య జనవరి 27కి కూడా ఒక చారిత్రిక ప్రాధాన్యత ఉంది. అదే హిట్లర్ నాజీయిజం పై నిర్ణయాత్మక విజయాన్ని సాధించి, నాజీ క్రూర నిర్బంధ శిబిరాల నుండి నిర్బంధితుల్ని రష్యా ఎర్ర సైన్యాలు విడుదల చేశాయి. అదే 1945 జనవరి 27. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత చాలా ఏళ్ల పాటు ఫాసిస్టు వ్యతిరేక ప్రజాతంత్ర శక్తులు ప్రపంచ వ్యాప్తంగా "విజయ్ దివస్"గా జనవరి 27ని పాటించాయి. చరిత్రలో గత కాలపు విజయ్ దివస్ స్ఫూర్తితో ఫాసిజంపై పోరాడే దీక్ష నేటి చారిత్రక ఆవశ్యకత!

గాంధీ హత్యా దినాన్ని "సద్భావనా దివస్" గా సంయుక్త కిసాన్ మోర్చా (SKM) పిలుపు ఇచ్చింది. నేడు ఫాసిస్టు వ్యతిరేక రాజకీయ శక్తులను ఇదోచారిత్రిక కర్తవ్యం.

భగతసింగ్ వద్ద నిలబడి చూస్తే, గాంధీ రాజకీయ శత్రువే. గాడ్సే వద్ద నిలబడి చూస్తే రాజకీయ మిత్రుడు! సోషలిజం దృక్కోణంతో చూసేవాళ్ళకి గాంధీ ప్రత్యర్ధి! మనువాదాన్ని దృష్టిలోకి తీసుకొని చూసే వారికి మిత్రుడు! ఔను మరి! చెట్టుకింద కూర్చున్న మనిషి చెట్టు మీద ఉన్న మనిషి కంటే "క్రింద" వున్నట్లు! చెట్టు పక్క బావిలో దిగిన మనిషి కంటే చాలా ఎత్తులో ఉన్నట్లు! నాగపూర్ ఢిల్లీకి దక్షిణాన ఉంటే, వరంగల్‌కి ఉత్తరాన ఉంటుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య పాలన స్థానంలో సోషలిస్టు సమాజం కోరుకునే శక్తులకు మొన్నటి వరకూ గాంధీ రాజకీయ ప్రత్యర్ధే! కానీ నేడు ఫాసిజం పెట్రేగిపోయే కాలంలో వారికి కూడా గాంధీ రాజకీయ మిత్రుడే! ఈ దృష్టి కోణంలో నేటి "సద్భావనా దివస్" ని జయప్రదం చేయడం ఫాసిస్టు వ్యతిరేక శక్తులన్నింటి కనీస రాజకీయ కర్తవ్యం.

ఇప్పుడు రైతాంగానికి కూడా గాంధీ మిత్రుడే! ఫాసిస్టు కుట్రల ద్వారా రైతాంగ పోరాటాన్ని అణిచివేసే నేపథ్యంలో గాంధీ స్మారక స్ఫూర్తితో "సద్భావనా దివస్"కి ప్రాధాన్యత ఉంది. రెక్కలు ముక్కలు చేస్తూ, ఆరుగాలం కష్టించినా, తమ పంటలకు గిట్టుబాటు ధరలు రాక, పురుగుల్ని చంపే పురుగు మందులు త్రాగి ఆత్మహత్యల పాలవుతోన్న దుస్థితి తెల్సిందే! బ్రతికి ఉన్న రైతులు కూడా జీవచ్ఛవాలుగా బ్రతుకుతోన్న దురవస్థ కూడా తెల్సిందే! అట్టి దుర్భర రైతాంగ ధర్మపోరాట అణచివేత కోసం స్టేజి కూప్స్ ద్వారా రాజ్యమే కుట్రలు పన్నే ఫాసిస్టు దుర్నీతికి జనవరి 26 గుర్తుగా మిగిలింది. సారాన్ని కోల్పోయి, రూపాన్ని మాత్రమే మిగుల్చుకున్న అస్థిపంజరం వంటి రిపబ్లిక్‌కి గల ఆఖరి ఆనవాళ్లను కూడా లేకుండా చేసే లక్ష్యం మోడీ సర్కార్‌ది. రిపబ్లిక్‌కి రాజకీయ మరణ శాసనం రాసే రాజ్య ఫాసిస్టు రాజనీతికి రైతాంగంపై జనవరి 26నాటి రాజ్య కుట్రలు చరిత్రలో సాక్షిగా నిలుస్తాయి.

జనవరి 26కీ, జనవరి 30కీ మధ్య మూడు రోజుల వ్యవధి ఉంది. ఈ మూడు రోజులు బడా కార్పొరేట్ శక్తుల దన్నుతో

మోడీ షా ప్రభుత్వం అర్బన్ లుంఫెన్ (వాడుక భాషలో లంఫెన్ అని కూడా అంటారు) గ్యాంగుల్ని రైతాంగ పోరాట శిబిరాలపై ఉసిగొలిపి రాళ్ళ దాడుల్ని చేయించింది. సింఘు, టిక్రీ, ఘజీపూర్ వంటి బోర్డర్ పాయింట్ల వద్ద యుద్ధ స్థితిని సృష్టించింది. పోలీసుల సమక్షంలో సాగే ఈ లంఫెన్ గ్యాంగుల భీభత్సకాండకు గోదీ మీడియా "స్థానిక ప్రజల పోరు" గా ముద్దు పేరు పెట్టి ప్రచారం చేస్తోంది. గడ్డకట్టే చలిలో 170 మందికి పైగా తమ ఆప్తుల్ని కళ్లెదుటే కోల్పోతూ కన్నీటితో కాలం వెళ్లదీస్తూ కొనసాగిస్తోన్న రైతాంగ పోరాట శిబిరాలపై కొత్తగా రాళ్ళ దాడి సాగుతోంది. అటు మంచువర్షం! ఇటు రాళ్ళ వర్షం! ఇంకో వైపు నిందల పర్వం! వేరొక వైపు పోరాట శిబిరాలకి విద్యుత్, మంచినీటి సరఫరాని కూడా మోడీ ప్రభుత్వం బంద్ చేయించే పాపిష్టి పనికి దిగింది. ఇన్ని రకాల కష్టాల మధ్య మన దేశ రైతాంగం పట్టువదలని దీక్షతో పోరాడుతోంది. వారికి మనం పిడికిళ్ళెత్తి అభివాదం చేద్దాం.

అంబానీ, ఆదానీ వంటి బడా కార్పొరేట్ సంస్థలకు పెద్ద పాలేరుగా మారిన మోడీ-షా ప్రభుత్వం మన రైతాంగం మీద ఇన్ని రకాల ఫాసిస్టు దాడులు చేస్తున్నా, వారిలో మనోధైర్యం సడలడం లేదు. పైగా మరింత సంఘటితం అవుతోంది. దానికి గత మూడు రోజులే సాక్ష్యం!

మొన్న గురువారం రాత్రి ఘజీపూర్ వద్ద ప్రభుత్వ హంగామా యూపీ రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని మారుస్తోంది. రాకేష్ తికాయత్ తో సహా రైతాంగ నేతల్ని మొన్న రాత్రి అవమానించిన రాజ్య దుర్నీతి రైతాంగంలో కడుపు మంటను పెంచింది. ఆ దాడికి నిరసనగా 24 గంటలు కూడా తిరక్కుండానే ముజఫర్ నగర్ లో నిన్న 29వ తేదీ ఏర్పాటు చేసిన మహా పంచాయతీ ఒక జనసముద్రంగా మారింది. ఈరోజు సద్భావనా దినంలో పాల్గొనడమే కాకుండా, నేటి నుండి చట్టాల రద్దు వరకూ శిబిరాలలో ఉండేందుకు నిన్నటి రాత్రి నుండే అసంఖ్యాకంగా రైతాంగం ఘజీపూర్ కు కదిలి వస్తోంది.

అత్యాచారాల సర్కార్ గా పేరొందిన యోగి ప్రభుత్వం పై యూపీ గ్రామీణ ప్రాంతాలు నేడు అట్టుడికి పోతున్నాయి. ఆ మంట ఉత్తరాఖండ్ కి కూడా వ్యాపించింది. మరోవైపు హర్యానా రైతుసంఘాల పిలుపుతో నిన్నటి నుండి గ్రామ పంచాయతీలు, జిల్లా పరిషత్ లు సమావేశాలు జరిపి, మోడీ ప్రభుత్వ దమన నీతిపై నిరసన తీర్మానాలు చేస్తున్నాయి. ఇక పంజాబ్ గ్రామసీమలు నేడు అగ్నిగుండంగా మారడం ఆశ్చర్యం కలిగించదు కదా!

మొన్న 28వ తేదీ రాత్రి ఘజీపూర్ సభా వేదికపై రాజ్య దాడులకు తల్లడిల్లి ప్రముఖ యూపీ రైతునేత రాకేష్ తికాయత్ కార్చిన కన్నీళ్లు నేడు కత్తులుగా మారుతున్నాయి. ఆ ప్రతి కన్నీటిబొట్టు నేడు యూపీ గ్రామసీమల్ని తడిపివేసి, మోడీ ప్రభుత్వంపై దీర్ఘకాలిక పోరుకు రైతుల్ని అగ్గి బరాటాలుగా తీర్చిదిద్దుతోంది. ఈ వ్యాసం రాసే సమయంలో ఘజీపూర్ బోర్డర్ పోయింటుకు జనం ఓ ప్రవాహంలా కదిలి వస్తోంది. (గోది మీడియాలో వాటి దృశ్యాలకై ఎదురు చూడొద్దు)

యూపీలో విద్యార్థిలోకం వెల్లువయ్యే పరిస్థితి కొత్తగా తలెత్తుతున్నది. నిన్నటి మహా పంచాయతీలో అసంఖ్యాకంగా విద్యార్థులు పాల్గొన్నారు. ఆ భారీ సభలో రాకేష్ తికాయత్ సహా రైతు నేతలు విద్యార్థి లోకానికి పిలుపు ఇచ్చారు. నేడు ఘజీపూర్ చేరుకుంటున్న జనంలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉందని ఇప్పుడే అందిన విశ్వసనీయ వార్త! సోమవారం నుండి ఉప విద్యా సంస్థలు కూడా జ్వలించే అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి.


విజయ మాల్యా, నీరవ్ మోడీ వంటి దొంగలు నేడు దేశసంపదని పంది కొక్కుల్లా భక్షిస్తున్నారు. అలాంటి బందిపోటు ఆర్థిక నేరస్తుల్ని వదిలేసి, రైతు నేతల్ని కేసుల్లో ఇరికించి, ఇళ్లపై దాడులు చేస్తోంది. ఈ దురాగతాన్ని సహించబోమని రైతాంగం అగ్ని పర్వతంలా ఉడుకుతోంది.

ఇస్లాం ఉగ్రవాదం పేరిట మైనారిటీలని టెర్రర్ చేసేందుకు ఉపా చట్టాన్ని మోడీ ప్రభుత్వం తన ఆయుధంగా చేసింది. వామపక్ష ఉగ్రవాదంపై పోరు పేరిట కోరేగావ్ కేసుల్ని కూడా బనాయించింది. ఇప్పుడు ఏకంగా రైతు నేతల్ని కూడా ఉపా కేసుల్లో పెట్టింది. NIAని మోడీ ప్రభుత్వం రంగంలోకి దింపింది. ఒక రకంగా, ఉపా చట్టం రద్దు కోసం జరిగే నేటి చిన్న ప్రజాతంత్ర ఉద్యమానికి బలాన్నే ఇస్తోంది. ఇది కీడులో కూడా మేలు వంటిదేమో!

ఒకవైపు లక్షల కోట్ల ప్రజా ధనాన్ని పందికొక్కుల్లా మింగివేస్తూ, పన్ను ఎగవేస్తూ, రాయితీలు భక్షిస్తూ దేశానికి పరమ శత్రువర్గంగా తయారైన బడా కార్పొరేట్ వర్గాన్ని పెంచి పోషిస్తూ మరో వైపున తమ కండలు పిండి, చెమటలు కార్చి, ఐనా అప్పుల పాలై, బ్రతుకే గండంగా మారిన మన రైతాంగాన్ని దేశ ద్రోహులుగా, సంఘవిద్రోహులుగా, అసాంఘిక శక్తులుగా, హింసా మూకగా చిత్రించే ఫాసిస్టు రాజనీతి చెల్లదని చాటుదాం. వారిది ఒంటరి పోరాటం కాదని నిరూపిద్దాం. మనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తిద్దాం.

☞ **మిగతా 18వ పేజీలో**

# ప్రపంచంలో అరుదైన రైతుల ప్రదర్శన



**డాక్టర్ కొల్లా రాజమోహన్**
నల్లమడ రైతు సంఘం, గుంటూరు

రిపబ్లిక్‌డే రోజున ట్రాక్టర్స్ పెరేడ్‌లో లక్షకు పైగా ట్రాక్టర్లతో అంతకుమించిన సంఖ్యలో రైతులు ప్రశాంతంగా పాల్గొని అపూర్వ ప్రదర్శన చేశారు. రైతువ్యతిరేక చట్టాలను రద్దు కోరుతూ ఆందోళన చేస్తున్న రైతులు ఢిల్లీ నగర వీధులలో కదం తొక్కారు. ఢిల్లీ నగరవాసులు ఈ అపూర్వ ప్రదర్శనకు సంఘీభావంగా పూలవర్షం కురిపించారు. మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చినప్పటి నుండీ పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్‌లలో తీవ్ర స్థాయిలో నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ ఉద్యమం ఏ ఒక్క రైతు సంఘమో లేక ఏ ఒక్కరి నాయకత్వం కాకుండా 500 రైతుసంఘాలన్నీ సమైక్యంగా పోరాడుతున్నాయి. ఢిల్లీ సరిహద్దులలో ఎముకలు కొరికే చలిని ఎదుర్కొంటూ, రోడ్డు పై గుడారాలలో 2 నెలలుగా చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం ఆలకించనందున, ప్రభుత్వంపై వత్తిడి తేవటానికి రిపబ్లిక్ దినోత్సవం రోజున ఢిల్లీలో ట్రాక్టర్లతో మహా ప్రదర్శన తలపెట్టారు. ఈ మహా ప్రదర్శనను విఫలం చేయడానికి, ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయటానికి ప్రభుత్వం పన్నిన కుట్రలను కుతంత్రాలను రైతాంగం అడుగడుగునా తిప్పికొట్టింది. జనవరి 26న వివిధ రాష్ట్రాల రాజధానులలో, జిల్లా కేంద్రాలలో భారీ ప్రదర్శనలు జరిగాయి.

రిపబ్లిక్ డే ట్రాక్టర్స్ పెరేడ్‌ను అప్రతిష్టపాలు చేయటానికి ఎర్రకోట వద్ద జరిగిన సంఘటనకు చాలా ఎక్కువ ప్రచారం చేశారు. ట్రాక్టర్లను సామూహిక విధ్వంస ఆయుధాలుగా "టైమ్స్ ఆఫ్ ఇండియా" పత్రిక చిత్రించింది. ట్రాక్టర్‌లు ఎక్కడా విధ్వంసానికి పాల్పడలేదు. రోడ్లను ధ్వంసం చేయలేదు. ప్రభుత్వ సంస్థలను, ప్రైవేటు సంస్థలను ఎక్కడా తాకలేదు. అల్లర్లను, భయోత్పాతాన్ని సృష్టించలేదు. పౌరుల ఆస్తులను ధ్వంసం చేయలేదు. దొంగిలించలేదు. అనుమతించిన మార్గాలలో కూడా రైతులు ఢిల్లీలోకి రాకుండా బారికేడ్లను ఎందుకు పెట్టారు? పోలీసులు ఏర్పాటుచేసిన బారికేడ్లను తొలగించటానికి ట్రాక్టర్లను ఉపయోగించారు. వారు హింసాత్మకంగా వుంటే ప్రజలు పువ్వులతో స్వాగతించేవారా ?

## దీప్ సింగ్ సిద్ధు ఎవరు?

రిపబ్లిక్ డే ట్రాక్టర్స్ పెరేడ్‌ను అప్రతిష్టపాలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నించింది. సినీ నటుడు, గాయకుడు ఐన దీప్ సింగ్ సిద్దును సాధనంగా ఎన్నుకున్నారు. బీజేపీ యమ్ పీ. సన్నీ డయోల్‌కి దీపు సిద్దు సన్నిహితుడు. 2019 ఎన్నికలలో సన్నీ డయోల్ గెలుపు కోసం కృషిచేశాడు. ప్రధానమంత్రి మోడీ గారితో ఫొటోలు దిగేటంత సాన్నిహిత్యం వుంది. "ఆందోళనకారులను రెచ్చగొట్టి దారి తప్పించి ఎర్రకోట వైపు నడిపించాడు" అని హర్యానా బీకేయూ నాయకుడు గుర్నామ్ సింగ్ ఛాదుని అన్నారు. ప్రధానమంత్రి కార్యాలయానికి సన్నిహితుడైన బీజేపీ సభ్యుడొకరు ఏజెంట్ ప్రొవొకేటర్‌గా ఎర్రకోట వద్ద అల్లర్లను రెచ్చగొడుతున్న వార్తను పరిశీలించమని ఉదయం 10 గంటలకే ట్విట్టర్‌లో రాజ్యసభసభ్యులు శ్రీ సుబ్రమణ్యస్వామి గారు పేర్కొన్నారు.

రిపబ్లిక్ డే పెరేడ్ పూర్తయిన తరువాత రైతుల ట్రాక్టర్ ర్యాలీ ప్రారంభం కావాలని రైతు సంఘాలన్నీ అంగీకరించాయి. మార్గాన్ని కూడా నిర్దేశించాయి. సింఘూ సరిహద్దు వద్ద నుండి నిర్దేశించిన సమయానికన్నా ముందే, ఉదయం 8గంటలకే దీప్ సింగ్ సిద్దూ నాయకత్వాన ఒక చిన్న బృందం బయల్దేరింది. నిర్దేశించిన మార్గాన్ని వదిలేసి ఎర్రకోట వైపు దూసుకెళ్ళారు. కిసాన్ సంయుక్త కమిటీ వద్దని నివారించినా వారిమాటను వినలేదు. ఎర్రకోట వైపు వెళ్ళే ప్రయత్నాలు జరుగుతున్నాయని పోలీసులకు ముందురాత్రే తెలుసు. అయినా పోలీసులు వారిని నివారించే ప్రయత్నాలు చేయలేదని యోగేంద్రయాదవ్ తెలిపారు. రైతుల ట్రాక్టర్ ర్యాలీలకు అడుగడుగునా అడ్డంకులను సృష్టించిన పోలీసులు దీపు సిద్దూ బృందానికి ఎర్రకోటకు దారి చూపారు. ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా ఎర్రకోట వైపు దూసుకెళ్ళారు. జాతీయ జెండాకు దగ్గరలో ఒక మతానికి చెందిన నిషాన్ జెండాను ఎర్రకోటపై ఎగరేశారు. టీవీ ఛానల్స్ జెండా ఎగరవేసిన ఘటనను పదే పదే చూపించాయి. ఈ ఘటన జరిగే సమయంలో అక్కడనే ఉన్న పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. మిలిటరీ, పారామిలిటరీ దళాల నిరంతర పర్యవేక్షణ క్రింద వుండే ఎర్రకోట ను ఎక్కి, ఒక జెండాను ఎగరవేయటానికి ముందే అనుమతిని పొందారా ? లేక ప్రభుత్వ ప్రోత్సాహంతోనే ఇలా చేశారా? అనేది చర్చనీయాంశం. వారి తప్పు లేకపోయినా రైతుసంఘాల సమన్వయ సమితి నైతికబాధ్యత వహించింది. ఎర్రకోట సంఘటన మినహాయించి మరెక్కడా చెప్పుకోదగ్గ ఘటనలు జరగలేదన్న సంగతి గుర్తించాలి.

మంచి నీరు, కరెంటు, ఇంటర్నెట్, ట్విట్టర్ అకౌంట్లను ఆపేశారు. కర్రలతో, రాళ్ళతో దాడులు చేసినా ఉద్యమాన్ని ఆపలేక పోయారు. రిపబ్లిక్‌డే రోజున ట్రాక్టర్ల పెరేడ్ విజయవంతం కావటం ఒక చారిత్రాత్మక ఘటన. రైతాంగ ఆందోళనను అప్రతిష్ట పరచటానికి ఎర్రకోట ఘటనను సాకుగా చూపించిన మీడియా కొంతమందిని గందరగోళపరచగల్గింది. త్రివర్ణ పతాకాన్ని తొలగించారనే తప్పుడు వార్తలు కూడా ప్రచారమయ్యాయి. లక్షలాది మంది రైతుల ప్రదర్శనను మీడియా చూపలేదు. సోషల్ మీడియా ద్వారా రైతులు కొన్నివార్తలనందుకున్నారు. క్రమశిక్షణ తో విజయవంతంగా చేసిన రైతుల ప్రదర్శనను చూసి కేంద్ర ప్రభుత్వ కళ్ళు తిరిగాయి. చర్చలకు స్వస్తిచెప్పి సామ దాన బేధ దండోపాయాలలో చివరి అస్త్రాన్ని ఉపయోగించ పూనుకున్నారు. దాడులు, అరెస్టులు, కేసులు మొదలుపెట్టారు. శిబిరాలలో ఉన్న వారికి కనీస సౌకర్యాలు అందకుండా చేస్తున్నారు. రైతు ఉద్యమకారుల శిబిరాలపై దాడులు చేసి గుడారాలను ధ్వంసం చేస్తున్నారు. సైనికుల కవాతులను నిర్వహిస్తున్నారు. ఆందోళన కారులను భయభ్రాంతులను చేయటానికి ప్రయత్నం చేస్తున్నారు.

ఎర్రకోట వద్ద జరిగిన ఘటనలపై 44 మంది రైతు నాయకులపై దేశద్రోహ కేసులను బనాయించారు. రైతులు నివసిస్తున్న సింఘూ, టిక్రీ, ఘాజీపూర్ ప్రాంతానికి ఎవరినీ రానివ్వకుండా పోలీసులు ఆపేశారు. మంచి నీటి వాహనాలను కూడా ఆపేశారు. అర్ధరాత్రిలోగా ఖాళీచేయాలంటూ అల్టిమేటంను ప్రభుత్వ అధికారులు జారీ చేశారు. అక్కడినుండి వెళ్ళిపోని పక్షంలో తామే తొలగిస్తామని జిల్లా కలెక్టర్ ప్రకటించాడు.ప్రజలు గుమికూడకుండా సెక్షన్ 144 విధించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నారు. మూడు సరిహద్దుప్రాంతాలలో ఇంటర్నేట్‌ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆపేసింది. రైతులు సమాచారాలను పంచుకోవటానికి వీలులేకుండా ఇంటర్నెట్ కట్ చేశారు. ప్రవాహంగా వస్తున్న రైతులు రాకుండా సింఘూ వద్ద ప్రభుత్వం బారికేడ్లతోపాటు ముళ్ళకంచె వేసి తాత్కాలికంగా గోడను నిర్మిస్తున్నారు.ప్రజలు అందోళనా ప్రాంతాలకు రాకుండా రైళ్లను దారి మళ్ళించారు. రైతులను, జర్నలిస్టులను అరెస్టు చేస్తున్నారు.


## స్థానికుల పేరున గూండాల దాడి- బీబీసీ ప్రత్యక్ష కథనం

స్థానికుల పేరున కొంతమంది వాహనాలలో తరలివస్తుంటే పోలీసులు చూస్తూ ఊరుకున్నారు. పోలీసుల కళ్ళముందే గుడారాలను పీకేస్తుంటే నివారించటానికి ప్రయత్నించలేదు. పైగా రైతులపై లాఠీఛార్జి చేశారు. స్థానికుల పేరున వచ్చిన బీజేపీ కార్యకర్తలు రాళ్ళతోనూ కర్రలతోనూ రైతులపై దాడిచేశారు. రైతులు వారి ప్రాణాలను కాపాడుకోవటానికి ప్రతిఘటించారు. అయినా నాయకుల మాటలు విని ప్రశాంతంగా దెబ్బలు తిన్నారు. ఆందోళనను ఎట్టిపరిస్థితులలోనూ విరమించేది లేదని తేల్చి చెప్పారు.

సింఘూ ప్రాంతాన్ని సందర్శించిన బీబీసీ ప్రతినిధి దిలీప్ సింగ్ టిక్రీ గ్రామస్థులతో మాట్లాడాడు. “మరి వాళ్ళు నిజంగా స్థానికులేనా? అని అడిగితే .. ఈ రోజు వచ్చిన వాళ్ళంతా బీజేపీ పంపించిన గూండాలే” అని గ్రామస్థులు చెప్పారు. ఉద్యమం శాంతియుతంగా సాగుతోంది. క్రమశిక్షణతో సాగుతోంది. స్థానికులు వ్యతిరేకిస్తున్నారనేది అబద్ధం. టిక్రీ గ్రామ పంచాయితీ ప్రజలందరూ వచ్చి మద్దతు ప్రకటించి వెళ్ళారు. ఏది అవసర మయినా మేమున్నామని టిక్రీ గ్రామం రైతులు హామీ ఇచ్చి వెళ్ళారు. ఇప్పటికి 51వేల రూపాయలు విరాళం ఇచ్చారు. ఇంకా పాలు, లస్సీ ,డబ్బులు, ఏది కావాలన్నా సేకరించి ఇస్తామన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఈ ధర్నాతో ఎలాంటి సమస్యా లేదు. తాము పస్తులుండైనా సరే, రోడ్డుపక్కన పూరిగుడెసెలలో వుండే పేదలకు మూడుపూటలా అన్నం దొరికేలా చూస్తున్నారు. ఈ నల్లచట్టాలను వెనక్కి తీసుకునేంత వరకూ రైతులు వెనక్కి వెళ్ళరు. మేం కూడా వెనక్కి వెళ్ళేదిలేదు.” అని ఒక పెద్దాయన చెప్పాడు. “నేను రైతు బిడ్డను. కొందరు జాతీయజెండాలను పట్టుకు రావటం కనిపించింది. ఇందులో మాప్రాంతం వారు ఎవరున్నారో చూద్దామని అక్కడకు వెళ్ళాను. అక్కడ బీజేపీ కార్యకర్త గజేంద్రసింగ్ కన్పించాడు. నీకు సిగ్గు అనిపించటంలేదా నువ్వు ఈ ప్రాంతం వాడివి కూడా కాదు, ద్వారకా వాడివి, రైతువి కాదు, ప్రాపర్టీ డీలర్‌వి కదా? చెడగొట్టటానికే వచ్చావా? అని అతనిని మందలించాను. అంతలో ఒక యువకుడు నేను గేవ్రా గ్రామం వాడినన్నాడు..అబద్ధం చెప్పకు ఈప్రాంతంలో ప్రతి ఒక్కవ్యక్తీ నాకు తెలుసు అన్నాను. ఈ ప్రాంతం వాళ్ళు ఒక్కళ్ళుకూడాలేరు. ఉంటే చూపండి అని సవాల్ చేశాను. ఈ మోసాలు సాగవు. మేం సహించము అని హెచ్చరించాను” అని ఒక స్థానిక రైతు చెప్పాడు. మరొక మహిళ ఇలా చెప్పింది, “ఎవరికీ ఏసమస్యాలేదు. ఉద్యమం వలన ఎవరూ ఇబ్బందిపడటంలేదు. ఇక్కడ టిక్రీ, లేకారాం పార్క్, మమా చౌక్, చోటూరామ్ నగర్ గ్రామాలన్నీ మార్కెట్ కోసం ఇక్కడికే వస్తుంటారు. కానీ ఈ గ్రామాలలో ఎవరికీ ఇబ్బంది లేదు” అని ఆమె చెప్పింది.

☞ మిగతా 31వ పేజీలో

# CAAకు రైతు ఉద్యమమే మార్గదర్శి !



అజయ్ గుడవర్తి

అనువాదం : మల్లెంపాటి వీరభద్రరావు

2014 నుండి, సుదీర్ఘ మౌనం తరువాత భారత దేశంలో నేడు అనేక సంఘటిత ఉద్యమాలు ప్రజ్వరిల్లుతున్నాయి. గత సంవత్సరం ఇదే కాలంలో పౌరసత్వ సవరణ బిల్లుకు (CAA) వ్యతిరేకంగా షహీన్బాగ్‌లో పెద్ద ఉద్యమాన్ని మనం చూసాం. ఈ చలికాలంలో కూడా, ఢిల్లీ సరిహద్దులలో అలాంటి సమీకరణ లనే మనం చూస్తున్నాం. కానీ, ఉభయ సమీకరణలూ ప్రజా వ్యతిరేకమైన చట్టాలకు వ్యతిరేకమైనప్పటికీ, ప్రజలు వాటిని భిన్నంగా స్వీకరించారు. ఈ వ్యత్యాసం మనకు దేనిని తెలియ జేస్తుందంటే, రాజకీయ సమీకరణలు, నీతి మరియు ప్రజా సంబంధమైన నైతికత, సంఘటిత సమీకరణల స్థాయిని తెలియజేస్తుంది.

పౌరసత్వం లేకుండా చేయబడిన వారి సమస్యపై సిఎఎ వ్యతిరేక నిరసనలు ప్రారంభమయ్యాయి. కానీ, ఆ నిరసనలు ముస్లింల యొక్క పౌరసత్వ సమస్యగా కుదించడం జరిగింది. మొట్టమొదటిసారి ముస్లిం స్త్రీల ప్రాతినిధ్యంతో, వారి నాయకత్వం లో ఉద్యమం నిర్వహించబడడాన్ని మనం గమనించాం. ప్రస్తుతం, ఢిల్లీ సరిహద్దులలో జరుగుతున్న రైతాంగ ఉద్యమంలో, పంజాబు మరియు ఇతర రాష్ట్రాల వయోవృద్ధులు, ప్రజలు ఏ విధంగానైతే భరింపరాని చలిలో ఉద్యమిస్తున్నారో, వారిలాగానే, సిఎఎ ఉద్యమకారులు కూడా బహిరంగ ప్రదేశాల్లో తీవ్రమైన చలిరాత్రులలో ఇబ్బందులు పడ్డారు. ముస్లిం పురుషులు తమ ఇండ్లలో ఉండి వారి స్త్రీలను వీధుల్లోకి పంపారని యోగి ఆదిత్యనాథ్ తీవ్రమైన వ్యాఖ్యలు చేసినప్పుడు, ఒక జడ్జి ముదురు గారు స్త్రీలను, వృద్ధులను వారి ఇళ్లకు వెనక్కు తీసుకు వెళ్ళమని ఉచితమైన సలహా ఇచ్చారు. సిఎఎ కి వ్యతిరేకంగా ఉన్న ముస్లిం మహిళా ఉద్యమకారులు/సిఏఏ వ్యతిరేక ఉద్యమకారులుగా ఒక సార్వజనీనమైన చర్చను లేవనెత్తారు. ఈ ఆందోళనలు కేవలం పౌరసత్వ హక్కుల కోసం కాదని, ప్రజాస్వామ్యాన్ని మరియు రాజ్యాంగాన్ని సంరక్షించడం కోసమని ప్రకటించారు. అదేవిధంగా నేటి రైతుల వాదన కూడా, తమ ఆందోళన కేవలం పంజాబ్ రైతులు లేక రైతుల కోసమే కాదని, ఆహార భద్రత, అదే విధంగా నమూనా అభివృద్ధి విధానం కోసం, భారతదేశ వ్యాప్తంగా వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ ద్వారా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడాన్ని గూర్చి తాము ఆందోళన చేస్తున్నామని ప్రకటించారు. ఉదారవాదులు, విద్యార్థులు షహీన్‌బాగ్ ఉద్యమకారులకు సంఘీభావంగా సీఏఏ నిరసనల్లో భాగస్వాము లయ్యారు. అదేవిధంగా ఈసారి వామపక్షాలు, వాటి అనుబంధ రైతు సంఘాలు ఖాఫ్స్, స్త్రీలు, రైతులు ప్రాంతీయ, మతాల కతీతంగా, ఢిల్లీ సరిహద్దులలో నిర్వహించబడుతున్న నిరసన ఉద్యమంలో భాగస్వాములయ్యారు.

ప్రభుత్వ విషయానికి వస్తే, మొదటి దశలో ఈ రెండు ఉద్యమాలను తక్కువగా అంచనా వేసి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఎన్నికల ప్రక్రియ మొత్తం, షహీన్బాగ్ పేరుతో జరిగినా, బిజెపి ఎన్నికలలో విజయవంతం కాలేదు. ఈ ఉద్యమాన్ని, ఆందోళనను తన మూస పద్ధతిలో జాతి వ్యతిరేకమైన దని, రోజువారీ ప్రయాణీకులకు ఇబ్బంది కలుగుతుందని చిత్రీకరించింది. ఉద్యమం ఆసాంతం అల్లర్లు, హింసతో ముగిసింది. చైతన్యయుతమైన రైతుల ఉద్యమం పట్ల, ఉద్యమ కదలికల పట్ల కూడా ప్రభుత్వం నీచమైన, దుర్మార్గమైన వంచనకు పాల్పడింది. ప్రభుత్వం రైతులను ఖలిస్థానీయులని, ఈ ఉద్యమం ధనిక రైతుల నాయకత్వంలోని ప్రతినిధుల అధ్వర్యంలో నిర్వహించ బడుతుందని, చిట్ట చివరి అస్త్రంగా వివాదస్పదమైన చట్టాలన్నీ పంజాబ్ హర్యానాలోనే, నమోదయ్యాయని ప్రచారం చేశారు. ఏది ఏమైనా ఈ రోజు ప్రభుత్వం ఆందోళన చేస్తున్న రైతులతో వ్యవహరించడంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తుంది, కనీసం వారితో చర్చించేందుకు అంగీకరించవలసిన అనివార్య పరిస్థితి ఏర్పడింది.

ఈ రెండు ఉద్యమాలకు గల వ్యత్యాసాన్ని జనంలో జనాదరణ పొందగల చైతన్యాన్ని, భావనలను రగిలించగలిన స్థాయిని బట్టి నిర్ణయించాలి. రైతాంగ ఉద్యమంలో ఉద్యమానికి సంబంధించి గ్రామం నుండి సార్వజనీనమైన స్పష్టమైన విధానంతో స్థిరంగా ఉన్నారు. మత పరంగా మైనారిటీగా ఉన్న సిక్కు సమూహం నాయకత్వంలో, వారు వ్యవసాయానికి సంబంధించిన అంశం కావడంవల్ల సిక్కుగానో, లేక జాట్‌గానో పరిగణించబడలేదు. మతపరమైన గుర్తింపు ఉన్నప్పటికీ, వ్యవసాయదారునికి ఉన్న నైతికపరమైన సామాజిక గుర్తింపు వల్ల మరింత విశాలమైన శాశ్వతమైన ప్రాతిపదికన వచ్చింది. ఈ అనుకూలత సీఏఏ వ్యతిరేక ఉద్యమకారులకు లేకుండా పోయింది.

వాళ్ళున్నంత కాలం, సీఏఏ వ్యతిరేక ఉద్యమకారుల పట్ల తీవ్రంగా పక్షపాతం చూపడానికి, విద్వేషం పెంచడానికి ప్రభుత్వానికి తేలికయింది. ఆ పోరాటం కేవలం ఒక మతసంస్థ యొక్క చర్యగా చిత్రీకరించబడింది.

తమను ఒంటరిగా చేస్తున్న చట్టాల పట్ల ముస్లిం సమాజం ఏ విధంగా స్పందిస్తుందో అనే అంశాన్ని ఎవరైనా ప్రశ్నించవచ్చు. ముస్లిం యువతుల యొక్క నిరసనలు, అత్యంత ప్రధానంగా, ప్రముఖంగా వయోవృద్ధులైన స్త్రీలు పాల్గొన్న ఉద్యమం, గమనించదగిన తేడాను, ఉద్యమం ఎలా స్వీకరించబడిందో తెలియజేస్తుంది. ఆ ఉద్యమానికి నైతిక బలం చేకూర్చింది. నిస్సహాయ స్థితిలో ఉన్న మైనారిటీలకు ఆమోదయోగ్యమైన, సానుభూతితో కూడిన మద్దతు లభించింది. మెజారిటీ వర్గంలో ఆందోళనను, వ్యాకులతను, ఉత్కంఠను పెంచింది. ఆధిపత్య సామాజిక తరగతులలో ఉత్కంఠను రేకెత్తించే సామాజిక పరిస్థితులు లేకపోవడం వల్ల, తప్పుడు కథనాలు ప్రచారం చేయడం సాధ్యం కాలేదు. సిఎఎ వ్యతిరేక నిరసనలు వారి యొక్క మత సంబంధమైన గుర్తింపుతో పరిమితం చేసి, వృద్ధ మహిళలు, పిల్లలను నిస్సహాయులుగా మార్చారు. దీనితో పోలిన సంఘటనే జామియా మిలియా ఇస్లామియా విద్యార్థులపై జరిగిన హింసాత్మక సంఘటన. వారు కూడా ముందు విద్యార్థులు, ఆ తరువాతనే ముస్లింలు.

"ది ఐడియా ఆఫ్ జస్టిస్" పుస్తకంలో అమర్త్యసేన్ పేర్కొన్నట్లుగా, ఏకత్వ భావనతో గుర్తింపును కోరుకున్నట్లయితే అది హింసాత్మక పరిస్థితులకు దారి తీసి, అనేక రకమైన చర్చలకు అవకాశం ఇస్తుంది. రైతాంగ ఉద్యమానికి ఉన్న ప్రత్యేకత ఏమంటే ఉద్యమంలో ఉన్న బహుళత్వమే. పంజాబ్‌కు సంబంధించిన సిక్కులు మరియు జాట్‌లు నాయకత్వం వహించినప్పటికీ, అది అన్ని ప్రాంతాలకు సంబంధించింది. ఈ ఉద్యమంలో మహిళలు, వామపక్షాలు, వారి అనుబంధ సంఘాలు, వేతన కార్మికులు మరియు దళితులు, ధనిక రైతులకు తమ మద్దతును తెలియజేస్తున్నారు. ఆధిపత్య వర్గాల ఏకత్వ ఆలోచనలకు భిన్నంగా ప్రజాబాహుళ్యం యొక్క మద్దతు కూడగట్టుకోవడంలోనే సి ఏ ఏ వ్యతిరేక ఉద్యమం యొక్క భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

ఈ ఉద్యమం ఒకరికి చెందినదనే భావన తలెత్తుతుంది. ముస్లింలు పరిపాలకులనే ముఖ్యమైన భావన గతం నుండే ఉత్పన్నం కావడం, దానికి భిన్నంగా ప్రస్తుతం వాస్తవంగా ఉన్న, వారిని బాధ పెట్టే, సానుకూలత లేని అనేక అంశాలు ప్రతికూల అంశాలుగా మారాయి. దీనివల్ల వారు సానుభూతినిగానీ, జాలిని గాని పొందడం కష్టమైంది. ఎందువల్లనంటే, ఇది తీవ్రమైన విద్వేషానికి, మూలం అయింది. దీనితో పాటు ముస్లింలను మన జాతీయులుగా కాకుండా ప్రపంచ సమాజంలో ఒక భాగంగా చూశారు. ప్రపంచవ్యాపితంగా 40 ముస్లిం దేశాలలో ఇస్లాం అత్యంత వేగంగా అభివృద్ధి అవుతున్న మతంగా అగ్రభాగాన ఉన్నది. సి ఏ ఏ వ్యతిరేక సమీకరణాలు చేయాలంటే జనాకర్షణ పొందగలిగే మార్గాల వైపు ఇస్లాం మతంగా వాస్తవాలను దృష్టిలో ఉంచుకొని స్నేహపూర్వకమైన, సామరస్యంతో కూడిన ఆలోచనలు చేయవలసి ఉంటుంది.

8. ముస్లింల పై పెరుగుతున్న దాడుల పట్ల ఉదాసీనతను, ఈ దేశం ఒకరికే చెందినదనే భావనను తొలగించగలిగినప్పుడే ఈ దాడులను అడ్డుకోగలరు.

ఇస్లాం మతం ఒక మతంగా భారతదేశం వెలుపల పుట్టింది. ఈ దేశంలోనే పునాది గల సిక్కు మతంలాగా, అదేవిధంగా ప్రత్యేక దేశంగా విడిపోతామనే వారిలాగా డిమాండ్ చేయని ఇతర మతాలతో సామరస్య పూర్వకంగా మెలగాల్సి ఉంటుంది. సిక్కులను ఖలిస్తాన్‌నీయులుగానైతే కఠినమైన చర్యలతో అణిచి వేయవచ్చు.

కానీ రైతులుగా సిక్కులను అణచివేయలేరు. అణిచివేయడం సాధ్యపడదు. సూఫీ యిజమ్ మరియు దర్గా (మసీదులు) లకు సంబంధించిన సంస్కృతి, ప్రార్థనలకు ఉమ్మడి ప్రదేశాల ఆధారాలు, ఉమ్మడి సంస్కృతి మన దేశంలో ఏ విధంగా ఉంటుందో తెలియజేస్తాయి. ఆధిపత్య దృష్టితో, ప్రతీకార సమీకరణాలను సవాలుగా తీసుకుంటూ పోతే ఇది కార్యరూపం దాల్చలేదు. ❑

*('ది హిందూ' సౌజన్యంతో)*


**శ్రీ కలిదిండి భీమరాజు**
**88వ జయంతి**

**మార్చి 21, ఆదివారం, తణుకు**
**ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు**

చర్చాగోష్టులు
**"ప్రస్తుత దేశ పరిస్థితులలో గ్రాంసీ భావజాల ఆవశ్యకత"**
సాయంత్రం 5 గంటలకు **స్మారకోపన్యాసం**

ఆసక్తి గల మిత్రులు మరిన్ని వివరాల కోసం సంప్రదించండి

**డివివియస్ వర్మ** ✆ 85006 78977, 83741 01719

**డా॥ బి. రమేష్‌చంద్రబాబు** ✆ 93971 14495

# రాజ్యాంగాన్ని పరిరక్షించాలి; సమాఖ్య స్ఫూర్తిని కాపాడాలి



**డా. పి. నారాయణ రావు**

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన మూడు నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లో రైతాంగ నిరసనల వెల్లువను గత రెండు నెలలుగా చూస్తున్నాం. ఈనెల 26వ తేదీ రిపబ్లిక్ దినోత్సవ సందర్భంగా రైతులు తలపెట్టిన దేశ వ్యాపిత ట్రాక్టర్ల ర్యాలీలు ఈ ఉద్యమం తారాస్థాయిని సూచిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాల నాయకులతో జరిపే చర్చల్లో కొత్త చట్టాలను కొంతకాలం అమలు చేయబోమని చెప్పినప్పటికీ, అసలు ఈ చట్టాలు రాజ్యాంగానికి వ్యతిరేకమైనవని, వ్యవసాయం రాష్ట్రాల పరిధిలోని అంశమని, ఆ అంశంపై ఎలాంటి చట్టాలు చేసే అధికారం కేంద్రానికి లేదని రైతు సంఘాలు తేల్చి చెబుతున్నాయి. ఈ మేరకు రైతు సంఘాల తరపు న్యాయవాదులు ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని కూడా వేశారు. దురదృష్టవశాత్తు సుప్రీంకోర్టు ఈ చట్టాల రాజ్యాంగ బద్ధత గురించి పట్టించుకోకుండా కేంద్రప్రభుత్వం, రైతుల మధ్య జరుగుతున్న చర్చలను ప్రక్కదారి మళ్లించి కాలయాపన గావించే మార్గాన్ని ఎంచుకుంది. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్రం ఏకపక్షంగా వ్యవహరించడాన్ని ఎన్ డి ఏ లోని మిత్రపక్షాలు కూడా హర్షించలేకపోతున్నాయి.

ఈ నేపథ్యంలో మనం నేటి ప్రధానమంత్రి మోడీ గారు 2014లో ప్రభుత్వంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్రాల ఎడల అవలంబిస్తున్న వైఖరి తద్వారా కేంద్ర రాష్ట్ర సంబంధాలపై దాని ప్రభావం ఎలా ఉందో ఒకసారి చూద్దాం.

నరేంద్ర మోడీ గారు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వాన్ని “ఢిల్లీ రాజరికం” గా అభివర్ణించేవారు. రాష్ట్రాల ఎడల కేంద్రం వివక్షత చూపుతోందని గవర్నర్ల వ్యవస్థలు దుర్వినియోగం కాబడుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం ప్రజాకర్షక పథకాల ద్వారా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తుందని, ప్లానింగ్ కమిషన్, ఫైనాన్స్ కమిషన్లు కేంద్రం యొక్క పక్షపాత వైఖరికి వత్తాసుగా నిలుస్తున్నాయని ఆరోపించేవారు.

బిజెపి 2014 ఎన్నికల మేనిఫెస్టోలో కేంద్ర రాష్ట్ర సంబంధాలను సామరస్యపూర్వకంగా మారుస్తామని నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్.డి.సి), ఇంటర్ స్టేట్ కౌన్సిల్ (ఐ.ఎస్.సి) లను పునరుద్ధరించి పునరుత్తేజం కల్పిస్తామని వాగ్దానం చేసింది.

2014లో ప్రధాని మోడీ పార్లమెంటులో తన తొలి ఉపన్యాసంలోనే సహకార ఫెడరలిజం గురించి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు అనుసరించిన “పెద్దన్న” పాత్రకు భిన్నంగా తాను వ్యవహరిస్తారని వాగ్దానం చేశాడు.

బిజెపి అధికారంలోకి వచ్చిన కొన్ని రోజులకే “కాంగ్రెస్ ముక్త భారత్” (కాంగ్రెస్ లేని భారతదేశం) సాధించాలి అనే నినాదాన్ని ఇవ్వడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ఎడల కక్షపూరిత వైఖరి ప్రారంభించింది. తదనంతరం బీజేపీని వ్యతిరేకించిన ప్రాంతీయ పార్టీలపై రాజకీయ దాడితో పాటు, కేంద్ర ప్రభుత్వ అనుమతులను ఇవ్వడంలోనూ, నిధుల విడుదలలోనూ జాప్యం చేస్తూ వచ్చింది.

కాంగ్రెస్ ప్రభుత్వం రోజుల్లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356ని దుర్వినియోగ పరిచి కాంగ్రెసేతర ప్రభుత్వాలను బర్తరఫ్ చేసి అధ్యక్ష పాలన ప్రవేశపెట్టే దుష్ట సాంప్రదాయానికి తాము చరమగీతం పాడతామని అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే అరుణాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఆర్టికల్ 356 దుర్వినియోగపరిచారు.

నాటి జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో బీజేపీయేతర పార్టీలు ఐక్యమయ్యే సూచనలు కనిపించినప్పుడు అకస్మాత్తుగా 2018 నవంబరులో అసెంబ్లీని రద్దు చేశారు.

ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుండి లెఫ్టినెంట్ గవర్నర్లు వాడుకుంటూ ఆ పార్టీపై కక్ష సాధింపు చర్యలు కేంద్రం కొనసాగిస్తూనే ఉంది.

ఇక 2019 ఎన్నికల అనంతరం కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వాలను కూలగొట్టడానికి చేసే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం గవర్నర్లను ఎలా వినియోగించుకున్నదీ మనందరం గమనించిందే.

ఇక ప్రతిపక్ష పార్టీలకు చెందిన రాజకీయ నాయకుల ఇండ్లపై సి.బి.ఐ, ఇన్‌కమ్‌టాక్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ల లాంటి సంస్థల యొక్క దాడుల గురించి వేరే చెప్పనవసరం లేదు.

అందువలన ఇటీవలి కాలంలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సి.బి.ఐ నేరుగా తమ రాష్ట్రంలో జరిపే దాడులను అంగీకరించ బోమని తేల్చి చెప్పాయి.

వీటన్నింటికీ పరాకాష్టగా ఆర్టికల్ 370 రద్దు. జమ్మూకాశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించడం. దేశ చరిత్రలోనే రాష్ట్ర ప్రభుత్వ హోదాను, కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం ఇదే మొదటిసారి. కేంద్రం రాష్ట్ర అసెంబ్లీని సంప్రదించకుండా తీసుకున్న నిరంకుశ చర్య ఇది. ఇక ప్రతి రాష్ట్ర ఎన్నికల సందర్భంలోనూ ప్రధానమంత్రి ప్రసంగాల్లో రాష్ట్రాలకు ప్యాకేజీలు ప్రకటించడంతో పాటు బీజేపీ వ్యతిరేక పార్టీలకు అధికారం అప్పగిస్తే కేంద్ర ప్రభుత్వం పథకాలు సరిగ్గా అమలు జరగవని హెచ్చరిస్తూ వస్తున్నారు. కొన్ని రాష్ట్రాల ఎన్నికల విషయంలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని దుర్వినియోగం చేసిన ఘటనలు మనం చూశాము.

ఇక ఇక కేంద్ర ప్రభుత్వ పథకాల విషయానికొస్తే రాష్ట్రాల అంశాలైన ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్యుత్తు, పారిశుద్ధ్యం లాంటి అంశాలపై కేంద్రం పీఎం ఉజ్వల యోజన, పీఎం కిసాన్ యోజన, స్వచ్ఛభారత్ అభియాన్, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాలను రాష్ట్రాలపై రుద్దడమే కాక తమ సొంత పథకాలను రూపొందించుకున్న రాష్ట్రాలపై దాడి చేయడం ప్రారంభించింది.

కువైట్ మహమ్మారి వచ్చిన తర్వాత అకస్మాత్తుగా రాష్ట్రాలను నామమాత్రంగా కూడా సంప్రదించకుండా లాక్‌డౌన్ ప్రకటించడం ద్వారా రాష్ట్రాలు తమ ఆదాయాన్ని గణనీయంగా కోల్పోయాయి. తదనంతర కాలంలో రాష్ట్రాలు కోలుకోవడానికి తమకు రావాల్సిన జి ఎస్ టి నిధుల బకాయిలను విడుదల చేయడంలో ఎంతో జాప్యం చేస్తుంది . ఈ విషయంలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వంతో ఘర్షణకు దిగవలసి వచ్చింది.

వ్యవసాయ చట్టాల విషయంలోనే కాదు రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్ర విద్యుత్ చట్ట సవరణ బిల్లు, పర్యావరణ ప్రభావ అంచనా (ఈ.ఐ.ఏ) నోటిఫికేషన్‌లను తీసుకొచ్చి ప్రజా వ్యతిరేకత రావడంతో అమలు చేయడం మేరకు వాయిదా వేసింది. వాటి కోవలోనే పౌర సవరణ బిల్లు అమలు ప్రక్రియ, పెద్ద నోట్ల రద్దు చర్యలు వస్తాయి.

పై ఉదాహరణలో బట్టి నేటి పాలక పార్టీ తాము దేశంలో ఉన్న రోజుల్లో ఏమి చెప్పిందో తాము కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తదనంతరం అంతద్విరుద్ధంగా వ్యవహరిస్తూ ఉందనే విషయం మనకు అర్థమవుతుంది.

మరి ఈ వైఖరిని తిప్పికొట్టడానికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు, సమాఖ్య స్ఫూర్తిని నిలబెట్టడానికి వామపక్ష, ప్రజాస్వామ్య పార్టీల నాయకులు తక్షణం ఒక త్రాటిపైకి వచ్చి కేంద్ర రాష్ట్ర సామరస్య సంబంధాల పునరుద్ధరణకు పూనుకోవలసిన తరుణం ఆసన్నమైంది.

ఈ ప్రజాస్వామ్య ఫెడరల్ ఫ్రంట్ యొక్క ఎజెండాగా నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, ఇంటర్ స్టేట్ కౌన్సిల్‌లను పునర్వ్యవస్థీకరణతో పాటు, రాబోయే పార్లమెంట్ సమావేశాలలో రాజ్యాంగం లోని ఏడవ షెడ్యూల్ పై కూడా చర్చ జరపడం లాంటి అంశాలను పొందుపరచడం సమంజసంగా ఉంటుంది.

దీనికి 1980 దశకంలో నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జరిపిన ప్రతిపక్ష కూటములను (అపోజిషన్ కాంక్లేవ్స్) స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది. ❑

## చరిత్రలో అతిపెద్ద దుర్దినం జనవరి 30

**(12వ పేజీ తరువాయి)**

కాలం ఇంత త్వరగా ఇలా మలుపులు తీసుకుంటుందని మూడు నెలల క్రితం రాజకీయ పండిత వర్గాలు సైతం ముందస్తు అంచనా వేయలేక పోయాయి. చరిత్ర గమనం ఎంతటి విచిత్ర మలుపులు తీసుకుంటుందో కదా! ఇప్పటి వరకూ ఎలా వున్నా, ఇక మౌనం వహించడానికి వీలు లేదు. మన "మౌనం" కూడా ఓ నేరంగా మారే స్థితి ఏర్పడింది. మనం కదలి, జనాన్ని కూడా కదిలించాల్సిన ఓ చారిత్రక దశ ముందుకొచ్చింది. ఢిల్లీలో మన మాతా పితల వంటి రైతాంగం పై లంఫెన్ గ్యాంగులతో రాళ్ళ దాడులు చేయించే ఆపద కాలంలో "మౌనం" ద్వారా మనం నేరస్తులుగా చరిత్రలో మిగిలిపోరాదు.

చరిత్రలో విద్వేష రాజనీతి పై ఆధారపడే "ఫాసిజం" బ్రతికి బట్టకట్టి జీవించింది. కుక్క గొడుగుల వంటి దాని క్షణిక బ్రతుక్కి కూడా ప్రజల్ని చీల్చే విద్వేష రాజనీతే ఆధారంగా ఉంటుంది. మనువాద రాజనీతి ఈ విద్వేష రాజనీతికి అతిపెద్ద పోషక పదార్థం. అదే భారతదేశ సామాజిక వ్యవస్థలో ఫాసిస్టు పాలకులకు ఓ అదనపు ఆయుధం. దానికి బలైన తొలి రాజకీయ వేత్త గాంధీ! అట్టి గాంధీ హత్య రోజు ఇచ్చిన "సద్భావన దినం" సరిగ్గా ఫాసిస్టు "విద్వేష రాజనీతి" కి విరుద్ధమైనది. ఫాసిజాన్ని ఓడించాలంటే, ప్రజల మధ్య సఖ్యత అవసరం. ఈ పిలుపు ఫాసిజం పై రాజకీయ పోరుకు అవసరమైన సాంస్కృతిక పోరు కూడా! నేటి "సద్భావనా దివస్" పిలుపు రేపటి ఫాసిస్టు వ్యతిరేక సాంస్కృతిక పరివర్తన ప్రజల్లో కలిగించడానికి ఒక వనరు కూడా! ఈ సాంస్కృతిక ఉద్యమానికి నడుం బిగించిన రైతాంగ పోరాట శక్తుల చొరవని అభినందిస్తూనే, వారికి కేవలం సంఘీభావంగానే కాకుండా, ఫాసిజం ఓటమికోసం కూడా రాజకీయ శపథం చేద్దాం. ❑

# వాళ్లు అభూతకల్పనల్ని చరిత్ర అంటారు

తెలుగు : కొప్పర్తి వెంకటరమణమూర్తి

ప్రొ. రొమిలా థాపర్

2014లో నరేంద్ర మోడీ, ఆయన రాజకీయ పార్టీ భారతీయ జనతా పార్టీ, లేదా బిజెపి, ఎన్నికైన దగ్గర నుంచి వాళ్లు భారతదేశ చరిత్రను తమకు అనుకూలంగా రాసుకోవడం ద్వారా హిందూ జాతీయవాద దృక్పథాన్ని ఆమోదింపచేసే ప్రయత్నాలు పునఃప్రారంభించారు. ఇవి నిజానికి 1999-2004 మధ్య బిజెపి భారతదేశాన్ని మొదటిసారి పాలించినప్పుడే మొదలయ్యాయి. మోడీ గారి పాలనలో ఆయన పార్టీ చేతే పాలింప బడుతున్న రాష్ట్రప్రభుత్వాలు చరిత్రను మార్చే ఈ ప్రయత్నాన్ని అనేక రూపాల్లో చేపడుతున్నాయి. కొన్ని తమ దృక్పథానికి భిన్నంగా ఉన్న అధ్యాయాల్నీ, భాగాల్నీ పాఠ్య పుస్తకాల్లోంచి తొలగిస్తుంటే, మరికొన్ని తామే తయారుచేసిన పాఠాంతరాల్ని వాటిల్లో చేరుస్తున్నాయి.

దేన్నైనా వక్రీకరించగలిగే ప్రసార సాధనాలు వాళ్లకున్నాయి. వాటి ద్వారా పోగు చేసిన అభూత కల్పనల్ని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నిర్వహించే పాఠశాలల్లో చరిత్రగా ఇప్పటికే బోధిస్తున్నారు. ఈ సంఘ్ మోడీ గారి పార్టీ బిజెపికి మాతృసంస్థ. ఈ సంస్థలోనే ఆయన చాలా కాలం కార్యకర్తగా నిర్వహకుడిగా బాధ్యతలు నిర్వహించారు.

హిందూ జాతీయవాదులకు చరిత్రెందుకు అంత ముఖ్యమై పోయిందీ !?

జాతీయవాదులు ఎవరినైతే జాతిలో భాగమనుకుంటారో వారిని గతంలో గుర్తించే చరిత్ర రచనకు పూనుకుంటారు. తీవ్ర జాతీయవాదులకైతే వర్తమానంలో తమ చర్యలను సమర్థించే గతాన్ని రూపొందించుకోవాల్సిన అవసరం ఉంటుంది. కాబట్టి హిందూ జాతీయవాదులు తమ దృక్పథాన్ని న్యాయసమ్మతం చేసుకోవడానికి భారతదేశ చరిత్రను తమకు అనుకూలంగా రాసుకోవడం మొదలుపెట్టారు.

మోహన్ దాస్ కే గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ వంటి వారి సారథ్యంలో వలసవాద వ్యతిరేక లౌకిక జాతీయవాద సంస్థ అయిన భారత జాతీయ కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజల ప్రతినిధిగా స్వాతంత్ర్యాన్ని సాధించింది. అయితే ఈ ధోరణిని సవాలు చేస్తూ 1920లలో అప్పటికి తక్కువ జనామోదం ఉన్న రెండు రకాల జాతీయవాదాలు తలెత్తాయి. మహమ్మదీయ భూస్వాములూ చదువుకున్న మధ్యతరగతి కలిసి స్థాపించిన ముస్లిం లీగు ప్రాతినిధ్యం వహించిన ముస్లిం జాతీయవాదం ఒకటైతే, హిందూ ఆధిక్య వర్ణాలూ మధ్యతరగతి కలిసి స్థాపించిన హిందు మహాసభ ప్రాతినిధ్యం వహించిన హిందూ జాతీయవాదం రెండోది. ఈ రెండవ సంస్థే తర్వాత కాలంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లేదా ఆరెస్సెస్‌గా రూపం మార్చుకుంది. 1947 లో పాకిస్తాన్ ఏర్పడడంలో ముస్లింలీగ్ ప్రధాన పాత్ర వహించింది. కాగా, ఆరెస్సెస్ దాని అనుబంధ సంస్థలు భారతదేశాన్ని లౌకిక ప్రజాస్వామ్యాన్నుండి హిందూ రాజ్యంగా మార్చడానికి ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. హిందూ మెజారిటీవాదాన్ని చట్టబద్ధం చేయడానికి పూనుకున్న వారి దృక్పథమే 'హిందూత్వ' గా పిలువబడుతోంది.

నిజానికి ముస్లిం, హిందూ జాతీయవాద రెండిటి మూలాలు భారతదేశ చరిత్ర మీద వలసవాద బ్రిటన్‌కు ఉన్న అవగాహనలో ఇమిడి ఉన్నాయి. 1817 లో ప్రచురితమై ఎంతో ప్రభావం చూపిన James Mill గ్రంథం 'The History of British India' లో ప్రతిపాదింపబడిన ద్విజాతి సిద్ధాంతాన్ని వలసవాద విధాన నిర్ణేతలు బలపరిచారు. మిల్ భారతదేశంలో ఉన్న హిందువులు, ముస్లింలు రెండు వేర్వేరు జాతులని అవి నిరంతరం సంఘర్షణ లోనే సాగాయని అన్నాడు. దీనికి సంధానం చేస్తూ మిల్ భారతదేశ చరిత్రను హిందు, ముస్లిం, బ్రిటిష్ అనే మూడు యుగాలుగా విభజన చేశాడు. తొలిదశలో ఈ రెండు దృక్పథాలూ భారతీయుల ఆమోదం పొందినప్పటికీ, చరిత్రకారులు యాభై ఏళ్ల క్రితమే వాటిని ప్రశ్నించి నిగ్గు దేల్చి పూర్వపక్షం చేశారు. అయినా ఇప్పటికీ హిందూత్వకు ఈ భావజాలమే పునాదిగా ఉంది.

హిందువులు అధికంగా ఉండటమనే వాస్తవమే ప్రజాస్వామ్యం స్థానంలో ఒక హిందూ రాజ్య స్థాపనకు మార్గం సుగమం చేస్తుందని వారభిప్రాయం. బ్రిటిష్ ఇండియా పరిధిలో ఉన్న ఏ ప్రదేశం తమ పూర్వీకుల మాతృభూమి అయి ఉందో ఎక్కడైతే తమ హిందూమతం పుట్టిందో ఆ ప్రదేశానికి చెందినవాడే హిందువు అని హిందుత్వ నిర్వచనం. ఇది బయటి ప్రదేశాలనుంచి వచ్చిన వారినే కాక క్రైస్తవ, ముస్లిం, పార్శీ వంటి ఇతర మతస్థుల్ని కూడా హిందువుల్నుంచి స్పష్టంగా విభజించాలని వారి అభిమతం.

హిందువుల మూలాలు ఆర్య సంస్కృతిలో కనుగొనబడ్డాయి. ఆర్య అనేది భాషా లేదా సంస్కృతీ సంబంధమైన పదమనీ, ఇది

క్రీపూ రెండవ సహస్రాబ్దికి చెందిందనీ, అదికొన్ని శారీరక లక్షణాలు కల్గిన జాతిని సూచించే పదం కాదనీ, రుజువైంది. కానీ, హిందూత్వ దృక్పథం కలిగిన చరిత్ర దీని మూలాల్ని అంతకంటే వెయ్యేళ్లకు ముందు విలసిల్లిన సింధులోయ నగర నాగరికతను కూడా కలుపుకుని దానికంటే వెనక్కు వెళ్లడానికి సమకట్టింది. ఇదంతా హిందూ మూలాల్ని వీలైనంత వెనక్కు తీసుకువెళ్లే ప్రయత్నమే! హిందువుల మూలాలు ఆర్యులలో ఉన్నాయనుకుంటే, ఆర్య శబ్దానికి గౌరవనీయుడనే అర్థం ఉంది కాబట్టి హిందువులు ఇతరుల మీద ఆధిక్యత పొందవచ్చునని వారి ఉద్దేశ్యం. ఇది ఆర్యనిజం గురించిన 19వ శతాబ్ది యూరోపియన్ భావజాలాన్ని ప్రతిబింబించడమే కాక, 1930ల నాటి జర్మన్, ఇటాలియన్ ఫాసిజాల బలమైన ముద్రను కలిగి ఉంది. ఈ జాడల్ని ఆరెస్సెస్ వ్యవస్థాపకుల రచనల్లో స్పష్టంగా గమనించవచ్చు.

భారతదేశంలో మొదటి, రెండవ సహస్రాబ్దాల్లో స్పష్టంగా జరిగిన వివిధ జాతుల సంస్కృతుల సమ్మేళనం గురించి చరిత్రకారుల పరిశోధనలు తేటతెల్లం చేస్తుంటే హిందుత్వ సిద్ధాంతకర్తలు వాటినన్నిటినీ మింగి వేస్తూ ఉపఖండమంతా హిందు పూర్వ ఆర్య సంస్కృతే పరుచుకుని ఉందనే అవాస్తవాన్ని బలవంతంగా రుద్దుతున్నారు. ఇటీవలి పురావస్తు పరిశోధనల వల్ల తెలియవచ్చిన జన్యు సంబంధ సాక్ష్యాలు ఉత్తర భారతీయులు ఇరాన్, మధ్య ఆసియా జాతులతో సమ్మిశ్రితమైనట్లు రుజువు చేస్తున్నాయి. చరిత్ర కారులు దీన్ని వివిధ జాతులు భారతదేశం లోకి వలస వచ్చిన వైనానికి దృష్టాంతంగా చూస్తుంటే, హిందుత్వ చరిత్ర నిర్మాణానికి ఇదొక శాపంగా పరిణమించింది.

ముస్లిములు భారతదేశానికి రాక పూర్వం అంటే క్రీపూ 1000- క్రీశ 1200 అంతా భారతదేశ చరిత్రలో స్వర్ణయుగమనీ, ఆ యుగంలో శాస్త్ర సాంకేతిక రంగాలు ఎంతో అభివృద్ధి చెందాయనీ, ఆధునిక కాలానికి చెందినవని భావిస్తున్న విమానాలూ, ప్లాస్టిక్ సర్జరీ, మూల కణ పరిశోధన వారికి అప్పుడే తెలుసుననీ నొక్కి చెపుతున్నారు. ఇవన్నీ ప్రాచీన కాలానికి చెందిన దేవతల గాథలకు అన్వయించి అవి వాస్తవాలని నమ్మబలుకుతున్నారు.

హిందుత్వ వాదనలోని మరొక అవాస్తవమేమిటంటే వెయ్యేళ్ల ముస్లిం పాలన పొడవునా హిందువులు పీడనకు గురై బానిసల్లా జీవించారనడం. హిందూ రాజ్యస్థాపన డిమాండ్‌లో తమ అణచివేతకు ప్రతిగా దక్కవలసిన చారిత్రకహక్కును ప్రకటిస్తున్నారు. రెండవ సహస్రాబ్దికి చెందిన 'ముస్లిం యుగ' చరిత్ర అంతా ద్వేషాన్ని రగిల్చే ఈ కోణంలోంచే చూడబడుతోంది. నిజానికి ఇటువంటి సాధారణీకరణాలకు చరిత్రకారులకు సాక్ష్యాలు లభించలేదు. కానీ వీళ్లు వారి వాదనని వినిపించుకోరు.

అవును, హిందువులకు ముస్లిములకు కొన్ని ఘర్షణలు జరిగిన మాట నిజమే. అవి ముస్లిం యుగానికి పూర్వం హిందువులకూ బౌద్ధులకు జరిగిన ఘర్షణల్లాంటివే. కొందరు బలవంతులైన ముస్లిములు హిందూ దేవాలయాల మీద ధనం కోసమే కాదు, మతానికి వ్యతిరేకంగా దాడి చేసిన మాట కూడా నిజమే. అట్లాగే కొందరు హిందు పాలకులు సైతం ధనం కోసం హిందు దేవాలయాల మీద దండెత్తిన సందర్భాలున్నయ్. అంటే ఇటువంటి సందర్భాలలో మత విద్వేషాన్ని మించినదేదో పనిచేసినట్టు అర్థమౌతుంది.

ఏ యుగంలో అయితే తాము అణచివేయబడ్డామని వారంటున్నారో ఆ యుగంతో పాటు రెండు వేల సంవత్సరాల పాటు అంటరానితనం పేరిట అగ్రవర్ణ హిందువులు క్రింది కులాల్ని అణచివేసిన విషయాన్ని వారు విస్మరించడమే ఐరనీ! కానీ, ఈ యుగంలోనే మహమ్మదీయ భక్తి సంప్రదాయాల చేత ప్రభావితమైన ఎన్నో నూతన ఆలోచనలు హైందవాన్ని సుసంపన్నం చేశాయి. కానీ వాళ్లు వీటిని చెదురు మదురు ఘటన లుగా కొట్టిపారవేస్తారు. మహమ్మదీయ కవులు హిందు దేవతల మీద అల్లగా ఇప్పటికీ సంప్రదాయ సంగీత కచేరీలలో ఆలాపించ బడుతున్న దివ్య కీర్తనల్ని ప్రస్తావించరు. అట్లాగే ఈ కాలంలో ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాల్లో అత్యధిక భాగం హిందూ అగ్రవర్ణస్థులే నిర్వహించారనే వాస్తవాన్ని కూడా సౌకర్యవంతంగా మరచిపోతారు.

సమకాలీన భారతదేశంలో వలసవాద వ్యతిరేకతకూ, లౌకికతే దేశ సామాజికతకు కేంద్రమనే అవగాహనకూ ప్రతీక అయిన భారత తొలి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ మీదా ప్రణాళికా బద్ధంగా జరుగుతున్న దాడులు దేశ లౌకిక ప్రజాస్వామ్యం మీద జరుగుతున్న దొంగ దాడులుగానే పరిగణించాలి. నెహ్రూ విజయాల్ని తగ్గించడానికీ ఆయన మీద వ్యతిరేకతను పెంచడానికి చేస్తున్న ఈ ప్రయత్నమంతా భారత వలసవాద వ్యతిరేక ఉద్యమంలో భాగం కాని ఆరెస్సెస్ తనను తాను వ్యక్తీకరించుకోవడమే.

హిందుత్వ ధోరణి చరిత్ర నాటుకుపోవడంలోని ప్రమాదం ఏమిటంటే శాస్త్రీయమైన చరిత్రను ప్రక్కకు నెడుతూ గతాన్ని హిందు మెజారిటీవాద దృక్పథానికి కట్టబెట్టడం పెరుగుతూ పోవడమే! దీనికి ప్రభుత్వ అండదండలున్నాయి. పోషణ ఉంది. నిధులున్నాయ్. అనేక ప్రచార మార్గాలున్నాయ్. చరిత్ర పరిశోధనను కూలదోయడంలో భాగంగా హిందుత్వ చరిత్ర దృక్పథాన్ని విమర్శించే వారిని ఇప్పటికే జాతి వ్యతిరేకులుగా ముద్ర వేయనే వేశారు. ❑


( మే 17, 2019 ది న్యూయార్క్ టైంస్ )

# సంపాదకునిగా ఏంగెల్స్



కొండూరి వీరయ్య

ఏంగెల్స్ ద్విశతి ఉత్సవాలు ముగింపుకు వస్తున్నాయి. మార్క్సిజానికి ఏంగెల్స్ అందించిన సేవల గురించి అనేక విశ్లేషణలు, వివరణలు, వ్యాఖ్యానాలు వచ్చాయి. ఈ సందర్భంగానే మార్క్సిజం మౌలిక సూత్రాలను క్రోడీకరించే క్రమంలో ఏంగెల్స్ మార్క్స్ సూత్రీకరణలను, నిర్ధారణలను వక్రీకరించాడా అన్న చర్చ కూడా గణనీయంగానే జరిగింది. ఇదే పత్రిక గత సంచికలో సంపాదకుడు రాసిన వ్యాసంలో కూడా దాని ప్రస్తావన ఉన్నప్పటికీ మౌలికంగా ఆ వ్యాసం ఏంగెల్స్‌ను ఒక రాజకీయ అర్థశాస్త్రవేత్తగా వ్యాఖ్యానించటంపైనే ఎక్కువగా కేంద్రీకరించింది. ఏంగెల్స్–మార్క్స్‌ల మధ్య ఉన్న మేధో వైవిధ్యాన్ని వైరుధ్యంగా చూపించే ప్రయత్నాల నేపథ్యంలో ఈ వ్యాఖ్య అవసరమని భావిస్తున్నాను.



యోధుడు–సారథి లాంటి జోడీ మార్క్స్–ఏంగెల్స్‌లది. అర్జునుని ప్రస్తావన లేకుండా కృష్ణుడు గురించిన చర్చ అసమగ్రంగా ఉన్నట్లే కృష్ణుడు ప్రస్తావన లేకుండా అర్జునుని గురించిన చర్చ కూడా అసమగ్రమే అవుతుంది. మార్క్స్ – ఏంగెల్స్‌ల గురించిన చర్చ కూడా అదే కోవకు చెందినది. మహా భారతంలో సారథిగా ఉన్న కృష్ణుడు ఆయుధ ప్రయోగం చేయలేదు. కానీ ఏంగెల్స్ పీడిత ప్రజల విముక్తి కోసం అక్షరాలా ఆయుధాన్ని పట్టిన వీరుడని గుర్తు చేయటానికి సంశయించ నవసరం లేదు. ఏంగెల్స్ ప్రతిపాదిత విప్లవ కార్యాచరణలో ప్రజాస్వామిక హక్కులు, ప్రజాతంత్ర పనివిధానం, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం (ప్రత్యేకించి కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ చర్చల నేపథ్యంలో), భిన్న దృక్పథాలు కలిగిన వ్యక్తులు, సంస్థలు, సంఘాల మధ్య రాజకీయ ఏకాభిప్రాయానికి కృషి చేయటం వంటివి మౌలిక చర్యలుగా కనిపిస్తూ ఉంటాయి.

నాటి శాస్త్ర విజ్ఞాన రంగంలో పురోగమించిన నవయుగ పోకడలు (ఎన్‌లైటెన్‌మెంట్) స్ఫూర్తికి అనుగుణంగా ఏంగెల్స్ తొలినాళ్లల్లో విప్లవాత్మక రాజ్యాంగతత్వం, ప్రజాబాహుళ్య రాజకీయాలు (ఆ కాలంలో రాజకీయాలు కులీన వర్గాలకు మాత్రమే పరిమితమైన క్షేత్రంగా ఉండేవి, వ్యక్తిగత హక్కులు, వర్గ అసమానతలు, పారిశ్రామికాభివృద్ధి పర్యవసానాలు, జర్మనీలో జాతీయవాదం వంటి అనేక అంశాల్లో పురోగామి దృక్పథాన్ని అలవర్చుకున్నాడు. యువ హెగేలియన్లల్లో ఈ విప్లవాత్మక రాజ్యాంగతత్వం ప్రధాన ధోరణిగా ఉండేది. (రాజ్యాంగం న్యాయబద్ధంగా రూపొందించగలిగితే తదుపరి పాలన అంతా రాజ్యాంగబద్ధంగా సాగుతుందన్న ఆశాభావం). 19వ శతాబ్దిలో సాగిన విప్లవోద్యమాలు, విముక్తి ఉద్యమాలన్నింటిలోనూ రాజ్యాంగ రూపకల్పన ప్రధాన ఎజెండాగా ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవచ్చు. జర్మన్, ఫ్రెంచి విప్లవోద్యమాలను విదేశీ శక్తుల సహకారంతో పాలకవర్గం (కొత్తగా అధికారం చేజిక్కించుకున్న బూర్జువా వర్గం) రక్తపాతంతో అణచివేసిన తర్వాత బూర్జువా వర్గపు ప్రజాతంత్ర స్వభావం పట్ల యూరోపియన్ సోషలిస్టులు, కమ్యూనిస్టులు, ఛార్టిస్టులు, యువ హెగేలియన్ మేధో శ్రేణుల్లో సైద్ధాంతిక చర్చలు మొదలయ్యాయి. ఈ సమయంలోనూ లండన్ చేరుకున్న మార్క్స్ అప్పటికే తన శేషజీవితానికి సరిపడా లక్ష్య నిర్దేశం చేసుకుని ఉన్నాడు.

అయితే మార్క్స్ నిర్దేశించుకున్న అధ్యయన శైలి గతితార్కికమైనది. అంటే నిరంతరం సమాజంలో జరిగే ఆర్థిక సాంఘిక, రాజకీయ, శాస్త్ర విజ్ఞాన రంగాల్లో జరుగుతున్న పురోగమనాన్ని అధ్యయనం చేసి ఇతర రంగాల్లో వ్యక్తమవుతున్న గతితార్కిక అభివృద్ధి క్రమాన్ని ఇముడ్చుకునే విధంగా తన సైద్ధాంతిక నిర్ధారణలు, అంచనాలను తాజా పర్చుకునే దిశగా సాగించే అధ్యయనం. పెట్టుబడి మొదటి సంపుటం 1864లోనే పూర్తయినా 1874 వరకూ అందులోని నిర్ధారణలను, అంచనాలను మార్క్స్ తాజాపరుస్తూనే ఉన్నాడు. రెండు, మూడు సంపుటాల రచన క్రమంలో ముందుకొచ్చిన అనేక కొత్త వివరాల్లో మొదటి సంపుటంలో విశ్లేషణను బలోపేతం చేయటానికి ఉపయోగించే అంశాలన్నింటినీ మొదటి సంపుటానికి జోడిస్తూ వచ్చాడన్న ఒక్క

ఉదాహరణ చాలు మార్క్స్ అధ్యయన శైలిని అర్థం చేసుకోవటానికి.

ఈ విలక్షణ అధ్యయన క్రమాన్నే లెనిన్ నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనంగా నాలుగు పదాల సముదాయంగా క్రోడీకరించాడు. ఈ సూత్రాన్ని ఉద్యమ రూపకల్పన సమయంలో అనుసరించే ఎత్తుగడలు, వ్యూహానికి పరిమితం చేసి మాట్లాడుకోవటం దైనందిన కమ్యూనిస్టు పరిభాషలో కనిపిస్తున్న అంశమే. ఈ గతితార్కిక అధ్యయన శైలిని అనుసరించే క్రమంలో మార్క్స్ తానుగా నిర్ధారణకు వచ్చిన అనేక విషయాలను నిర్ధారణల రూపంలో నమోదు చేయటానికి అవకాశం దక్కలేదు. అటువంటి అనేక సందర్భాలు మార్క్స్ మరణానంతరం ఆయన రాతప్రతుల రూపంలో మరుగునపడే ప్రమాదానికి చేరువలో ఉన్న సమయంలో ఏంగెల్స్ వాటికి ఓ రూపాన్నిచ్చే ప్రయత్నం చేశాడు. కీలకమైన రాజకీయ అర్థ శాస్త్రానికి సంబంధించిన సూత్రాలైనా, సాయుధ గెరిల్లా ఎత్తుగడలైనా జనరంజక భాషలో వివరించగల నేర్పు ఏంగెల్స్ స్వంతం. ఈ నేర్పుతోనే మరుగున పడిన మార్క్స్ మేధస్సును వెలుగులోకి తెచ్చేందుకు దాదాపు దశాబ్ద కాలాన్ని వెచ్చించాడు. మార్క్స్ జీవితకాలంలో ప్రచురణకు నోచుకోని అనేక రచనలు, వ్యాఖ్యానాలను తాజా ముందుమాట, పరిచయాలతో ప్రపంచ విప్లవోద్యమానికి అందించిన సంపాదకుడు ఏంగెల్స్. మార్క్స్ మరణానంతరం ఏంగెల్స్ నాటి కమ్యూనిస్టు శ్రేణులకు అందుబాటులోకి తెచ్చిన కొన్ని రచనల విషయంలోనే వ్యాసం ఆరంభంలో ప్రస్తావించిన అభ్యంతరాలు ముందుకొచ్చాయి.

మార్క్స్ 1883లో మరణించిన తర్వాత పెట్టుబడి గ్రంథాన్ని సంస్కరించి అచ్చుకు సిద్ధం చేసే కీలకమైన సంపాదక యజ్ఞాన్ని ఆరంభించాడు ఏంగెల్స్. మరో వైపున ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడుతున్న వర్కర్స్ పార్టీలు, కమ్యూనిస్టు పార్టీలు, సోషల్ డెమొక్రటిక్ పార్టీలుకు దిశా నిర్దేశం చేయటంలో కూడా ఏంగెల్స్ క్రియా శీలక పాత్ర పోషించాడు. అయితే ఈ విధంగా వివిధ దేశాలకు దిశా నిర్దేశం చేసే ప్రయత్నంలోనే మార్క్సిజం పరిణామ క్రమాన్ని ఓ చారిత్రక నేపథ్యంలో సులభంగా సాధారణ కార్యకర్తలు సైతం అర్థం చేసుకోవటానికి వీలుగా రూపొందించాడు.

మార్క్స్ రచనలను సులభ శైలిలో కార్మికవర్గ నాయకులను వివరించే ఏంగెల్స్ ప్రయత్నం మార్క్స్ జీవిత కాలంలోనే మొదలైంది. ప్రత్యేకించి మొదటి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏర్పాటుతో ఈ అవసరం గతంలో ఎన్నడూ లేనంతగా ముందుకొచ్చింది. అప్పటికే పెట్టుబడి గ్రంథం మొదటి సంపుటాన్ని అచ్చుకు సిద్ధం చేయటంలో తుది అడుగులు వేస్తున్న మార్క్స్ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సమన్వయానికి కావల్సినంత సమయం ఇచ్చే స్థితిలో లేడు. దాంతో 1870 నుండీ ఈ బాధ్యత ఏంగెల్స్‌కు అప్పగించాడు మార్క్స్, ఏంగెల్స్‌కు 12 భాషల్లో మాట్లాడగల రాయగల సామర్థ్యం కూడా ఇంటర్నేషనల్ నిర్వహణ బాధ్యత ఏంగెల్స్‌కు అప్పగించటానికి ప్రోత్సాహకారిగా మారింది. ఏంగెల్స్ మిత్రులు "12 భాషల్లో ఏంగెల్స్ చిందులేయగలడు" అని గుర్తు చేసుకున్నారు. -

1878 నాటికి దాదాపు రచనా వ్యాసంగాన్ని ఆరోగ్య కారణాల రీత్యా నిలిపివేసినా వివిధ దేశాల నుండి సమాచారాన్ని సేకరించటం, లేఖలు రాయటం, సమకాలీన సాహిత్యంలో ముఖ్యమైన రచనలను ఎన్నుకుని వాటిపై నోట్సు రాసుకోవటం మాత్రం కొనసాగిస్తూనే ఉన్నాడు. 1878 నుండీ ఏంగెల్స్ మార్క్స్‌కు కళ్లు చెవులు లాగా పని చేశాడు. విల్హెల్మ్ లిబ్నెక్ట్‌తో సహా సమకాలీన జర్మన్ సోషలిస్టులు మార్క్సిజాన్ని జనరంజకంగా విస్తరిస్తున్న విప్లవోద్యమాలకు చేరవేయటంలో సమర్ధవంతమైన పాత్ర పోషించలేకపోతున్న తీరును గమనించిన ఏంగెల్స్ పలు కరపత్రాలు, బుక్‌లెట్లు రాసేందుకు సిద్ధమయ్యాడు. ఈ కాలంలోనే ప్రౌధాన్ ప్రభావంలో ఉన్న జర్మన్ సోషల్ డెమొక్రసీ పత్రికలో ఇళ్ల స్థలాల సమస్య గురించిన వ్యాసాల ద్వారా (ది హౌసింగ్ క్వశ్చన్) ప్రౌధానిజానికి, మార్క్సిజానికి మధ్య ఉన్న తేడాని కార్మికులుకు, సోషల్ డెమొక్రసీ నాయకులకు విడమర్చి వివరిస్తూ ఏంగెల్స్ వ్యాసాలు రాశాడు. చారిత్రక భౌతిక వాదం సిద్ధాంతం ఆచరణాత్మక అధ్యయనం గురించి పరిచయం చేయటం కోసం జర్మనీలో రైతు యుద్ధాలు రచనను తాజా తొలిపలుకులతో వెలుగులోకి తెచ్చాడు.

మార్క్సిస్టు మౌలిక రచనల్లో కొన్నింటిని పరిశీలిస్తే ఏంగెల్స్ సంపాదక సామర్థ్యం ఎలాంటిదో అర్థం చేసుకోవటం సాధ్యమవుతుంది. వేతనశ్రమ–పెట్టుబడి కరపత్రం 1849లో మార్క్స్ రాసినది. ఈ కరపత్రంలో "శ్రమ" అన్న పదమే కనిపిస్తుంది. అదనపు విలువ సృష్టికి మూలం శ్రమ శక్తిలోనే ఉంది అన్నది మార్క్స్ విస్పష్టంగా ఆవిష్కరించిన పెట్టుబడిదారీ చలన సూత్రం. మార్క్స్ ఇదే అర్థంతో రాసినా 1849 నాటి కరపత్రంలో మాత్రం శ్రమ శక్తి అన్న పదం కనిపించదు. ఈ కరపత్రం 1891 నాటి పునర్ముద్రణకు రాసిన ముందుమాటలో ఏంగెల్స్ ఈ అంతరాన్ని పూరిస్తూ రాసిన వాక్యాలు గమనించదగ్గవి. మార్క్స్ కేవలం తన మేధో సామర్థ్యాన్ని సాధారణ పాఠకుల ముందు పెట్టాలి అనుకుని ఉంటే ఆయన రచనలు మక్కికి మక్కి అలానే జనం ముందుకు

వచ్చేవి. కానీ ఆయన రాసిన రచనలు కేవలం తన మేధోకృషి గురించిన గొప్పలు చెప్పుకోవటానికి కాదు. తన రచనలు ఉద్యమ పథంలో ఉన్న కార్మికుల చైతన్యాన్ని పెంపొందించేందుకే అన్న అవగాహనతో రాసిన రచనలు అవి. కాబట్టే తన పాత రచనలను కొత్త ఆవిష్కరణల నేపథ్యంలో పునఃపరిశీలించి ఉండేవాడు. కీలక భావనలు పాఠకునికి చేరేలా అవసరమైన మార్పులు చేసి ఉండేవాడు అని రాశాడు. (సంకలిత రచనలు, సంపుటి 27, పేజీలు 194-195). 1849 నాటి ప్రతి ప్రకారం కార్మికుడు తన శ్రమను పెట్టుబడిదారునికి అమ్ముకుంటాడు. కానీ 1891 నాటి ప్రతి ప్రకారం కార్మికుడు శ్రమ శక్తిని అమ్ముకుంటాడు. ఇది పైకి చూడటానికి మాటలను అటు ఇటు మార్చినట్లు కనిపిస్తున్నా ముందుకు తెచ్చింది మాత్రం రాజకీయ అర్థశాస్త్రం లోని అత్యంత కీలకమైన ఆవిష్కరణ. మార్క్సిజం పై దాడి చేసే మేధావులు నేటికీ శ్రమ-శ్రమ శక్తిల అవగాహనలో ఉన్న అంతరాన్ని కప్పి ఉంచేందుకే ప్రయత్నం చేయటం గమనార్హం.

కమ్యూనిస్టు ప్రణాళికలో కూడా ఇటువంటి సందర్భం మనకు కనిపిస్తుంది. కమ్యూనిస్టు ప్రణాళిక 1888 నాటి ఇంగ్లీషు పునర్ముద్రణకు, 1890 నాటి జర్మన్ ప్రతికి రాసిన ముందు మాటల్లో ప్రణాళిక' సమకాలీన ప్రాధాన్యతను వివరించే క్రమంలో ఇది చారిత్రక పత్రం, దీన్ని మార్చే హక్కు నాకు గానీ మార్క్స్‌కు గానీ లేవని స్పష్టం చేస్తాడు. అదే సమయంలో పాఠకుల సౌకర్యం కోసం 1848 నుండీ 1890 మధ్య ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ, రాజకీయ పరిస్థితుల్లో వచ్చిన మార్పులను మార్క్సిజపు మౌలిక సిద్ధాంతం చారిత్రక భౌతికవాద సూత్రాల వెలుగులో వివరిస్తాడు. ఈ ముందుమాటలు చదివిన తర్వాత ప్రణాళిక ప్రధాన పాఠం చదివితే అదేదో కాలం చెల్లిన పత్రం అన్న భావనే కలుగదు. అందకే నేటికీ ఈ పత్రం ప్రపంచవ్యాప్తంగా పీడితులను సమాజ మార్పు దిశగా, పండితులను మేధో విన్యాసాల దిశగా ప్రేరేపిస్తూనే ఉంది.

పెట్టుబడి గ్రంధాన్ని సంస్కరించి ప్రచురించే క్రమంలో ఏంగెల్స్ మార్క్స్ నిర్ధారణలను మార్క్స్ ప్రస్తావించిన స్ఫూర్తితో ప్రస్తావించలేదనీ, వివరణల పేరుతో ఏంగెల్స్ చేసిన అనేక మార్పులు మౌలికంగా మార్క్సిజంపై పెట్టుబడిదారీ మేధావులు దాడి చేయటానికి దారితీశాయన్నది ఏంగెల్స్ గురించి ఉన్న మౌలిక విమర్శ. దీని లోతుపాతులు క్లుప్తంగానైనా ప్రస్తావించు కోవాలంటే పెట్టుబడి గ్రంథం ప్రచురణ క్రమాన్ని అర్థం చేసుకోవాలి. అధ్యయనం చేయాలి.

పెట్టుబడి గ్రంథం మొదటి సంపుటి 1864లోనే పూర్తి అయ్యింది. మిగిలిన రెండు సంపుటాల కోసం ఎదురు చూడకుండా మొదటి సంపుటాన్ని ప్రచురించాలని 1866లో ఏంగెల్స్ ప్రతిపాదిస్తాడు. దీనికి సమాధానంగా "రాత ప్రతి సిద్ధంగానే ఉన్నప్పటికీ దాన్ని అచ్చుకు సిద్ధం చేయాలంటే నేను మాత్రమే చేయగలను. చివరకు నీకు కూడా సాధ్యం కాదు." అని సమాధానమిస్తాడు. ఓ విలేకరికి ఇచ్చిన సమాధానంలో మార్క్స్ "పెట్టుబడి గ్రంధాన్ని ఓ క్రమంలో రాయాలనుకున్నాను. దీనికి కావల్సిన సమాచారం అంతా సేకరించాను. చిత్తు ప్రతి సిద్ధం చేశాను. ఆ తర్వాతనే మొదటి సంపుటాన్ని సిద్ధం చేశాను. మొదటి సంపుటం రాయటానికి ఉపయోగపడిన కీలక సమాచారం అంతా చిత్తు ప్రతిగానే మిగిలిపోయింది" అంటాడు మార్క్స్. (సంకలిత రచనలు 48వ సంపుటి). అంటే పెట్టుబడి 2, 3 సంపుటాలు రాయటాన్ని మార్క్స్ మొదటి సంపుటం కంటే ముందే పూర్తి చేశాడు. ఇదే విషయాన్ని మరో చోట ప్రస్తావిస్తూ ఏంగెల్స్ "1864-67 మధ్య కాలంలోనే పెట్టుబడి 2, 3 సంపుటాలుగా చెప్పబడుతున్న భాగాలను మార్క్స్ పూర్తి చేశాడు అని స్పష్టం చేస్తాడు. (సంకలిత రచనలు 37వ సంపుటి). మూడవ సంపుటంలో ఎక్కువ భాగం 1864-65 మధ్యకాలంలోనే పూర్తి అయ్యిందని రెండో సంపుటానికి రాసిన ముందు మాటలో కూడా ప్రస్తావిస్తాడు. ఈ భాగాలు పూర్తి చేసిన తర్వాతనే మొదటి సంపుటాన్ని వివరించేందుకు మార్క్స్ పూనుకున్నాడని ఏంగెల్స్ వివరిస్తాడు. అయితే ఇదంతా సమాచారం రూపంలో సిద్ధంగా ఉందే తప్ప నిర్ధారణలు, ఆవిష్కరణల రూపంలో కాదు. పెట్టుబడి గ్రంథం 2, 3 సంపుటాలను అచ్చుకు సిద్ధం చేసే క్రమంలో ఏంగెల్స్ చేసిన పని మార్క్స్ ఆవిష్కరణలకు ఓ రూపాన్నివ్వటమే.

సరుకుల విలువ గురించిన సూత్రీకరణ విషయంలోనూ సంపాదకుడిగా ఏంగెల్స్ తీసుకున్న జాగ్రత్త రచయిత చెప్పదల్చుకున్న భావానికి సంపాదకుడు ఇచ్చే విలువను మన ముందుంచుతుంది. సోమ్బార్ట్‌కు 1896 మార్చి 11న రాసిన లేఖలో ఏంగెల్స్ "సరుకుల విలువ గురించి ప్రస్తావించేటప్పుడు నేను తాజా ఆర్థికదశకు (పెట్టుబడిదారీ దశకు) మాత్రమే పరిమితం కావాలి. ఎందుకంటే ఈ దశలో మారకపు విలువ, సరుకుల ఉత్పత్తి ఏ సామాజిక రూపంలో ఉనికిలో ఉన్నాయో అంతవరకే పరిమితం కాగలను." అని పెట్టుబడి గ్రంధాన్ని ఎడిట్ చేయటంలో తనకు తాను విధించుకున్న ఆంక్షలను వివరిస్తాడు.

కానీ ప్రత్యేకించి 1992లో మార్క్స్ ఏంగెల్స్ సమగ్ర రచనలు (ఇప్పటి వరకూ అందుబాటులో ఉన్న యాభై సంపుటాలు సంకలిత

రచనలు – ఈ రచనల కూర్పు చరిత్ర వచ్చే మరో సందర్భంలో వివరిస్తాను) పేరుతో వచ్చిన రచనల నేపథ్యంలో పెట్టుబడి సంకలనంలో ఏంగెల్స్ పాత్ర గురించి చర్చ పునఃప్రారంభమైంది. ఈ సందర్భంగానే పెట్టుబడి గురించిన నాలుగు ముసాయిదాలు కూడా వెలుగు చూశాయి. ఈ చిత్తు ప్రతులను ఏంగెల్స్ సంపాదకత్వంలో వెలువడిన పెట్టుబడి సంపుటాలకు మధ్య ఉన్న తేడాలను బూతద్దంలో చూడటం మొదలైంది. మూడో సంపుటం 13–15 అధ్యాయాల్లో వివరించిన లాభాల రేటు పతనం సిద్ధాంతం మీద కొత్తతరం పరిశోధకులు దండెత్తారు. మార్క్స్ 1864–65లో రాసుకున్న చిత్తు ప్రతిలో ఉన్నదానికంటే పెట్టుబడి గ్రంథం మూడో సంపుటంలో ఉన్న వివరణ సమగ్రంగానూ, గతితార్కిక అధ్యయన శైలికి అనుగుణంగానూ ఉందన్నది ఈ విమర్శకుల వాదన. లాభాల రేటును ప్రభావితం చేసే కారకాల విషయంలో మార్క్స్ ప్రస్తావించిన కారణాలకు ఏంగెల్స్ పరిమితం కాలేదన్నదని మరో వాదన. అత్యంత కీలకమైన ఊభ నిర్ధారణ లేదా సూత్రీకరణ విషయంలో నిర్దిష్టత లోపించిందనీ, భవిష్యత్తులో తలెత్తనున్న పరిణామాలు, దోహదం చేయనున్న కారణాలను ఇముడ్చుకునే రీతిలో ఏంగెల్స్ వివరణ విశాలంగా ఉన్నదన్నది మరో విమర్శ. మరి కొందరు విమర్శకులు లాభాల రేటు పతనం సూత్రీకరణలకు మార్క్స్ ఇచ్చిన ప్రాధాన్యతను మించి ఏంగెల్స్ శాశ్వతత్వాన్ని ఆపాదించారని విమర్శించారు.

లాభాలరేటు పతనాన్ని నిలువరించేందుకు, నివారించేందుకు పెట్టుబడి అనుసరించే అనేక మార్గాల గురించి వివరిస్తూ ఏంగెల్స్ పెట్టుబడి మూడో సంపుటం మొదటి భాగంలో ఓ అధ్యాయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తాడు. పెట్టిన పెట్టుబడి తిరిగి రాబట్టుకోవ టానికి పెట్టుబడిదారీ వర్గం ఎన్నో ప్రయోగాలు చేస్తుందనీ, ఎన్నో రూపాల్లో తన పెట్టుబడి తిరిగి సాధ్యమైనంత తక్కువ కాలంలో తిరిగి రాబట్టుకునే మార్గాలు అన్వేషిస్తుందన్నది ఈ అధ్యాయంలోని సారాంశం. నేడు మనం చూస్తున్న ద్రవ్య పెట్టుబడి, సేవా రంగాల్లో గుత్తా సంస్థలు ఆవిర్భావం, ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తిరంగం వాటా తగ్గి ఉత్పత్తేతర రంగాల వాటా పెరగటం వంటి పరిణామాలకు సంక్షిప్త వివరణలు ఈ అధ్యాయంలో ఉన్నాయంటే నోరెళ్లబెట్టడం నేటి నోబెల్ గ్రహీతల వంతవుతుందనటంలో సందేహం లేదు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఈ విమర్శకులు ఎన్ని సన్నాయి నొక్కులు నొక్కినా చివరకు ఏంగెల్స్ కూడా మార్క్స్ రచనా శైలిని స్వీకరించాడని అంగీకరించక తప్పలేదు. అందుకే సీగెల్ అనే అర్థశాస్త్రవేత్త 'ఏంగెల్స్ మార్క్స్‌ను వక్రీకరించాడని చెప్పలేము. ఎందుకంటే మార్క్స్ రచనల్లోనే అనేక సంశయాలు అపరిష్కృతంగా మిగిలిపోయాయి. ఇటువంటి సంశయాలకు సమాధానం చెప్పటానికి మార్క్స్ చిత్తుప్రతులు, నోట్సులు, లేఖలను ఆధారం చేసుకున్నాడు ఏంగెల్స్' అని నిర్ధారించాడు.

పెట్టుబడిదారీ వ్యవస్థ చక్రాలు సున్నితంగా కదలటానికి లాభం అన్నది కందెన నూనె వంటిది. కందెన లేని ఇరుసులదు గానీ, చక్రాలు కానీ మొరాయిస్తాయి. అదే విధంగా లాభాలు రాని రంగాల్లో లేదా తక్కువ లాభాలు వచ్చే రంగాల్లో పెట్టుబడులు ప్రవేశించటానికి నిరాకరిస్తూ ఉంటాయి. ఈ సందర్భంలోనే పెట్టుబడి గ్రంథంలోని మరో చర్చను ఏంగెల్స్ ఓ కొలిక్కి తీసుకొచ్చిన తీరును మనం పునశ్చరణ చేసుకోవాలి. లాభాల రేటు పతనానికి, పెట్టుబడిదారీ వ్యవస్థ పతనానికీ మధ్య ఉన్న సంబంధం గురించిన చర్చ అది. తగినన్ని లాభాలు వస్తాయన్న నమ్మకం, ఆశ లేనప్పుడు పెట్టుబడి వినియోగంలోకి రావటానికి తయారుకాదు. అటువంటి పరిస్థితుల్లో కొత్త పెట్టుబడులు, కొత్త కొత్త పెట్టుబడిదారులు తెరమీదకు రారు. రావు. అధికోత్పత్తి, గాలివాటు వ్యాపారాలు, సంక్షోభం, వినియోగంలోకి రాని మిగులు పెట్టుబడులు ఈ దశలో కనిపించే మౌలిక లక్షణాలు. ఈ పరిణామం మొత్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడనే ప్రశ్నార్థకం చేస్తుంది. ఇక్కడ పెట్టుబడి కదలిక రెండు రకాలుగా ప్రభావితమవుతుంది. కొత్త పెట్టుబడుల కొరత. సామర్థ్య వినియోగంలో ఎగుడుదిగుళ్ల రూపంలో (ఉదాహరణకు ప్లాంట్ లోడ్ ఫాక్టర్) వ్యక్తమవుతోంది. సమకాలీన భారతదేశ ఆర్థిక వ్యవస్థనే పరిశీలిస్తే గత నాలుగేళ్లల్లో ఈ లక్షణాలు పుష్కలంగా వ్యక్తమవుతున్నాయి. ఏ రంగంలో అధికోత్పత్తి కుప్పలు తెప్పలుగా పోగు పడుతోంది. పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందన్న నమ్మకం లేకపోవటంతో పెట్టుబడిదారుల వద్ద మిగులు పెట్టుబడి పోగు పడుతోంది. రిజర్వు బ్యాంకుతో సహా మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ మిగులు నిధుల సమస్యనెదురొంటోంది. రిజర్వు బ్యాంకు 2018 లో విడుదల చేసిన ఓ నివేదికలో వినియోగదారుల నమ్మకం 23 శాతానికి పడిపోయిందని అంచనా వేసింది. ఇవన్నీ పెట్టుబడి మూడో సంపుటాన్ని కళ్లముందు విశదీకరించే పరిణామాలు.

గ్రండ్రిస్ గ్రంథం వెలుగు చూసేనాటికి ఏంగెల్స్ కూడా మరణించాడు. ఏంగెల్స్ మీద దాడికి దిగుతున్న వారంతా ఆయన తెలిసే గ్రండ్రిజ్‌ను పక్కన పెట్టేశాడని ఆరోపిస్తున్నారు. లాభాల రేటు పతనం గురించి మార్క్స్ 1857–58లో ప్రస్తావించిన మాట వాస్తవమే. ఏంగెల్స్ తుదిరూపునిచ్చిన పెట్టుబడి గ్రంథంలోనూ అదే మార్క్స్ అవగాహన మరింత విపులంగా మనముందుంది.

ఇక్కడ వక్రీకరణ కంటే మించి మార్క్స్ రాసిన మాటల్లో యథాతథంగా లేదన్నదే విమర్శగా కనిపిస్తుంది. 1861–63 మధ్య మార్క్స్ రాసుకున్న మరో 23 చిత్తు ప్రతులను కూడా సంస్కరించాలన్న లక్ష్యాన్ని ఏంగెల్స్ తనకు తానుగా నిర్దేశించుకున్నా కాలం ఆయన్ను ఆపని పూర్తి చేయనివ్వలేదు.

అయితే ఈ నోట్సులను మదింపు చేసిన తర్వాతనే పెట్టుబడి మూడో సంపుటం ఏంగెల్స్ పూర్తి చేశాడన్నది నిస్సందేహం. దీనికి ఆధారంగా మూడో సంపుటానికి ఏంగెల్స్ రాసిన ముందు మాటను ప్రస్తావించుకోవచ్చు. మార్క్స్ రాసుకున్న 23 చిత్తు ప్రతుల్లో ఒకటి మూడో సంపుటంలోని లాభాల రేటు – మిగులు విలువ రేటు అన్న అధ్యాయానికి సంబంధించినది. ఎక్కువ భాగం ఇది గణిత సమాసాల రూపంలో ఉంది. దీని గురించి ముందు మాటలో ప్రస్తావిస్తూ ఏంగెల్స్ "మూడో సంపుటం కోసం తయారు చేసుకున్న చిత్తు ప్రతుల్లో అనేకం నోట్సులు అసంపూర్ణంగా మిగిలిపోయాయి. మరీ ముఖ్యంగా లాభాల రేటు మిగులు విలువ మధ్య సంబంధాన్ని వివరిస్తూ రాసుకున్న పూర్తి నోట్సు ఒకటి ఉంది. అయితే అది ప్రధానంగా గణిత సమాసాల రూపంలో ఉంది. ఈ నోటు నా కోసం సంస్కరించే బాధ్యతను మా మిత్రులు శామ్యూల్ మూర్ స్వీకరించాడు. గతంలో కేంబ్రిడ్జిలో గణితశాస్త్ర అధ్యాపకునిగా పనిచేసిన అనుభవం ఉన్నందున ఈ పని మూరు అప్పగించాను. మూర్ ఇచ్చిన వివరణ, మూల ప్రతిలోని ప్రధాన భాగంతో జోడించి మూడో అధ్యాయానికి తుదిరూపం ఇచ్చాను" అని స్పష్టంగా చెప్పాడు. (సంకలిత రచనలు, సంపుటి 37). అంతే కాదు. ఈ అధ్యాయానికి తుది రూపం ఇచ్చే క్రమంలో ఉపయోగించకుండా పక్కన పెట్టిన మార్క్స్ నోట్సుల గురించి అధ్యాయం చివర్లో ఇచ్చిన వివరణ సంపాదకుడిగా ఏంగెల్స్ నిబద్ధతకు, ప్రతిభాపాటవాలకు, పారదర్శకతకు నిలువెత్తు ఉదాహరణ.

"రాతప్రతుల్లో లాభాల రేటు, మిగులు విలువ మధ్య సంబంధాన్ని వివరించే గణాంకాలు ఉన్నాయి. అవి చాలా ప్రత్యేకమైనవి. ఆసక్తికరమైనవి. ఆ లెక్కలన్నీ గమనిస్తే లాభాల రేటు, మిగులు విలువ ఎప్పుడు అనులోమానుపాతంలో ఉంటాయో ఎప్పుడు విలోమానుపాతంలో ఉంటాయో తెలుసుకోవచ్చు. ఈ రెండు రేట్ల మధ్య ఉన్న సంబంధాన్ని గ్రాఫ్ చిత్రాల రూపంలో కూడా మార్క్స్ నమోదు చేసి ఉంచాడు. అయితే ఇక్కడ ఈ లెక్కలను, దాని ఆధారంగా గీసిన గ్రాఫీలను యథాతథంగా ముద్రించటం లేదు. ఆ అంశంపై ఆసక్తి కలిగిన ప్రత్యేక పాఠకులు తాము ఈ విషయం గురించి లోతైన పరిశోధన సాగించదల్చుకుంటే ఉపయోగపడుతుందన్న ఉద్దేశ్యంతోనే ఈ వివరణ ఇస్తున్నాము." అంటూ పాదసూచికలో వివరించాడు ఏంగెల్స్. ఈ రెండు ప్రస్తావనలూ పరిశీలిస్తే ఏంగెల్స్ మార్క్స్ రాతప్రతులను పక్కకు నెట్టేశాడని అనుకోవడానికి ఏ మాత్రం ఆస్కారం లేదు. పైగా ఎడిటర్‌గా తన విచక్షణ ఎక్కడ ఉపయోగించాడు, ఎందుకు ఉపయోగించాడో కూడా వివరంగా నమోదు చేసి ఉంచాడు. అంతే కాదు. డ్యూరింగ్ ఖండన గ్రంథానికి 1885లో రాసిన ముందుమాటలో గణితశాస్త్రం గురించి మార్క్స్ ప్రత్యేకంగా అధ్యయనం చేసాదనీ, ప్రకృతి శాస్త్రాల అధ్యయనంలో భాగంగా తాను గణితం గురించి వచ్చిన అంచనాలను, మార్క్స్ అవగాహనను కలిసి మరో సందర్భంలో ప్రచురించేందుకు ప్రయత్నం చేస్తామని కూడా ఈ ముందుమాటలో ప్రస్తావిస్తాడు. కాబట్టి మార్క్స్ రాసిన చిత్తు ప్రతులను ఏంగెల్స్ విస్మరించాడన్న విమర్శకు తావే లేదు.

చివరిగా 1895లో సోమ్బర్ట్ కు రాసిన లేఖలో "పెట్టుబడి మూడో సంపుటాన్ని మరింత ఆకర్షణీయంగా తయారు చేయగలనన్న నమ్మకం మీకు నాపై ఉన్నందుకు ధన్యవాదాలు. కానీ నాకు అటువంటి అభిప్రాయం లేదు. మార్క్సును మార్క్స్ మాటల్లో చెప్పటానికే నేను కట్టుబడి ఉన్నాను." (సంకలిత రచనలు, సంపుటి 50) అని స్పష్టంగా వక్కాణించాడు. " మూడో సంపుటాన్ని సంస్కరించే ప్రయత్నంలో (ఎడిట్ చేయటంలో) సాధ్యమైనంత వరకు సాధికార రచనను పాఠకులు ముందుంచటానికీ, సాధ్యమైనంత వరకు మార్క్స్ మాటల్లోనే చెప్పటానికి ప్రయత్నం చేశాను. అనివార్యం అయినప్పుడు మాత్రమే నా మాటలు ప్రస్తావించాను. అటువంటప్పుడు కూడా పాఠకులు నా మాట చదువుతున్నాడా మార్క్స్ మాట చదువుతున్నాడా అన్న గందరగోళానికి గురికానీయకుండా జాగ్రత్తలు తీసుకున్నాను." అని 1895 మే– జూన్‌లో రాసుకున్న అనుబంధంలో ఏంగెల్స్ వివరించాడు.

మార్క్స్ రచనలకు తోడ్పాటునందించటంతో పాటు ప్రతి అంశంపైనా నాకంటూ ఓ ప్రత్యేకమైన అధ్యయనం, అవగాహన ఉన్నాయనటంలే సందేహం లేదు. అయితే చరిత్ర, రాజకీయ అర్థశాస్త్రాలకు సంబంధించినంత వరకు మౌలిక ఆవిష్కరణలు మార్క్స్ స్వంతమే. నేనందించిన తోడ్పాటును మార్క్స్ కూడా స్వతంత్రంగా సాధించగలిగి ఉండేవాడు అన్న ఏంగెల్స్ నమ్రత విప్లవోద్యమంలో పని చేసే సంపాదకులందరూ నేర్చుకుని ఆచరించదగ్గ లక్షణం. ❑

*"వీక్షణం" మాసపత్రిక సౌజన్యంతో..*



# గ్రాంసీ ఆలోచనలు - ఆవశ్యకత

**బండారు రమేష్**

"ఇతని మెదడు అత్యంత ప్రమాదకరమైనది. ఇతని ఆలోచనలు అత్యంత విప్లవకరమైనవి. ఈ మెదడు 20 ఏండ్ల పాటు ఆలోచించకుండా, ఇతనిని జైలులో నిర్బంధించండి" ఇది ఒక దేశ అత్యున్నత న్యాయస్థానం ఒక వ్యక్తికి శిక్ష విధిస్తూ చేసిన ప్రకటన సారాంశం. ఆ ప్రమాదకర మెదడు, ఆ విప్లవకర ఆలోచనలు ఆంటోనియో గ్రాంసీవి. భారతదేశంలో ఫాసిస్టు శక్తులు బలంగా ముందుకు వస్తున్న ప్రస్తుత తరుణంలో, ఫాసిజానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన గ్రాంసీని, ఆయన సైద్ధాంతిక కృషిని తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..

గ్రాంసీ దక్షిణ ఇటలీలోని సార్డీనియాలో 1891, జనవరి 22న జన్మించాడు. సార్డీనియా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతం. గ్రాంసీ ఆ ప్రాంతంలోని రైతాంగం, వత్తిదారులు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూశాడు. 1911లో ఉన్నత విద్య కోసం ఉత్తర ఇటలీలోని టురిన్ నగర విశ్వవిద్యాలయంలో చేరాడు. ఉత్తర ఇటలీ అప్పడే అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక ప్రాంతం. ఇక్కడే ఆయన వ్యవసాయాధారిత దక్షిణ ఇటలీ ప్రజలను, పెట్టుబడిదారీ ఆధారిత ఉత్తర ఇటలీ ప్రజలు తక్కువగా చూడటాన్ని గమనించాడు. ఈ తప్పుడు స్పృహను పాలకవర్గాలు సృష్టించాయని గ్రహించాడు. పాలకవర్గాలు తమ భావాలను ప్రజల భావాలుగా ఎలా మారుస్తాయో తెలుసుకున్నాడు. మార్క్స్ ఎంగిల్స్‌లను అధ్యయనం చేయడం మొదలు పెట్టాడు. సోషలిస్టు పార్టీలో చేరి క్రియాశీలకంగా పని చేశాడు. 1917లో విజయవంతమైన రష్యా విప్లవం గ్రాంసీకి ఉత్సాహానిచ్చింది. మార్క్సిజం జడ పదార్థం కాదనే సత్యాన్ని రష్యా నిరూపించిందని, అందుకు లెనిన్ కారకుడని విశ్లేషించాడు. ఆయా దేశాల భౌతిక పరిస్థితులకు అనుగుణంగా విప్లవ వ్యూహాన్ని ఎంచుకోవడమే అసలైన మార్క్సిస్టు అవగాహన అని తెలిపాడు. 1920-22లో మాస్కోలో జరిగిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సమావేశాలకు గ్రాంసీ హాజరయ్యాడు. లెనిన్‌తో చర్చలు జరిపాడు. ఈ చర్చల నేపథ్యంలో గ్రాంసీ, తదితరులు సంస్కరణవాద సోషలిస్టు పార్టీ నుంచి బయటికి వచ్చారు. ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారు. తర్వాత గ్రాంసీ పార్లమెంటు సభ్యుడిగా, కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు.



ఇదే సమయంలో ఒకప్పుడు సోషలిస్టుగా ఉన్న ముస్సోలినీ "విప్లవ జాతీయవాదం" పేరుతో ఒక కొత్త సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చాడు. "ఇటలీ జిందాబాద్" నినాదంతో "ఫాసియో డి కంబాటిమెంట్" అనే పార్టీని స్థాపించాడు. ఈ పార్టీ పేరులోని పదం ఆధారంగానే ఫాసిజం అనే పేరు వాడుకలోకి వచ్చింది. 1922లో ముస్సోలినీ ఫాసిస్ట్ పార్టీ అధికారంలోకి వచ్చింది. సోషలిస్టులు, కమ్యూనిస్టులపైన తీవ్ర నిర్బంధం విధించింది. ప్రభుత్వాన్ని కూలదోసే కుట్ర చేశాడని గ్రాంసీని 1926లో ప్రభుత్వం అరెస్టు చేసింది. 20 ఏండ్లు జైలు శిక్ష విధించింది. 11 ఏండ్ల జైలు శిక్ష అనంతరం గ్రాంసీ, 1937లో మరణించాడు. 11 ఏండ్ల జైలు జీవిత కాలంలో మనో నిర్బరాన్ని కోల్పోకుండా అనేక సైద్ధాంతిక అంశాలపైన రచనలు చేశాడు. 30కి పైగా నోట్ పుస్తకాలలో, 3 వేల పేజీలకు పైగా సైద్ధాంతిక రచనలు చేశాడు. ఆ రచనలు ప్రిజన్ నోట్ బుక్స్ (జైలు రాతలు) పేరు మీద, ఆయన మరణానంతరం 6 సంపుటాలుగా ముద్రించబడ్డాయి. గ్రాంసీ ప్రధానంగా విప్లవాన్ని సాధించే క్రమంలో వచ్చే ఆటంకాల గురించి చర్చించాడు. కార్మికవర్గం కేవలం తమ పని ప్రదేశాలలో జరిగే దోపిడీపైన పోరాటం చేస్తే సరిపోదన్నాడు. ఇది ఆర్థిక పోరాటపు మొదటి దశ అన్నాడు. రెండవ దశలో కార్మికవర్గం సమాజంలో విభిన్న శ్రమలు చేసే శ్రామికులందరినీ కలుపుకుపోతూ మనమంతా ఒకేవర్గం అన్న భావనకు తీసుకు రావాలన్నాడు. భావజాల రంగంలో ఇందుకు అవసరమైన నైపుణ్యంతో కూడిన వర్గపోరాటాన్ని నిర్వహించాలన్నాడు. అప్పుడు మాత్రమే వర్గ పోరాటం ఆర్థిక దశ నుంచి రాజకీయ దశకు చేరుతుందన్నాడు. ఈ కార్యక్రమానికి ఆటంకంగా మారే రాజ్యం, పౌర సమాజం యొక్క పాత్రను, వాటి లక్షణాలను వివరించాడు.

రాజ్యం అంటే ప్రభుత్వం, పోలీసు, మిలటరీ, చట్టాలు, న్యాయస్థానాలు, జైలు.. మొదలైనవి. పౌర సమాజ వ్యవస్థలు

అంటే కుటుంబం, కులం, మతం, బడి, గుడి, పండుగలు, కళలు, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, తదితర సాంస్కృతిక భావజాల ఉత్పత్తి సాధనాలు. ఈ రెండూ వర్గ దోపిడీని సమర్థించే సాధనాలే అని గ్రాంసీ విశ్లేషిస్తాడు. రాజ్యం కేవలం పాలకవర్గపు కోట చుట్టూ ఉండే కందకం అంటాడు. కందకం లోపల శక్తివంతమైన కట్టడాలు ఉంటాయని, అవే పౌర సమాజ వ్యవస్థలంటాడు. పాలకవర్గం రాజ్య వ్యవస్థలను ఉపయోగించి బలవంతంగా తన ఆధిపత్యాన్ని (హెజిమొనీ) నిలుపుకునే ప్రయత్నం చేస్తుంది. అదే సమయంలో పౌర సమాజ వ్యవస్థలను ఉపయోగించి బలవంతం అవసరం లేకుండానే (ప్రజల మద్దతుతో) ఆధిపత్యాన్ని నిలిపి ఉంచుకుంటుందని చెపుతాడు. అందుకే కార్మికవర్గం సమాజాన్ని విముక్తి చేసే క్రమంలో రాజ్యం పైన, పౌర సమాజ వ్యవస్థల పైన దృష్టి పెట్టి వర్గ పోరాటం చేయాలంటాడు.

ఈ సందర్భంలోనే గ్రాంసీ మార్క్స్ ఎంగెల్స్ చెప్పిన పునాది ఉపరితల విశ్లేషణను మరింత లోతుగా వివరించాడు. పునాది, ఉపరితలాల మధ్య ఉండే "గతితార్కిక ఐక్యత"ను విశ్లేషించాడు. ఈ రెండూ కలిసి ఉండే చారిత్రిక స్థితిని "హిస్టారికల్ బ్లాక్" అన్నాడు. సమాజంలో మార్పులు రావాలంటే హిస్టారికల్ బ్లాక్‌లో (పునాది - ఉపరితలాలలో) మార్పులు రావాలంటాడు. ఇది పాలకవర్గ ఆధిపత్యానికి (హెజిమొనీ) వ్యతిరేకంగా కార్మికవర్గం ప్రత్యాధిత్యాన్ని (కౌంటర్ హెజిమొనీ) సాధించినప్పుడు సాధ్యమవుతుందని చెపుతాడు. సమాజ మార్పుకు కార్మికవర్గ ఆధిపత్య భావజాలం కీలకమని భావించినప్పుడు, అది ఎలా సాధించగలమో గ్రాంసీ తెలిపాడు. కార్మికవర్గ ఆధిపత్యాన్ని నెలకొల్పే సందర్భంలో మేథావుల పాత్ర కీలకమని అభిప్రాయ పడతాడు. మేథావులను సాంప్రదాయ మేథావులు, ఒకే వర్గ/సజాతి మేథావులుగా విడగొట్టాడు. సాంప్రదాయ మేథావులు దోపిడీకి మద్దతుదారులుగా ఉంటారన్నాడు. మరోవైపు సజీవ/ఒకే వర్గ మేథావులు (వీరినే ఆర్గానిక్ ఇంటెలెక్చువల్స్ అంటాం) భౌతిక వాస్తవికతకు, ఉత్పత్తి క్రమానికి దగ్గరగా ఉంటారని గ్రాంసీ తెలిపాడు. వీరే కార్మికవర్గానికి అవసరమన్నాడు. ఇలాంటి శ్రామిక వర్గపు ఆర్గానిక్ ఇంటెలెక్చువల్స్ నిరంతరం క్రియాశీలకంగా ఉంటూ శ్రామికవర్గాన్ని ప్రేరేపించేవారుగా, పోగేసేవారిగా, వర్గ పోరాట నిర్మాతలుగా ఉంటారని ఆశిస్తాడు. అయితే పెట్టుబడిదారీ వర్గం కూడా తమ వర్గపు మేథావులను సృష్టించుకుంటుందని, అందుకు నిత్యం కృషి చేస్తుందని అంటాడు గ్రాంసీ. పెట్టుబడిదారీ వర్గం తన దగ్గర పోగైన సంపదతో సులువుగా మేథావులను తయారు చేసుకోగలుగుతుందని చెపుతాడు. మరి కార్మికవర్గం తన శ్రామికవర్గపు ఆర్గానిక్ ఇంటెలెక్చువల్స్‌ను ఎలా తయారు చేసుకోగలుగుతుంది? దీనికి గ్రాంసీ సమాధానం చెప్పాడు. ఆర్గానిక్ ఇంటెలెక్చువల్స్‌ను సృష్టించే బాధ్యతను కమ్యూనిస్టు పార్టీ తీసుకోవాలని సూచిస్తాడు. లెనిన్ చెప్పినట్టు కమ్యూనిస్టు పార్టీ "కార్మికవర్గపు అగ్రగామి దళంగా" ఉంటూ, అదే సందర్భంలో తానే స్వయంగా "సమిష్టి మేధావి" (కలెక్టివ్ ఇంటెలెక్చువల్)గా ఉండాలంటాడు. కమ్యూనిస్టు పార్టీనే స్వయంగా ఒక శ్రామికవర్గపు సమిష్టి మేధావిగా మారాలంటాడు. పార్టీ శ్రామికవర్గ ప్రజల లోకజ్ఞానాన్ని విచక్షణా జ్ఞానంగా మారుస్తూ, ఆర్గానిక్ ఇంటెలెక్చువల్స్‌గా వారిని అభివృద్ధి పరచాలని కోరతాడు. అప్పుడు మాత్రమే కార్మికవర్గ ఆధిపత్యాన్ని సాధించడానికి అవసరమైన ప్రాతిపదిక ఏర్పడుతుందని గ్రాంసీ విశ్లేషించాడు. విప్లవ కార్యాచరణ వేగవంతం అవుతుందని అంటాడు.

భారతదేశంలో ఫాసిస్టు శక్తులు బలపడుతున్న ప్రస్తుత దశలో, విప్లవ శ్రేణులు గ్రాంసీని అధ్యయనం చేయడం ఎంతో అవసరం. ఎందుకంటే విప్లవ కార్యాచరణకు ఫాసిజం ఎంతటి ఆటంకమో గ్రాంసీ గ్రహించాడు. ఫాసిజం పుట్టుక, పరిణామాన్ని కండ్లారా చూశాడు. ఇటలీ పౌర సమాజంలోని అభివృద్ధి నిరోధక భావజాలాన్ని ఫాసిజం ఎలా తనకు అనుకూలంగా మార్చుకుందో గమనించాడు. సాంప్రదాయ మేథావులు పౌర సమాజ వ్యవస్థల ద్వారా శ్రామికవర్గ ప్రజల బుర్రల్లోకి ఫాసిస్టు భావజాలాన్ని ఎంత వేగంగా చేర్చారో కొలతలేశాడు. రాజకీయ సందర్భం కలిసి వచ్చినప్పుడు ఫాసిజం ఎలా రాజకీయ అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకుంటుందో పరిశీలించాడు. గ్రాంసీ తానే ఒక సాక్ష్యంగా నిలబడి, ఫాసిజం ప్రజాస్వామ్యాన్ని ఎలా ఖూనీ చేస్తుందో, కమ్యూనిస్టులను ఎలా ఊచకోత కోస్తుందో వివరించాడు. అందుకే ఆయన తన జైలు రాతల్లో 250పేజీలకు పైగా ఫాసిజం గురించే రాశాడు. దాని ప్రమాదాన్ని గుర్తించమని ప్రపంచ శ్రామికవర్గాన్ని కోరాడు. కమ్యూనిస్టు పార్టీలను హెచ్చరించాడు. అందుకే మనం ఇప్పుడు గ్రాంసీని మరింత అధ్యయనం చేయాలి. బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుకూల సాంప్రదాయ మేథావులు సృష్టిస్తున్న ఫాసిస్టు భావజాలాన్ని ఎదుర్కోవాలి. దీని ప్రమాదాన్ని శ్రామికవర్గ ప్రజలకు వివరించాలి. ఇందుకు అవసరమయ్యే ఆర్గానిక్ ఇంటెలెక్చువల్స్‌ను తయారు చేసుకోవాలి. వారిని అభివృద్ధి పరచాలి. ఈ మొత్తం కార్యాచరణకు అవసరమైన ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక వర్గ పోరాటలకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. దీనికి గ్రాంసీ సైద్ధాంతిక ఆలోచనలు మనకు ఉపయోగ పడతాయి. మన విప్లవ కార్యాచరణకు సహకరిస్తాయి. ❑


*నవ తెలంగాణా సౌజన్యంతో..*

# ఎలియనేషన్

రచన : **రావు కృష్ణారావు** పరామర్శ : **వి.విజయకుమార్**

మనం మనం కాకుండా పోవడమే పరాయీకరణ. తన నుండి తాను వేరుపడటం, తనకు తానే పరాయివాడు కావడం, జీవితానికి అర్థంలేకపోవడం, తనకంటూ ఏమీ లేకపోవడం, సెల్ఫ్ ఫుల్‌ఫిల్‌మెంట్‌కి నోచుకోని, తనకి ఇష్టంలేని, తన అభిరుచికి భిన్నమైన జీవితాన్ని, ఉస్సూరంటూ బలవంతంగా ఈడ్చుకుంటూ వెళ్లడం, తను తానుగా మారే, ప్రవర్తించే, వాస్తవీకరించుకునే అవకాశాలు లేకపోవడమే పరాయీకరణ.

మనిషి జీవితం నుండి, సమాజం నుండి పరాయిగా వుంటూ అసహజంగా బతకడాన్ని నేర్పి, ఆ అబద్ధపు పునాది మీద ఆకాశపు హార్మ్యాలు కట్టుకొని పెట్టుబడిదారీ వ్యవస్థ నిలబడింది. ఏ వ్యవస్థని కూలదోయడం కోసం అహర్నిశలు కృషి చేయాలో వారి కళ్లకే గంతలు కట్టి విజయవంతంగా మనగలుతోంది. ఈ నేపథ్యంలో పరాయీకరణ గురించి మార్క్స్ 1844లోనే తన పారిస్ రాతప్రతుల్లో పేర్కొన్న ప్రతిపాదనల్ని రావు కృష్ణారావు గారు అత్యంత సరళీకరించి తెలుగు పాఠకులకు అందించే ప్రయత్నం చేశారీ పుస్తకంలో. ప్రతి గీతా ఒక వాస్తవికతను అద్దుకుంది, ప్రతి భావనా ఒక మధురత్వాన్ని ఆస్వాదించేలా చేస్తుంది. ఎన్నో తెలియని విషయాలు అవ్రతిభుల్ని చేస్తూపోతాయ్! సైద్ధాంతిక విషయాలు ఇంత రసానుభూతిని కలిగిస్తాయా? నిజమిది! మనిషి స్వభావాన్ని ఇంత లోతుల్లోకి విశ్లేషించిన మార్క్స్ భావనలు మీరు చదివేటప్పుడు మీ హృదయం రాగరంజితం అవుతుంది! ఎంత బావుందీ పుస్తకం అనిపిస్తుంది. ఈ పరాయీకరణలోని మార్క్స్, విచిత్రంగా మీ హృదయానికి మరింత చేరువ అవుతాడు! అలా చేశారు రావు కృష్ణారావుగారు!




చరిత్రలోకి తొంగి చూస్తే, ఆదిమ క్రైస్తవం దేవుని ఆజ్ఞ ఉల్లంఘనలో పరాయీకరణని చూస్తే, ఉపనిషత్తులు 'నేను' నుంచి బయటకు వెళ్లడాన్ని గురించి చెప్పి, "సన్యాసం" ద్వారా పరాయీకరణని పకడ్బందీగా వాక్రుచ్చాయి. సూఫీ, క్రైస్తవ, ఇస్లాం తాత్వికతలన్నీ ఇంచుమించు వద్దన్న ఫలం తిని దేవుడికి పరాయి అయిపోయిన మనిషి గురించి మథనపడ్డాయి. బౌద్ధం కొంచెం భిన్నంగా అనుభూతుల నుండి 'అనాసక్తత' అని చెప్పింది. 'అస్తిత్వ వాదం' ఏకంగా పరాయి స్థితి నుంచి మనిషి అసలు బయటపడే అవకాశమే లేదంది.

హెగెల్, చైతన్యం ప్రాథమికమనీ, ప్రకృతి ద్వితీయం అనడంలో ఉద్దేశం అది చైతన్యం నుండి పరాయిగానే వుంటుంది అని చెప్పడమే! 'మనిషి తనను తాను ఒక ప్రక్రియగా ఉత్పత్తి చేసుకుంటాడన్న' హెగెల్ భావనని సమర్థించిన మార్క్స్, సరకుల్ని సృష్టించే నిజమైన మనిషి యొక్క పరాయీకరణ చూడనందుకు హెగెల్‌ను విమర్శించాడు.

ఫ్యూయర్ బాక్ పరాయీకరణకు కారణం మతం అంటాడు. మనిషికి మనిషే దేవుడనీ, గొప్ప మానవ శక్తుల్ని దేవుడికి ఆపాదించుకోవడమే పరాయీకరణ అంటాడు. దేవుడి స్వభావమూ, గుణమూ మానవ స్వభావం, గుణమే అంటాడు. దేవుడి జన్మస్థలం మానవ దైన్యమే అంటాడు, ఆ రకంగా తాను పరాయిగా మారి తన సామర్థ్యాలను లేని దేవుడికి ఒప్పజెప్పి ఆయన్ని భజిస్తూ, తోటి వారిని ప్రేమించలేని అశక్తతలో పడిపోవ డానికి కారణం మతమే అని చెప్పినా సామాజిక, రాజకీయ అంశాలను వదిలేయడంతో ఫ్యూయర్ బాక్ మార్క్స్‌ని సంతృప్తి పరచలేకపోయాడు.

స్వార్థం, దురాశ, కామం, అధికార లాలస, గుర్తింపు వాంఛ వెరశి మానవుడు! దీన్ని నిరాపేక్షంగా అంగీకరించి, జై కొట్టకుండా ఉండడానికి ఈ భూ ప్రపంచంలో ఒక్కడు కూడా వెనుకాడడు! కానీ మార్క్స్ ఉన్నాడు! ఈ ప్రపంచ భావజాలాన్ని ప్రశ్నించడం నేర్పిన మార్క్స్ ఇలా అంటాడు. మానవుడు ఒక నిర్దిష్ట సామాజిక, చారిత్రక అస్తిత్వం. అంటే సర్వకాల సర్వావస్థల్లో స్థిరంగా ఉండడు మానవుడు. పరిస్థితులను బట్టి మారే గుణం మానవ స్వభావంలో భాగంగా వుంటుంది అంటాడు. ప్రకృతిలో భాగమే అయినా, ఒక పదార్థమే అయినా చైతన్యం మానవుడి ప్రత్యేకత. చైతన్య యుత జీవన కార్యకలాపాలే మానవుణ్ణి వేరు చేస్తాయి. మనిషి

లక్ష్యాత్మకంగా, జీవితావసరాల కోసం, భౌతిక నియమాలకు లోబడి పనిచేసేటప్పుడు జంతువు నుంచి వేరౌతాడు. బుద్ధి, చైతన్యం, ఇచ్ఛ, భావోద్వేగాలు అతన్ని గుణాత్మకంగా వుంచుతాయి. మనిషి మరో మనిషి అవసరాన్ని తీర్చే వస్తువును ఉత్పత్తి చేయడం మనిషికే సొంతం అంటాడు మార్క్స్. చైతన్యం సమిష్టి శ్రమ ఫలితం అనీ, సామాజిక ఉత్పాదితంగా మానవుడు వున్నంత కాలం వుంటుందనీ, మనిషి ప్రకృతి అస్తిత్వంతో పాటూ జాతి అస్తిత్వం కలిగివుండటం వల్లే జంతువు నుంచి వేరయ్యాడని అంటాడు మార్క్స్.

మానవుడికి మూలం మానవుడే అనడం వెనుక అంతరార్థం, తన శ్రమ ద్వారానే తానుగా అవతరించాడని చెప్పడమే! భౌతిక పరిస్థితులకు లోబడి పనిచేస్తూ, శ్రమ ద్వారా వాటిని మార్చగలడు. ప్రకృతి ప్రాణిగా వున్నా, ప్రకృతిని మార్చుకోగలుగుతాడు. కాబట్టి మానవుడు ప్రకృతి నుంచి పరాయి కావడం అసంభవం. కానీ తను చేసే శ్రమ సంబంధాల ద్వారానే పరాయీకరణ జరుగుతోంది అంటాడు మార్క్స్. అంటే శ్రమ ద్వారా వస్తువు తయారు చేసిన వాడు స్వేచ్ఛగా, ఇచ్ఛా పూర్వకంగా చేసినప్పుడు పొందే అనుభూతి పొందలేకపోవడానికి కారణం పరాయీకరణే. స్వేచ్ఛగా, కలిసిమెలిసి ఉత్పత్తి చర్యల్లో పాల్గొనే మనిషి, స్వభావరీత్యా, సామాజిక అస్తిత్వంగా మాత్రమే వుండగలడు అంటాడు మార్క్స్.

మార్క్స్ దృష్టిలో మనిషి వ్యక్తిగత కార్యకలాపాలకూ, శ్రమకూ పరాయివాడు కావడం అంటే తను శ్రమించి చేసిన వస్తువు అన్యాక్రాంతం కావడమేననీ, తన సొంత కార్యకలాపం నుండీ, తన ఉత్పత్తి నుండీ, జాతి స్వభావం నుండీ, ఇతర మనుషుల నుండీ వేరుపడటమేననీ అదే పరాయీకరణ అంటాడు. మరీ ముఖ్యంగా ఆర్థిక పరాయీకరణ గురించి చెబుతూ, మొదటి దశలో ప్రజల్ని ఉత్పత్తి సాధనాల నుండీ, జీవనోపాధి సాధనాల నుండీ వేరుచేయడం, ఆ తర్వాత దశలో, శ్రమను అమ్ముకునే వారిగా తయారు చేయడం, చివరికి వస్తువు కొనుక్కున్న వాడికి స్వంతం కావడమే ఆర్థిక పరాయీకరణగా చెబుతాడు.

రోటీ, కపడా ఔర్ మకాన్ లాంటి బేసిక్ అవసరాల గురించి శాస్త్రీయంగా ముందు ఆలోచించినవాడు మార్క్స్! శ్రమ చేసి వీటిని పొందడం ద్వారా, ప్రకృతి నుంచి వేరు కాగలుగుతాం. ముందు తక్షణ అవసరాలతో మొదలై కొత్త అవసరాల ఉత్పత్తి దిశగా సాగుతాం. మొదట్లో తన కోసమే శ్రమ చేసినవాడు క్రమంగా తన ఇచ్ఛకు వ్యతిరేకంగా స్వేచ్ఛాయుత జీవకార్య కలాపంగా కాకుండా మోడరన్ టైమ్స్ సినిమాలో స్పానర్ తిప్పే చాప్లిన్‌ని తలపిస్తాడు పరాయీకరణ చెందిన మనిషి! శ్రమ అప్పుడు జీవిత వ్యక్తీకరణ కాదు జీవిత పరాయీకరణ! ఆకలైతే మునపటిలా నేలవైపూ, నీరు వైపు చూళ్ళేడు! అవి ప్రైవేటు ఆస్థి! లేదా ప్రభుత్వ ఆస్థి! యింక తను అవతలి వాడి ఇచ్ఛానుసారం పనిచేసేవాడు! ఎంత చేయాలో వాడే చెప్పాలి, అసలు చేయాలా వద్దా వాడే నిర్ణయించాలి. అదే పరాయీకరణ. పనిచేయనప్పుడు తను, పని చేసేటప్పుడు పరాయి! విసుగు, కోపం, మూర్ఖత్వం, భ్రాంతి, అజ్ఞానం, బుద్ధిమాంద్యం, తనను తాను కోల్పోయిన మనిషిలో కనబడేవి అంటాడు మార్క్స్.

శ్రమ నుంచి పరాయి అయినవాడు అంతటితో ఆగడు! శ్రమ ఉత్పాదితం నుండి కూడా పరాయి అయపోతాడు. తనచేత తయారైన వస్తువు తనకే పరాయిదై, తనకే ఎదురు తిరుగుతుంది అంటాడు మార్క్స్. ఎనిమిది గంటల సజీవ కార్యకలాపం ఇతరులకు స్వాధీనం చేసేసి ఎనిమిది గంటల జీవితాన్ని కుదించు కుంటాడు! అది ఇంకా ఎక్కువ గంటలైతే అన్ని ఎక్కువ గంటలూ మనిషి కాకుండా పోవడమే శ్రమ పరాయీకరణ!

శ్రమ ఉత్పాదితం నుండి కూడా వేరు చేయపడ్డాక జాతి స్వభావాన్ని పోగొట్టుకోవడానికి కావల్సిన అన్ని అవకాశాలూ మెండుగా కల్పిస్తుంది పెట్టుబడిదారీ విధానం. మనిషి తనకోసం, కుటుంబం కోసం, తక్షణ మరియు భవిష్యత్తు కోసం, భౌతిక, మానసిక అవసరాలకోసం జంతుజాలాలకు భిన్నంగా శ్రమ చేస్తాడు. ఈ ఉత్పాదక జీవితమే అతని జాతి జీవితం. కాగా పెట్టుబడిదారీ వ్యవస్థ లో ఈ జాతి జీవితం కాస్తా, వ్యక్తి తాలూకూ భుక్తి సాధకం అయిపోయి బతుక్కోసమే శ్రమ చేయడంతో తన జాతి స్వభావాన్ని కూడా కోల్పోతాడు అంటాడు మార్క్స్.

జాతి స్వభావాన్ని పోగొట్టుకున్నప్పుడే మనిషి నేను నుండి వైదొలిగినట్టే! ఒక వికృత పోటీలో సాధనమై, పరాయి శక్తి చేతిలో ఆటవస్తువుగా మారతాడు. ప్రకృతితో మనిషి ఎటువంటి సంబంధాన్ని నెరపకుండా పెట్టుబడిదారీ వ్యవస్థ కంచె వేసింది. ప్రకృతితో పనిచేయడానికి తన అనుమతి లేకుండా మనిషికి అసాధ్యం చేసింది. అంతేకాదు వాళ్ళతో తనకు నచ్చేరీతిలో శ్రమ చేయించుకొని సొంత ఆస్థి కుప్పల్ని పేర్చుకొంది. మళ్ళీ వాటినే మారకం ద్వారా వాళ్ళకే అమ్మడం మొదలు పెట్టింది. తాను శ్రమించి సృజించిన వస్తు ప్రపంచం కేవలం తనది కాకుండా పోవడమే కాదు అదే శత్రువై తన మెడపై కత్తి కూడా అవుతుంది అంటాడు మార్క్స్. ఈ కత్తి వస్తుగతానికే కాదు సామాజిక సంబంధాలకు కూడా అపాదించబడుతుంది! వస్తువుకు దూరమైన వాడు తన తోటివాడికి కూడా దూరం కావడమే మనిషి పరాయీకరణ.

శ్రమ నుంచి పరాయి అయినవాడు ప్రకృతి నుంచీ దూరం అయ్యాడు. భూమీ, సముద్రాలూ, అడవులూ నదులూ, చెట్టూ

పుట్టా, ఆఖరికి అడివిలో బతికే జంతుజాలాలు కూడా వాడివే! ఈతాకు తెచ్చి బుట్ట అల్లాలన్నా, తేనె పట్టు కొట్టాలన్నా వాడి అనుమతి కావాలి. శ్రమ పరాయీకరణ వల్లే సొంత ఆస్థి పోగయ్యేది. ఈ పరాయీకృతమైన శ్రమ, పోగుబడ్డ పెట్టుబడి, అదే మళ్లీ, పోగుచేసి ఇచ్చిన వారి జీవశక్తిని పీల్చి మరింత పెరుగుతూపోతుంది. వారి జీవితాలను శాసించే స్థాయికి ఎదుగుతుంది అంటాడు మార్క్స్.

శ్రమ విభజనలో పరాయీకరణ అంటే శ్రామికుడు ఏ వస్తువులోనూ తన శ్రమని గుర్తించలేని తనం. గుండీలు ఒకరు, కాలర్ ఒకరూ, పట్టీ ఒకరూ, కత్తిరించడం ఇంకొకరు, చేతులు కుట్టేది ఇంకొకరు. చొక్కా తయారైన అనుభూతిని ఎవరికీ మిగలనీయకుండా చేయడమే శ్రమ విభజనలోని పరాయీకరణ. ఇది శ్రమ సహజ లక్షణాన్ని ధ్వంసం చేస్తుంది. బలవంతంగా రుద్దిన, తప్పించుకోలేని, పదే పదే అదే పరిమిత కార్యాన్ని చేస్తూ తన శక్తుల్ని క్షీణింప చేసుకుంటాడు. అది సమూహం నుంచి ఒంటరిని చేస్తుంది. శారీరక, మానసిక శ్రామికులుగా చీల్చి వేస్తుంది. ఆఖరికి సిద్ధాంతం, ఆచరణా వేరువేరుగా వుండటం పరాయీకరించే శ్రమవిభజన వల్లే అంటాడు మార్క్స్.

మానవాళి పరాయీకృత సామర్థ్యం డబ్బు అంటాడు మార్క్స్. ఇది మానవుణ్ణి అమానవీయం చేస్తుందంటాడు. అది అందరినీ వేరు చేస్తూ, బందీలుగా కూడా ఉంచుతుంది. సరుకు ధర పరాయీకృతమైన డబ్బులో వ్యక్తం అవుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో విలువ సారాంశంగా వున్న డబ్బు దేన్నైనా కొంటుంది. పరాయిదై పోయిన విలువ రూపంలో ఉన్న డబ్బుకు మారకం అయ్యేది కూడా పరాయిదైన విలువే!

మార్క్స్ అభిప్రాయంలో మతం తొలి అతి ప్రాచీన భావజాల పరాయీకరణ రూపం. మనిషి తనలోని దైవత్వాన్ని మధ్యవర్తి దేవుడికి ఆపాదించుకున్నాడు. ఆ విధేయత శాశ్వితం! పరాయి వాడై బతికే మనిషి జీవితంలో ఒక అవసరాన్ని తీర్చినంత కాలం మతం ఉనికిలో వుండి, ప్రకృతితో, తోటివారితో, సహేతుకమైన బంధాలు నెలకొల్పుకున్నప్పుడు మతం అంతర్ధానం అవుతుంది అంటాడు మార్క్స్.

ప్రజల మనోభావాలను గౌరవించే నెపం మీద మతంతో రాజీపడటం అంటే యుద్ధానికి ముందే ఓటమిని అంగీకరించడం అని తెలుసుకోవాలి! మానవ అశక్తత పరాయీకరణల వ్యక్తీకరణ అయిన మతం మనిషికి మనిషే పునాదిగా నిజమైన మనిషి జన్మించినప్పుడే సహజ మరణం పొందుతుందంటాడు మార్క్స్.

మనిషి దేవుడినీ, మతాన్నీ, డబ్బునీ తానే సృష్టించి వాటికి తనకు తానే బానిసగా మార్చుకున్నట్టే తను సృష్టించిన సరుకులకు కూడా సాగిలపడతాడు. అవి తానే సృష్టించిన విషయం మర్చిపోయి అవి తన జీవితాన్ని శాసించేదాకా తెచ్చుకోవడమే పరాయీకరణ. పెట్టుబడిదారు శ్రమశక్తిని కొని, తన వశం చేసుకున్నాక, యింక దాంతో సరుకు ప్రపంచాన్ని సృజించి, ఒక కల్తీ బాబాలా జనాన్ని వెంటతిప్పుకోగలడు. వాడిచ్చే బూడిద కోసం వెంపర్లాడే భక్తుల స్థాయికి మనిషిని దిగజార్చి, దేవుణ్ణి మోక్షం కంటే ముందు ఐపాడ్, ఓ ఎల్ డీ టీవీ ఇంట్లో ఉండేలా కోరుకునే స్థాయికి దిగజార్చగలడు!

హెగెల్ పరాయీకరణని ఒక సంతృప్తికర స్థితిగా, గతితార్కికంగా అర్థం చేసుకుని అది పెట్టుబడిదారీ సమాజంలో అంతం అయిపోతుందని చెబితే, మార్క్స్ మాత్రం దాన్ని ఒక అనైక్యతాస్థితిగా చెప్పి, గతితార్కికంగానే కాకుండా, చారిత్రికంగా అర్థం చేసుకుని, పరాయీకరణ అనేది పని ప్రాకృతిక అవసరానికి ప్రత్యక్షంగా, శ్వాసించడమంత సహజ కార్యకలాపంగా వుండే కమ్యూనిస్టు సమాజంలో మాత్రమే అంతం అవుతుందని చెప్పాడు.

సంప్రదాయ అర్థశాస్త్రవేత్తలకు పని ఎప్పుడూ బలవంతపు కార్యమే కానీ శ్రమైక జీవన సౌందర్యాన్ని వేనోళ్లా కొనియాడే మార్క్స్ మహోనీయుడికి శ్రమ ఒక మధురానుభూతి! అందుకే మార్క్స్ యావత్ మానవ జాతీ గర్వించదగ్గ అత్యున్నతస్థాయి ప్రతిభామూర్తి అయ్యాడు!!

స్వీయ విధ్వంసానికి కావలసిన సామగ్రి శ్రామికుడు తన శ్రమ ద్వారా అందిపుచ్చుకుంటే, పెట్టుబడిదారుడు మాత్రం తన పరాయీకరణ విషయంలో తానొక క్రియా శూన్యుడు. ఉత్పత్తి ఆధీనంలో వున్నా కూడా దురాశ, క్రూరత్వం, కపటం అనే విశిష్ట గుణాల సమాహారంగా వుండే వీడు ఎక్కువ సరుకులు కొనగలిగే వినిమయదారుడుకూడా!

రాజ్యం మనుషుల నకిలీ సమానత్వం మీద ఆధార పడుతుంది. ఉత్పత్తిసంబంధాల పునాది పైన నిర్మించబడ్డ రాజ్యం పరాయిరూపం సంతరించుకుని మనిషిని పరాయి చేస్తుంది. సరకుల్ని ఆరాధించడం నేర్చుకున్నవాడు నాయకుడ్ని కూడా ఆరాధించడం మొదలెడతాడు. దేశభక్తి దేశంతో ముడిబడ్డ వ్యక్తి నిరపేక్షరకపు అనుబంధం. ఈ దేశభక్తుడు రూపంలేని సమూహం పట్ల విధులు గుర్తిస్తాడు కానీ నిజమైన సజీవ ప్రజల పట్ల కాదు!

పరాయీకృత చైతన్యం, పరాయీకృత కార్యకలాపాల వల్లే పుట్టింది. ఫలితాలు కూడా పరాయీకృతమైనవిగానే వుంటాయ్. పెట్టుబడిదారీవ్యవస్థలో ప్రతిదీ ధరకే దొరుకుతాయి. డబ్బుతో సేవలూ, ఉత్పత్తులూ కొలవడం అంటే పరాయీకరణ రాజ్యం చేస్తున్నట్టే! డబ్బొక యూనివర్సల్ ప్రాస్టిట్యూట్ ఇక్కడ! దేన్నైనా కొనేస్తుందది!

చరిత్రలో మొట్టమొదటి పరాయీకృత శ్రమవ్యవస్థ బానిస వ్యవస్థ అయితే చిట్టచివరిది వేతన వ్యవస్థ. మన దేశంలో వెట్టి, దాసీ, వ్యవస్థలు పరాయీకరణకు ఉదాహరణలే! హిందూ మతం శూద్రుల్ని మత వ్యవస్థ నుంచి నిరాకరించి పరాయిని చేసింది. పెట్టుబడిదారీ సంస్కృతిలో కులం మతంలో ఘనీభవించి ఒకప్పుడు పునాదిగా వుంటూ వచ్చి, క్రమంగా ఒక ఉపరినిర్మాణాంశంగా మారింది. మత భావజాలం కూడా డబ్బుతో పునీతమైంది! పాపం చేసి డబ్బు సంపాదించాక దేవుడికి ఒక వజ్రాల కిరీటాన్ని ఇచ్చేసి పాపం అనే ఫైన్‌ని రద్దు చేసుకొనే సౌలభ్యాన్ని పెట్టుబడిదారీవ్యవస్థ కల్పించింది! డబ్బున్న శూద్రుడు యాగం చేసే రాయితీ కూడా పెట్టుబడిదారీవ్యవస్థ కల్పించింది!

ఆధునిక సైన్స్ పెట్టుబడికి బానిసై విద్యా, వైద్య, ఔషధ, మీడియా రంగాల్ని ఎలా భ్రష్టు పట్టిస్తుందో అనేక సజీవ ఉదాహరణలతో చూపారు. వస్తువు పట్ల ఆరాధనని సృష్టించి ఫ్యాషన్ రంగాన్ని లాభం కోసం మలచిన వికృతి మోకాళ్ళు చించుకొని, మూతికి రంగు పులిమి, చెత్త కుండీల దగ్గర పాత వస్తువులు ఏరుకునే వారి వలే వుండే స్థాయికి ఆధునిక యువతీ యువకులు దిగజారడం వెనుక ఉన్న విషాదాన్ని గొప్పగా చెబుతారు. వినిమయతత్వం ప్రబోధించే పెట్టుబడిదారీ ప్రపంచం మనిషి సహజాత కోరికల్ని తన వ్యాపారం కోసం మార్చి ఆఖరికి సైన్స్‌ను కూడా తన పాదాల కింద ఎలా దాసోహం చేసుకుందో వివరించిన తీరు అద్భుతంగా ఉంది. ఈ వ్యాసంలో రావుగారు విశ్లేషించిన విషయాలు చదువరులకు ఈ ప్రపంచాన్ని ఎలా అర్థం చేసుకోవాలో చెప్పి మనం ఏం చేయాలో స్పష్టపరుస్తాయి.

ముగింపులో రావు గారు చారిత్రక అవశ్యంగా, అభివృద్ధికి కారకాలుగా వుంటూ వచ్చిన ఈ పరాయీకరణ ప్రపంచాన్ని మార్చే ప్రయత్నంలో ఎలా అడ్డుతగులుతుందో ప్రతిభావంతంగా వివరించారు. నిజానికి ఈ పుస్తకానికి ఇదే తలమానికం. వర్గ చైతన్యం, వర్గ స్పృహ, ఐకమత్య భావనల నుండి దూరమైన శ్రామికుడు ఎలా పోరాడాల్సి ఉంటుందో తెలుసుకోవాలంటారు.

చివరిగా, ఎంగెల్స్ చెప్పినట్లుగా అమానవీయమైన పరిస్థితులకు వ్యతిరేకంగా జరిపే పోరాటంలో మాత్రమే మనం మానవులుగా మిగులుతామనీ, కాబట్టి మానవత్వాన్ని మనకు కాకుండా చేస్తున్న పరాయీకరణకు వ్యతిరేకంగా మానవత్వాన్నే ఆయుధంగా చేసుకొని పోరాడాల్సిందిగా పిలుపునిస్తారు రచయిత. ❑

## ప్రపంచంలో అరుదైన రైతుల ప్రదర్శన

**(14వ పేజీ తరువాయి)**

## ఘాజీపూర్ బోర్డర్ -బీ బీ సీ. వార్త

ఘాజీపూర్ బోర్డర్ లో ధర్నా ఎలా కొనసాగుతోందో బీబీసీ ప్రతినిధి సమీర్ ఆత్మ మిశ్రా ఇలా వివరించారు.

“గురువారం ఘాజీపూర్ బోర్డర్‌లో రైతులను ఖాళీ చేయించటానికి అధికారయంత్రాంగం ప్రయత్నించింది. రాకేష్ తికాయత్‌పై కేసు నమోదయంది. అరెస్టు కావటానికి కూడా తయారయ్యారు.” స్థానికులపేరున కొంతమందిని తెచ్చి ఖాళీచేయించ ప్రయత్నంపై తికాయత్ ఆవేదన పొందారు. మంచినీటిని కూడా ఆపేశారు. దానికి స్పందనగా రాకేష్ తికాయత్ ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. “మావూరునుండి మంచినీరు వచ్చిందాకా మంచినీరు ముట్టనని” శపథం చేసి, నిరాహార దీక్షకు కూర్చున్నారు. అప్పటికపుడు మహాపంచాయత్ నిర్వహణకు పిలుపునిచ్చారు. ముజఫర్నూర్‌లో రైతు సంఘాల నేతలు రైతులతో మహా పంచాయతీ నిర్వహించారు. ఢిల్లీకి 150 కి మీ దూరంలో వున్న ఈ ప్రాంతం రైతాంగఉద్యమాలకు పెట్టని కోట. రైతునేత మహేంద్ర తికాయత్ స్వస్థలం సిసోలీ గ్రామం. మహేంద్ర తికాయత్ కుమారుడు నరేష్ తికాయత్ బీకేయూకి అధ్యక్షుడిగా వున్నాడు. రాకేష్ తికాయత్ మరొక కుమారుడు. ఇద్దరూ ప్రస్తుతం రైతు ఉద్యమంలో భారత్ కిసాన్ యూనియన్‌కి నాయకత్వం వహిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలని మహా పంచాయత్ నిర్ణయం తీసుకున్నది. మీరట్, షామ్లీ, షాహన్పూర్ పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లోని రైతులందరూ ఘాజీపూర్ సరిహద్దులో జరుగుతున్న ధర్నాలో ఇక పై ప్రతిరోజూ పాల్గొనాలని, ఉద్యమాన్ని కొనసాగించాలని, ప్రతి ఇంటినుంచీ ధర్నాలో పాల్గోవాలని నిర్ణయమైంది. ధర్నా ముగిసిపోయినట్లు కనిపించిన స్థలం ప్రజలతో కిటకిటలాడుతోంది. నినాదాలతో హోరెత్తిపోతోంది. ప్రధాన రోడ్డులకు అడ్డంగా బస్సులు నిలిపారు. పోలీసులకు ఇనుప లాఠీలను సరఫరా చేస్తున్నారు. అయినా పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌లతో పాటుగా ఉత్తరప్రదేశ్ రైతులు తికాయత్ సోదరుల నాయకత్వాన ఉద్యమంలోకి ఉరుకుతున్నారు. పంజాబ్–హర్యానాల నుంచి ప్రయాణించే పంజాబ్ మెయిల్‌తో సహా రెండు రైళ్ళను దారి మళ్ళించారు. అధికారుల వేధింపులకు, నిర్బంధాలకు నిరసనగా, కనీస మద్దతు ధర కావాలనీ, రైతాంగ వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలనీ దేశవ్యాప్తంగా ఈనెల 6న మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు రహదారులను దిగ్బంధించాలని రైతుసంఘాల సమన్వయ సంఘం పిలుపు నిచ్చింది. ప్రజలందరూ పాల్గొన ప్రార్థన. ❑

RNI Regn No. 52879/93


# రత్న నర్సింగ్ హోమ్

# Ratna Nursing Home

రైల్వే ఓవర్‌బ్రిడ్జి వద్ద, సజ్జాపురం

**తణుకు**

*Consulting Doctors*

**డా॥ వల్లూరి సోమశేఖర్**
M.B.B.S., D.C.H, M.D. (Gen Medicine)
Regd. No. 16999

**డా॥ బిక్కిన ఘనశ్యామ్**
M.B.B.S., M.D. (Gen Medicine)
Regd. No. 78473

**డా॥ వల్లూరి సుబ్బలక్ష్మి**
M.B.B.S., D.G.O.
Regd. No. 18121

**డా॥ బిక్కిన అమృత రత్న**
M.B.B.S., M.S., (OBG/Gynea)
Regd. No. 85666


**JAATEEYA SPURTHI,** Fortnightly Printed and **Published by N. Venkateswara Rao**
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : D V V S Varma**